www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 318
శనివారం | 15-2-2025
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 11.53 తదుపరి చవితి; నక్షత్రం: ఉత్తర రా. 1.39 తదుపరి హస్త వర్జ్యం: ఉ. 7.06-8.52; దుర్ముహూర్తం: ఉ. 6.45-8.17; అమృతఘడియలు: సా. 5.42-7.28; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.45; సూర్యాస్తమయం: 6.13
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


వైట్ హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ

తగ్గేదే లే..!

అమెరికా ఉత్పత్తులపై భారత్ ఎంత సుంకం విధిస్తుందో మేమూ అంతే వేస్తాం

ప్రధాని మోదీ సమక్షంలో తేల్చిచెప్పిన ట్రంప్
అమెరికా అధ్యక్షుడితో సమావేశమైన ప్రధాని మోదీ
వాణిజ్యం, రక్షణ సహా పలు అంశాలపై విస్తృత చర్చ
భారత్‌కు ఎఫ్-35లు ఇచ్చేందుకు సిద్ధమన్న ట్రంప్
26/11 దాడి కేసు నిందితుడు తహవూర్ రాణాను
భారత్‌కు తక్షణమే అప్పగించనున్నట్టు ప్రకటన
2030 నాటికి రెండు దేశాల మధ్య 500 బిలియన్
డాలర్ల వాణిజ్యమే లక్ష్యంగా మిషన్ 500 ప్రకటన
అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను
వెనక్కి తీసుకోవడానికి సిద్ధం: ట్రంప్‌తో మోదీ
119 మందితో నేడు అమృత్‌సర్‌కు మరో విమానం
ఆదివారం మరో విమానం వచ్చే అవకాశం
హెచ్-1బీ పునరుద్ధరణలో మరింత జాప్యం
డ్రాప్‌బాక్స్ అర్హత 12 నెలలకు కుదింపు
భారతీయ దరఖాస్తుదారులపైనే తీవ్ర ప్రభావం

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: భారత ప్రధాని నరేంద్ర మోదీని గొప్ప మిత్రుడిగా అభివర్ణించినా.. ఆత్మీయ ఆలింగనాలు, సుదీర్ఘకరచాలనాలతో ఆహ్వానించినా.. సుంకాల విషయంలో మాత్రం తగ్గేదే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పేశారు! 'కంటికి కన్ను.. పంటికి పన్ను' అన్న సామెత చందంగా.. తమ దేశ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధించే దేశాలపై తామూ అధిక పన్నులు విధి స్తామని స్పష్టం చేశారు. "అది ఇండియా కానివ్వండి, మరే దేశ మైనా కానివ్వండి.. మా ఉత్పత్తు లపై తక్కువ సుంకాలు విధిస్తే మేమూ అలాగే విధిస్తాం. భార త్ ఎలా వసూలు చేస్తే.. మేమూ అలాగే వసూలు చేస్తాం" అని సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ సాక్షిగా.. ఆయన పక్కనే నిలబడి.. సంయుక్త పత్రికా సమావేశంలో ఎలాంటి శషభిషలూ లేకుండా నిర్మొహమాటంగా ప్రకటిం చారు. తనకన్నా మోదీనే మెరుగైన బేరగాడని వ్యాఖ్యా నించారు. త్వరలోనే భారీ వాణిజ్య ఒప్పందాన్ని కుదు ర్చుకునేందుకు రెండు దేశాలూ ఎదురుచూస్తున్నా యన్న ట్రంప్.. అమెరికాకు చెందిన కొన్ని ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న సుంకాలు అన్యాయంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. కాకపోతే.. భారతదేశంతో పోలిస్తే చైనా, యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్యసంబం ధాలు చాలా క్లిష్టంగా ఉంటాయని ఆయన పేర్కొ న్నారు. భారత్‌తో తన తొలి హయాంలో జరిపిన చర్చల వల్ల సుంకాలు తగ్గలేదని.. అందుకే ఈసారి పరస్పర సుంకాల విధానాన్ని అనుసరించాలని నిర్ణ యించినట్టు తెలిపారు. మోదీతో భేటీ కావడానికి కొన్ని గంటల ముందు ఆయన ఈ పరస్పర సుంకాలకు సంబంధించిన ఉత్తర్వుపై సంతకం చేశారు. ఆ సమ యానికే.. స్పేస్‌ఎక్స్ చీఫ్ ఈలన్ మస్క్ ప్రధాని మోదీతో భేటీ అయిన నేప థ్యంలో విలేకరులు ట్రంప్‌ను మస్క్-మోదీ భేటీ గురించి అడిగారు. అప్పుడు కూడా ట్రంప్ భారత్ అధిక సుంకాల గురించి ప్రస్తావి ంచడం గమనార్హం. ఆ తర్వాత కొన్నిగంటలకు (భారత కాల మానం ప్రకారం శుక్రవారం తెల్ల వారుజామున 3 గంటల సమ యంలో) ప్రధాని మోదీ శ్వేతసౌధా నికి చేరుకుని ట్రంప్‌ను కలిశారు. తన చిరకాల మిత్రుడైన మోదీకి ట్రంప్ ఆత్మీయ స్వాగతం పలికారు. సుదీర్ఘ కరచాలనం.. గాఢ ఆలింగ నంతో ఓవల్ ఆఫీసులోకి తీసుకెళ్లారు. మోదీని గొప్ప స్నేహితుడిగా, అద్భుతమైన వ్యక్తిగా అభివర్ణిస్తూ.. తన సిబ్బందికి పరిచయం చేశారు. మళ్లీ మోదీవైపు తిరిగి.. "మేం మిమ్మల్ని మిస్ అయ్యాం.. చాలా మిస్ అయ్యాం అన్నారు. మోదీ కూడా.. ట్రంప్‌ను మళ్లీ కలిసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా



మిగతా 12వ పేజీలో...



మనది మెగా భాగస్వామ్యం

ప్రెసిడెంట్ ట్రంప్ ఎప్పుడూ మాగా (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) గురించి మాట్లాడుతుంటారు. మేం మా దేశంలో 'వికసిత్ భారత్' లక్ష్యంతో పనిచే స్తున్నాం. దాన్ని.. 'మేక్ ఇండియా గ్రేట్ ఎగైన్' అనొచ్చు. రెండూ (మాగా+మిగా) కలిస్తే.. అది సౌభాగ్యానికి మెగా భాగస్వామ్యం అవుతుంది.

- ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్



బేరాల్లో నాకంటే మోదీనే బెటర్

'మీ ఇద్దరిలో బాగా బేరసారాలు చేయగలిగేది ఎవరు?' అని విలేకరులు అడిగిన ప్రశ్నకు.. ఆ విష యంలో మోదీనే తనకంటే చాలా మెరుగని, ఆయనకు అసలు పోటీయే లేదని ట్రంప్ చెప్పారు.

ఎఫ్-35 డీల్.. జరిగే పనేనా?

మన రష్యన్ క్షిపణి వ్యవస్థ ఓ అడ్డంకి
సొంత తయారీకే భారత్ మొగ్గు?
ట్రంప్‌ది ప్రతిపాదన మాత్రమేనన్న
భారత విదేశాంగ కార్యదర్శి 13

పరస్పర పన్నుతో నష్టమే!

అమెరికా-భారత్ వాణిజ్యంలో
ఇప్పటి వరకూ భారత్‌దే పైచేయి
ఎగుమతులెక్కువ, దిగుమతులు తక్కువ
అమెరికా కంటే మన సుంకాలు అధికం
పరస్పర పన్నుతో పరిస్థితి మారే చాన్స్
ఆటోమొబైల్స్, ఇంధనం, రక్షణ
రంగాలపై తీవ్ర ప్రభావం 12

అదానీ అంశం వ్యక్తిగతం

ట్రంప్‌తో చర్చించే విషయం కాదది
అమెరికాలో మీడియాతో ప్రధాని 12
పర్యటన ముగించుకొని భారత్‌కు మోదీ

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి!

నేడు పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించాలి

ఎన్నికల సిబ్బందికి శిక్షణనూ పూర్తిచేయండి
అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో
పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ సృజన

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం.. శనివారం రాష్ట్రంలోని 570 జడ్పీటీసీ, 5817 ఎంపీటీసీ స్థానాల పరిధిలో నిర్ధారించిన పోలింగ్ కేంద్రాల జాబి తాను ప్రకటించాలని ఆదేశించారు. శుక్రవారం జడ్పీ సీఈవోలు, డీపీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేయడం తోపాటు ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను కూడా కొనసాగించాలన్నారు. పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రి యకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకొని, సిద్ధంగా ఉండాలని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలో ఉందని.. న్యాయస్థానం ఇచ్చే మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ



మిగతా 2వ పేజీలో...

సర్వేలో పాల్గొనకుంటే కేసీఆర్ కుటుంబానికి శిక్ష..

సామాజిక బహిష్కరణే!

పాల్గొంటే తమ లెక్క తేలుతుందనే భయం
దామాషాలో వారికి దక్కేది వార్డు మెంబరే
నేనే చివరి రెడ్డి సీఎం అయినా ఫర్వాలేదు
త్యాగానికి సిద్ధపడే ఈ లెక్కలు తేల్చిన
నాయకుడి మాట పాటించే ఈ స్థాయికొచ్చా
ఈ లెక్కల్ని తప్పుపడితే నష్టపోయేది బీసీలే
ప్రధాని నరేంద్ర మోదీ కన్వర్టెడ్ బీసీ..
ఓసీగా పుట్టి కులాన్ని బీసీల్లో చేర్చుకున్నాడు
వర్గీకరణ అమలుకు చట్టం: సీఎం రేవంత్‌రెడ్డి
పేదల కోసం పని చేస్తేనే పదవులు.. ఢిల్లీ
పైరవీలతో రావు: యూత్ కాంగ్రెస్‌తో సీఎం

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్

జార్ఖండ్ ఇన్‌చార్జిగా కొప్పుల రాజు
దేశంలోని పలు రాష్ట్రాలకు ఇన్‌చార్జులను
నియమించిన కాంగ్రెస్ అధిష్ఠానం


కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ శ్రేణులకు అవగాహన సదస్సులో సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈ నెల 16 నుంచి చేపట్టనున్న కులగణన సర్వేలో వివరాలు నమోదు చేయించుకోకుంటే కేసీఆర్ కుటుంబానికి సామాజిక బహిష్కరణే శిక్ష అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సర్వేలో వివరాలు నమోదు చేయించుకోవాలంటూ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఇళ్ల ముందు మేల్కొలుపు డప్పు కొట్టాలంటూ బీసీలకు

మిగతా 2వ పేజీలో...

టీ20లా రాజకీయాలు

ఇష్టం లేకున్నా ఆడుతున్నా.. 2
నేతల మాటలు పిల్లలు వినకూడదని
తల్లిదండ్రులు చానల్ మార్చేస్తున్నారు
నిలవాలి.. గెలవాలి.. లేదంటే ఓడినట్లే
దేవేందర్ గౌడ్ 'విజయ తెలంగాణ'
పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్



ఎల్‌ఆర్‌ఎస్ రుసుములో

10% రాయితీ?

పురపాలక శాఖ అధికారుల ప్రతిపాదనలు

మందకొడిగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం
వచ్చినవి 25.70 లక్షలు.. పరిశీలించినవి 9 లక్షలు
క్రమబద్ధీకరణకు అనుమతించినవి 1.70 లక్షలే!
గత ఆగస్టులో ప్రభుత్వ ప్రకటన.. ప్రజల అనాసక్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'లేఅవుట్ క్రమబ ద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)' కింద 2020లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తామంటూ ప్రభుత్వం గత ఏడాది ఆగస్టులో కీలక నిర్ణయం తీసుకుంది. అయినా దరఖాస్తుల పరిష్కారం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఈ ప్రక్రియలో పలు లోపాలను గుర్తించిన అధికారులు.. రాబోయే మూడు నెలల్లో వీలైనన్ని ఎక్కువ

మిగతా 3వ పేజీలో...

మళ్లీ అదే 'తప్పు'!

జేఈఈ మెయిన్ సెషన్-1
పరీక్షలో 12 ప్రశ్నలు తొలగింపు
గత ఏడాదితో పోలిస్తే రెట్టింపు
సిలబస్ దాటి ప్రశ్నలు,
అనువాదంలో లోపాలు 10
ఎన్‌టీఏ తీరుపై సర్వత్రా విమర్శలు

డీఎస్సీ-2008 అభ్యర్థులు ఇక తాత్కాలిక ఎస్జీటీలు

1,382 మంది భర్తీకి
జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు 2

అక్కంపల్లి రిజర్వాయర్‌లో

చచ్చిన కోళ్లు

బర్డ్‌ఫ్లూతో మృతి చెందిన కోళ్లుగా అనుమానం
కాల్వలో పడేసిన కోళ్ల ఫాం నిర్వాహకుడిపై
కేసు.. అరెస్టు.. విచారణకు ఆదేశించిన కలెక్టర్
మూడంచెల్లో శుద్ధితో నీటి సరఫరా
ప్రజలు ఆందోళన చెందవద్దు: జలమండలి

పెద్ద అడిశర్లపల్లి/దేవరకొండ/హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జంట నగరాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 600 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అక్కంపల్లి రిజర్వాయర్‌లో.. ఓ కోళ్ల ఫాం నిర్వాహకుడు పెద్దసంఖ్యలో మృతి చెందిన కోళ్లను పడేశాడు. ఏపీలో బర్డ్ ఫ్లూతో కోళ్లు మృతి చెందుతున్న నేపథ్యంలో

మిగతా 10వ పేజీలో...


రిజర్వాయర్ నుంచి బయటకు తీసిన కోళ్లు


పట్టుపడ్డ నగదుతో గద్వాల డీపీవో శ్యామ్ సుందర్, పుల్లూరు గ్రామ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

లంచం కిక్కుతో

ఏసీబీకి చిక్కారు

వెంచర్ మేనేజర్ నుంచి రూ.2 లక్షలు
తీసుకున్న డీపీవో, పంచాయతీ కార్యదర్శి
ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఏడీఈ రూ.50 వేలు..
భూ సర్వే కోసం సర్వేయర్ రూ.12వేలు

అలంపూర్ చౌరస్తా, గచ్చిబౌలి, మర్రిగూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'పై సంపాదన' జేబులో పడితే కిక్కే వేరు కావొచ్చు గానీ పట్టుబడితే ఎన్ని చిక్కులో కదా! ఈ లాజిక్ మరిచి.. లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు వేర్వేరుచోట్ల నలుగురు అధికారులు! గద్వాల జిల్లా ఉండవల్లి

మిగతా 10వ పేజీలో...

హెచ్-సిటీలో..

2400 కోట్ల ప్రాజెక్టులు

పురపాలక శాఖ గ్రీన్ సిగ్నల్

నెలాఖరులోపు టెండర్లకు రంగం సిద్ధం
సీఎం సమీక్షించిన మర్నాడే నిర్ణయం
ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు..
10 ప్రాంతాల్లో 13.56 కి.మీ. వంతెనలు
6 చోట్ల 6.58 కి.మీ. రహదారుల విస్తరణ
కేబీఆర్ పార్కు చుట్టూ వంతెనలకు మోక్షం!

ఒకే పిల్లర్‌పై ఫ్లై ఓవర్, మెట్రో కారిడార్!

విప్రో చౌరస్తాలో డబుల్ డెక్కర్ నిర్మాణం
కింద వాహనాలు.. పైన మెట్రోరైల్
హెచ్-సిటీలో అధికారుల ప్రతిపాదన
నగరంలో అందుబాటులోకొచ్చే
తొలి డబుల్ వంతెన ఇదే!


కేబీఆర్ పార్కు చుట్టూ వంతెనలు, అండర్‌పాస్‌ల నమూనా చిత్రం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో ప్రధాన కూడళ్లు, మార్గాల్లో సిగ్నల్ చిక్కులు లేని ప్రయాణం, ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టేలా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రాజెక్టుల్లో కీలక అడుగు పడుతోంది. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ) ప్రాజెక్టుల్లో రూ.2400 కోట్ల పనులకు టెండర్లు పిలిచేందుకు పురపాలక శాఖ పచ్చజెండా ఊపింది. ఈ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించిన మరునాడే టెండర్లపై నిర్ణయం తీసుకుంది. దీంతో పది ప్రాంతాల్లో 13.56 కిలోమీటర్ల మేర

మిగతా 9వ పేజీలో...

బయో ఏషియా సదస్సుకు రండి

» కేంద్ర మంత్రి గోయల్‌కు శ్రీధర్ బాబు ఆహ్వానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 26న నిర్వహించబోయే బయో ఏషియా-2025 సదస్సుకు రావాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. జీవ విజ్ఞాన రంగంలో ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు, విధానాల రూపకర్తలు, పారిశ్రామిక నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. అలాగే, తెలంగాణలో జీవ విజ్ఞాన రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రి ప్రశంసించారని, బయో ఏషియా సదస్సుకు హాజరవుతానని చెప్పారని శ్రీధర్ బాబు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో మంత్రి శ్రీధర్ బాబు, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి కలిశారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులతోపాటు ఇతర ప్రధాన అంశాలపై చర్చించారు. కరీంనగర్ జిల్లా రుక్మాపూర్, జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లలో మెగా లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. జాతీయ పారిశ్రామిక మార్గ అభివృద్ధి సంస్థ(ఎన్ఐసీడీసీ) పరిధిలోని జహీరాబాద్ ప్రాంత అభివృద్ధిపై కేంద్ర మంత్రితో చర్చించారు. అలాగే, అంతర్జాతీయ వేదికగా తెలంగాణ రాష్ట్ర పెట్టుబడులు, పరిశ్రమల సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు జపాన్‌లో జరిగే ఎక్స్‌పో-2025లో తెలంగాణ పాల్గొనున్నట్టు కేంద్ర మంత్రికి తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తరఫున లేఖను ఆయనకు అందజేశారు.

ఆర్టీఏ సభ్యులు సేవలో ముందుండాలి: పొన్నం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రవాణా సేవల్లో ప్రజలకు తలెత్తే సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని, సేవలందించడంలో ముందుండాలని నూతనంగా నియమితులైన ఆర్టీఏ(నాన్ అఫీషియల్) సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. శుక్రవారం ఆయన సచివాలయంలోని తన కార్యాలయంలో సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ పార్కులు ఏర్పాటు చేయాలని సూచించారు. వారానికి రెండు పాఠశాలల్లో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని మొదట ఆస్పత్రికి తీసుకెళ్లిన వారికి రూ.5 వేల పారితోషికం అందేవిధంగా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. విమానయాన రంగంలో గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎయిర్‌లైన్స్ సంస్థలు చొరవ చూపాలని మంత్రి పొన్నం కోరారు. సచివాలయంలో మంత్రి పొన్నం.. ఇండిగో ఎయిర్‌లైన్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రీజినల్ హెడ్ పి. జగదీశ్వర్‌తోపాటు హెచ్‌ఆర్ బృందంతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యువతకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి విమానయాన రంగంలో అవకాశాలు కల్పించేందుకు అనువైన అంశాలపై వారితో చర్చించారు.

ఫోన్‌లో 'ఇందిరమ్మ ఇల్లు' దరఖాస్తు వివరాలు!

ఇకపై ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లకుండానే ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తు ఏ దశలో ఉందో పూర్తి వివరాలను ఫోన్ ద్వారానే తెలుసుకోవచ్చు. ఇందుకోసం ప్రభుత్వం https://indirammaindlu.telangana.gov.in అనే వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. వెబ్‌సైట్‌లోకి వెళ్లిన తర్వాత దరఖాస్తుదారు ఆధార్, రేషన్, ఫోన్ నంబర్లలో ఏదైనా ఒకదానిని ఇచ్చి.. ఇంటి కోసం సర్వే నిర్వహించారా, దరఖాస్తు ఏ దశలో ఉంది.. ఇల్లు మంజూరైందా, మంజూరైన ఇంటిని ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాల్లో ఎందులో పొందుపర్చారనే వివరాలను తెలుసుకోవచ్చు. అలాగే ఏవైనా అభ్యంతరాలున్నా ఈ వెబ్‌సైట్‌లోనే గ్రీవెన్స్ స్టేటస్‌లోకి వెళ్లి సెర్చ్ అనే ఆప్షన్‌ను ఎంచుకుని అందులో నమోదు చేసేందుకు కూడా వీలుంది.

ఈఆర్సీలో ఇద్దరు సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)లో ఖాళీగా ఉన్న ఇద్దరు సభ్యుల నియామకానికి దరఖాస్తులను కోరుతూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా నోటిఫికేషన్ ఇచ్చారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తులు పంపాలని తెలిపారు. ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం, రెండో అంతస్తు, రూమ్ నం.16, హైదరాబాద్-500004 అనే చిరునామాకు దరఖాస్తులు పంపాలని కోరారు. నియమ, నిబంధనలు మరిన్ని వివరాలకు www.telangana.gov.in, www.tgerc.telangana.go-v.in, www.tgsouthernpower.org, www.tggenco.com వెబ్‌సైట్‌లను సందర్శించాలని సూచించారు.

మేడ్చల్ జిల్లాలో 3 కొత్త మునిసిపాలిటీలు!

రాష్ట్రంలో మరో మూడు కొత్త మునిసిపాలిటీలను ఏర్పాటు చేయాలంటూ పురపాలక సంచాలకుల కార్యాలయం (సీడీఎంఏ) సర్కారుకు ప్రతిపాదనలు పంపింది. త్వరలోనే వీటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. అయితే ఇప్పటికే మూడు కొత్త మునిసిపాలిటీల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం లభించింది. వీటిని కూడా కలిపి ఆరు మునిసిపాలిటీలను ఒకేసారి ప్రకటించే అవకాశముంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న 3 మునిసిపాలిటీలూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోనే ఉన్నాయి. ఆ జిల్లాకు చెందిన ముచింతల, ఎల్లంపేట, అలియాబాద్‌లను మునిసిపాలిటీలుగా మార్చాలంటూ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

అర కోటి దాటిన గృహజ్యోతి లబ్ధిదారులు

రాష్ట్రంలో గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రభుత్వం గతేడాది మార్చి నుంచి 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కమ్) పరిధిలో 1,39,61,930 మంది గృహ వినియోగదారులు ఉండగా... ఇందులో 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందుతున్నవారి సంఖ్య 50,16,798 వరకు ఉంది. రాష్ట్రంలో తెల్లరేషన్‌కార్డులు 89,21,907 ఉన్నాయి. గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించినప్పుడు 42,51,736 మంది లబ్ధిదారులు ఉండగా.. ఈ సంఖ్య క్రమంగా పెరుగుతూ ఈ ఏడాది జనవరినాటికి 50,16,798కు చేరింది. ఇప్పటివరకు డిస్కమ్‌లు 4,62,56,188 జీరో బిల్లులు జారీ చేశాయి.

సహకార సంఘాల పదవీ కాలం పొడిగింపు

రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లోని సభ్యుల పదవీకాలాన్ని ప్రభుత్వం పెంచింది. సహకార సంఘాల్లోని సభ్యుల పదవీకాలం ముగియడంతో మరో 6 నెలలు లేదా ప్రభుత్వం మళ్లీ ఉత్తర్వులు ఇచ్చే వరకు పొడిగిస్తూ ప్రభుత్వం జీవో నంబర్ 74ను విడుదల చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో 904 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలున్నాయి. కాగా రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో సహకార సంఘాలను కూడా పునర్విభజించాలని, పునర్విభజనకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని జిల్లా అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించినట్టు మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

తాత్కాలిక ఎస్జీటీలుగా డీఎస్సీ-2008 అభ్యర్థులు

» 1,382 మంది భర్తీకి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు

డీఎస్సీ-2008 అభ్యర్థులకు ఊరటనిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డీఎస్సీలో ఎంపిక విధానాన్ని మార్చడంతో తమకు అన్యాయం జరిగిందని, ఎస్జీటీలుగా రావాల్సిన ఉద్యోగాలు రాలేదంటూ డీఎస్సీ-2008 అభ్యర్థులు గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ కాలం తర్వాత తీర్పు వచ్చింది. వారిని తాత్కాలిక ఉద్యోగులుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేసేందుకు ఆసక్తి చూపిన 1,382 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నర్సింహారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ జిల్లా మినహా ప్రస్తుతం జిల్లాల్లో ఖాళీగా ఉన్న ఎస్జీటీ పోస్టుల్లో వీరిని నియమించనున్నారు. ఇప్పుడున్న ఎస్జీటీలకు అందించే ప్రారంభ కనీస వేతనం రూ.31,040 వీరికి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీరికి ఇతర కాంట్రాక్టు ఉద్యోగుల మాదిరిగానే సెలవులు ఉంటాయి. 2018 రాష్ట్రపతి ఉత్తర్వు స్థానిక రిజర్వేషన్ ఆధారంగా జిల్లా స్థాయి భర్తీ జాబితా ప్రకారం వీరిని శనివారం నియమించుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అయితే వీరిని ప్రతి విద్యా సంవత్సరంలో మొదటి రోజు నియమించి చివరిరోజు తొలగిస్తారు. ఏటా ఇదే విధానంలో కొనసాగిస్తారు.

సర్వేలో పాల్గొనకుంటే కేసీఆర్ కుటుంబానికి శిక్ష...

సామాజిక బహిష్కరణే!



(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లోని ప్రకాశం హాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నేతలకు కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణలపైన అవగాహనా కార్యక్రమం జరిగింది. కులగణన సర్వేపైన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఎస్సీ వర్గీకరణపైన మంత్రి దామోదర్ రాజనర్సింహలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, ఇంత చెప్పినా కులగణన సర్వేలో వివరాలు నమోదు చేయకుంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను సామాజిక బహిష్కరణ చేయాలంటూ పిలుపునిచ్చారు. అత్యంత కీలకమైన కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణలపైన కాంగ్రెస్ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. ప్రత్యర్థి పార్టీ నాయకులు.. ప్రభుత్వం తీసుకున్న కులగణన ప్రక్రియ పైన అపోహలు సృష్టించి తప్పుల తడకన్న అభిప్రాయాన్ని కలిగించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన రాష్ట్రాల్లో కులగణన చేసి, బలహీన వర్గాల వారి జనాభాను లెక్క కట్టి, వారి కోటా వారికి ఇప్పించే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందంటూ రాహుల్ గాంధీ మాట ఇచ్చారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. రాహుల్ మాటను నిలబెట్టే బాధ్యతను తీసుకున్న తాము.. నిర్దిష్టమైన ప్రణాళికతో కులగణన ప్రక్రియను పూర్తి చేశామన్నారు. ప్రతి 150 ఇండ్లను ఒక యూనిట్ గా తీసుకొని, ఎన్యూమరేటర్లను నియమించి సంపూర్ణ సమాచారాన్ని సేకరించామని చెప్పారు. సర్వే మనమే రాసుకున్నమంటూ కేసీఆర్ లాంటి వారు మాట్లాడతారని ముందే ఊహించి, మాన్యువల్ డాక్యుమెంట్లలో ఇంటి యజమాని, ఎన్‌రోలర్, సూపర్ వైజర్లతో సంతకాలూ పెట్టించామన్నారు.

బలహీన వర్గాల లెక్క తేల్చాం!

బలహీన వర్గాలను ఏబీసీడీఈ కేటగిరీలుగా చేసి.. విడివిడిగా ఎంత మంది ఉన్నారని లెక్క తేలిస్తే.. 56.33 శాతం మంది ఉన్నారని లెక్క తేలిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. "మైనార్టీల లెక్క ఎట్ల తీస్తరని కొందరు అంటున్నారు. బీసీ ఈ కోటా కింద 4 శాతం రిజర్వేషన్లు పొందుతున్న మైనార్టీల లెక్క తీయక తప్పదు" అని సీఎం చెప్పారు. చెట్ల మీద విస్తర్లు కుట్టినట్లుగా 12 గంటల్లో సమగ్ర కుటుంబ సర్వే చేసిన కేసీఆర్ కాకిలెక్కలు అందించారన్నారు. ఎస్సీ ఉప కులాలు ఉన్నదే 59 అయితే సమగ్ర కుటుంబ సర్వేలో 82 ఉపకులాలు ఉన్నట్లుగా తేల్చారని రేవంత్ ప్రస్తావించారు. కులగణన సర్వేలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు పాల్గొని వివరాలు ఇచ్చిన తర్వాత లెక్కల గురించి మాట్లాడాలని స్పష్టం చేశారు. సర్వేలో పాల్గొనని కేసీఆర్‌కు తెలంగాణ సమాజంలో జీవించే హక్కే లేదన్నారు. వివరాలు ఇవ్వకుండా జన జీవన స్రవంతిలో లేని 16 లక్షల పైచిలుకు జనాభాలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వంటి గ్యాంబ్లర్స్ ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. సర్వేలో పాల్గొనని వారిలో కొందరు విధిలేక, ఆ సమయానికి లేక ఇవ్వక పోవచ్చునని, కేసీఆర్ లాంటి వారు తెలిసీ.. కావాలనే ఆ లెక్కల్లోకి రాలేదని ఆరోపించారు. "పోయిన మంత్రివర్గంలో కె.చంద్రశేఖర్‌రావు, కేటీ రామారావు, హరీశ్ రావు, దయాకర్‌రావు, వినోద్‌రావు ఆ రావు.. ఈ రావు.. ఇంతమంది ఎట్ల వచ్చినరంటూ ఇప్పుడు బీసీలు నిలదీస్తరనే భయంతోనే లెక్కల్ని గందరగోళం చేసి గంగలో కలపాలని కుట్ర చేస్తున్నరు. లెక్క తేలితే వాళ్లింట్లో వార్డు మెంబర్ తప్ప ఏ పదవీ రాదు" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

లెక్క తప్పంటే మళ్లా మొదటికి వస్తది

స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత ఏ కులాల వారు ఎంతున్నరన్న లెక్కను కాంగ్రెస్ ప్రభుత్వం తేలిస్తే అర్థం చేసుకోకుండా ఈ లెక్కను కొందరు బీసీలు తప్పు పడుతున్నారని రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లెక్క తప్పంటే వ్యవహారం మళ్లీ మొదటికి వస్తదని హెచ్చరించారు. కొందరు తెలియకుండానే కేసీఆర్ కుట్రకు సహకారం అందిస్తున్నారని వ్యాఖ్యానించారు. సర్వేలో సేకరించిన 8 పేజీల వివరాలు.. సర్వేలో పాల్గొన్న కుటుంబాలు సంతకం చేసి ఇచ్చినవేనని వివరించారు. సర్వేలో లెక్కలు చెప్పని 3.1 శాతం మంది.. ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జన జీవన స్రవంతిలో కలవాలని, వీరూ లెక్కల్లోకి వస్తే బీసీ, ఎస్సీ, మైనార్టీల శాతం పెరగడానికి అవకాశం ఉంటుందని చెప్పారు.

నేనే ఆఖరి రెడ్డి సీఎం అయినా ఫర్వాలేదు

"రేవంత్‌రెడ్డే ఆఖరి రెడ్డి సీఎం అంటూ ఒకాయన మాట్లాడారు. నేను ఆఖరి రెడ్డి సీఎం అయినా ఫర్వాలేదు. మా నాయకుడు ఇచ్చిన మాటను నిలబెట్టాలని క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా, సీఎంగా కులగణన సర్వే బాధ్యత తీసుకున్న. త్యాగానికి సిద్ధమయ్యే ఈ లెక్కలను పక్కాగా చేయించిన. ఈ లెక్కల్లో తప్పే చేయాలనుకుంటే మా రెడ్డీలను 5 శాతం లోపు.. బీసీలను 50 శాతం పైన ఎందుకు చూపుతా?" అని రేవంత్ ప్రశ్నించారు. నాయకుడు ఇచ్చిన మాటను నిలబెట్టడమే ధర్మం అనుకుని ప్రతి మనిషి సమాచారం పక్కాగా సేకరించామన్నారు. పార్టీ సిద్ధాంతాలు, నాయకుని ఆదేశాలు పాటించాము కాబట్టే ఈ రోజున ఇక్కడికి రాగలిగానని చెప్పారు. దేశంలో ఏ నాయకుడైనా చేశాడా? అన్నది ఆలోచన చేయాలన్నారు.

మోదీ.. కన్వర్టెడ్ బీసీ

ప్రధాని మోదీ పుట్టుకతో బీసీ కాదని, చట్టపరంగా బీసీగా మారారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మోదీ పుట్టుకతో ఉన్నత కులానికి చెందిన వారని, 2001లో ముఖ్యమంత్రి అయ్యాక తన కులాన్ని బీసీలోకి చేర్చుకున్నారని చెప్పారు. మోదీ సర్టిఫికెట్లో బీసీ ఉండొచ్చునేమో కానీ.. ఆయన మనస్తత్వం మాత్రం బీసీలకు వ్యతిరేకమన్నారు. మోదీ నిజంగా బీసీ అయితే 2021లో జనగణన ఎందుకు చేయలేదని, ఆ లెక్కల్లో బీసీ కులాల లెక్క ఎందుకు తేల్చలేదని ప్రశ్నించారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణననూ పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలను నష్ట పరచాలని ఒక పక్కన మోదీ, ఇంకో పక్కన కేడీలు కుట్రలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ కులగణన లెక్కలు చూపి.. రాహుల్‌గాంధీ మోదీ మెడలు వంచుతారనే భయంతో ఈ లెక్కలను కోల్డ్ స్టోరేజీలో పెట్టించాలనే కుట్రలు బీజేపీ చేస్తున్నదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కులగణన లెక్కలను తప్పు పడితే నష్ట పోయేది బీసీలేనన్నారు. రాష్ట్రంలో బీసీ జనాభా 56.33 శాతంగా ఉందంటూ ప్రభుత్వం అధికారికంగా తేల్చిన నేపథ్యంలో రిజర్వేషన్ పెంపునకు చట్టాన్ని సవరించాల్సిన ఒత్తిడి కేంద్రంపైన ఉంటుందని వివరించారు.

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని చేయబోతున్నాం

ఎస్సీ వర్గీకరణ చట్టాన్నీ చేయబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఎస్సీ కులాలను తాము వర్గీకరిస్తే దాన్ని కూడా తప్పు పట్టాలని చూస్తున్నారన్నారు. ఏ పార్టీ కూడా చేయని సాహసోపేత కార్యక్రమాలను తమ మంత్రి వర్గం చేస్తోందని చెప్పారు.

కార్యకర్తలకు అనుకున్నంత న్యాయం చేయలేక పోయాం: మహేష్‌గౌడ్

కార్యకర్తల కృషితో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ అన్నారు. అయితే అనుకున్న స్థాయిలో న్యాయం జరగలేదని చెప్పి వారు ప్రభుత్వంపై కొంత అలిగినట్లున్నారని వ్యాఖ్యానించారు. అందుకే ప్రభుత్వ పరంగా అభివృద్ధి కార్యక్రమాలు ఎంత చేసినా అనుకున్న స్థాయిలో సానుకూలత కనిపించడం లేదన్నారు. కులగణన వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతలను కార్యకర్తలు తీసుకోవాలన్నారు. కులగణన సర్వేలో వివరాలు ఇచ్చి.. జనజీవన స్రవంతిలో కలవాలంటూ కేసీఆర్, కేటీఆర్‌లకు డిప్యూటీ సీఎం భట్టి సూచించారు.

రెండేళ్లలో యంగ్ ఇండియా

గురుకులాల నిర్మాణం

» విద్యా శాఖ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం

» చాకలి ఐలమ్మ వర్సిటీలో అన్ని వసతులు ఉండాలని సూచన

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో 105 నియోజకవర్గాల్లో అన్ని రకాల మౌలిక వసతులతో యంగ్ ఇండియా గురుకుల పాఠశాలల నిర్మాణం వంద శాతం పూర్తి కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. యంగ్ ఇండియా గురుకులాలు, వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం పనులపై విద్యాశాఖ అధికారులతో ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా గురుకుల పాఠశాలలకు సంబంధించిన భూసేకరణ, ఇతర వివరాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నియోజకవర్గాల్లో స్థలాల కేటాయింపు పూర్తయితే.. తగిన అనుమతులు అందించి పనుల్లో వేగం పెంచాలన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటన చేసి పాఠశాలలకు ప్రతిపాదించిన స్థలాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. స్థలాలు అనువుగా లేకపోతే ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. స్థలాల గుర్తింపుపై వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇక, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. అకడమిక్ బ్లాక్, ఆట స్థలం, ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

డెస్టినేషన్ వెడ్డింగులకు

తెలంగాణకు రావాలి

» ఉపాధి కల్పించే విధంగా పర్యాటకం

» ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడమే కాకుండా ఎక్కడికక్కడ యువతకు ఉపాధి కల్పించే వనరుగా పర్యాటక శాఖ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పర్యాటకులను ఆకర్షించే వనరులు ఎన్నో ఉన్నా, ప్రచారంపై శ్రద్ధ చూపక పోవడం, వినూత్న పద్ధతిలో ఆలోచించక పోవడంతో ఈ రంగంలో ఆశించిన ప్రగతి కనిపించలేదని చెప్పారు. పర్యాటక శాఖపై శుక్రవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్‌లో బోట్ హౌస్ అందుబాటులో ఉంచాలని, డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు తెలంగాణను వేదికగా మార్చాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు తగిన ప్రోత్సాహకాలు అందించాలని పిలుపునిచ్చారు. భువనగిరి కోట రోప్ వే పనులపై సీఎం ఆరా తీశారు. త్వరగా రోప్‌వే పనులకు టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. సాహస క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఢిల్లీ పైరవీలతో

పదవులు రావు

» పేదల కోసం పని చేస్తేనే వరిస్తాయి

» యువజన కాంగ్రెస్‌కు రేవంత్ ఉద్బోధ

హైదరాబాద్, ఫిబ్రవరి 14, (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నుంచి పైరవీలతో కాకుండా గల్లీలో పేదల కోసం పని చేసే వారినే పదవులు వరిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. డబ్బులతో కాకుండా నిత్యం ప్రజల్లో ఉండే వారినే గెలుపు వరిస్తుందని చెప్పారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన యువజన కాంగ్రెస్ నేతల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పార్టీ అనుబంధ విభాగాల్లో బాధ్యత తీసుకున్న వారికి ప్రభుత్వంలో స్థానం కలిపిస్తామన్న మాట నిలబెట్టుకున్నామని, 37 కార్పొరేషన్ చైర్మన్ పదవులను అనుబంధ విభాగాలకు అందించామని ప్రస్తావించారు. రాజకీయ రంగ ప్రవేశానికి యువజన కాంగ్రెస్ మొదటి మెట్టు అని రేవంత్ వ్యాఖ్యానించారు. చంద్రబాబు, కేసీఆర్‌లు అక్కడి నుంచే ప్రయాణం ప్రారంభించారని చెప్పారు. కార్యకర్తలు భుజాలు కాయలు కాసేలా జెండాను మోసి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారన్నారు. అలాంటి వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు దక్కేలా చూస్తామని ప్రకటించారు. ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, రైతులకు రుణమాఫీ చేశామని, కేసీఆర్ ఎగ్గొట్టిన రైతు బంధు వేశామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రం తెలంగాణే అని చెప్పారు. మోదీ మందకృష్ణను ఎన్నోసార్లు కౌగలించుకున్నారని, అది ధృతరాష్ట్ర కౌగిలిగానే మిగిలిందని వ్యాఖ్యానించారు. కొడితే గట్టిగా కొడతానని ప్రతిజ్ఞలు చేస్తున్న కేసీఆర్ ముందుగా దుర్మార్గంగా ప్రజలను దోచుకున్న కొడుకును, అల్లుడిని, బిడ్డను కొట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌ను కేటీఆర్, కేజ్రీవాల్‌ను కవిత ఓడించారని వ్యాఖ్యానించారు. కుర్చీలో ఉన్నప్పుడే ప్రజలు కేసీఆర్‌ను బండకేసి కొట్టి ఓడించారని, ఇప్పుడు బయటికొచ్చి ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. చానెళ్లు, పత్రికలు బీఆర్ఎస్ చేతిలో ఉన్నపుడే కాంగ్రెస్‌ను ఏమీ చేయలేక పోయారని, ఇప్పుడు సోషల్ మీడియా దుష్ప్రచారంతో ఏదో చేయగలమనుకుంటే భ్రమేనని వ్యాఖ్యానించారు. తెలంగాణకు చిల్లిగవ్వ ఇవ్వని మోదీపై పోరాటానికి సిద్ధమని ఉద్ఘాటించారు. సమయం ఇవ్వాలని సంయమనం పాటిస్తున్నామని, త్వరలోనే అన్ని సమస్యలపై కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా

సిద్ధంగా ఉండాలి!

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పక్కాగా చేపట్టాలని, ఊళ్లన్నీ పరిశుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందిన గ్రామాల పరిధిలో ఇంటి పన్ను హేతుబద్ధీకరణపై దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీలకు రావాల్సిన పన్నులను రాబట్టుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు.

ఇష్టం లేకున్నా ఆడుతున్నా!

రాజకీయాలు టీ ట్వంటీ అయ్యాయి.. నేతల భాష పిల్లలు వినకూడదని తల్లిదండ్రులు చానల్ మార్చేస్తున్నారు

» నిలవాలి గెలవాలి.. ఆడకపోతే ఓడినట్లే

» దేవేందర్‌గౌడ్ పుస్తకావిష్కరణలో రేవంత్

» పార్టీల మెడలు వంచిన ఉద్యమం:కిషన్‌రెడ్డి

» పాఠ్యాంశంగా ఉద్యమ ఘట్టాలు: లక్ష్మణ్



మాజీ ఎంపీ దేవేందర్ గౌడ్ రచించిన 'విజయ తెలంగాణ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి పొన్నం తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాజకీయాలు టీ ట్వంటీ మ్యాచుల్లా తయారయ్యాయని, ఇష్టం లేకున్నా టీ ట్వంటీ ఆడాల్సి వస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు రాజకీయ నాయకులు మాట్లాడుతుంటే పిల్లలు వినకూడదని తల్లిదండ్రులు ఛానల్ మార్చేస్తున్నారని వ్యాఖ్యానించారు. మాజీ ఎంపీ దేవేందర్ గౌడ్ రచించిన 'విజయ తెలంగాణ' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. దేవేందర్ గౌడ్, దివంగత జైపాల్‌రెడ్డి లాంటి నేతల కాలంలో రాజకీయాలు టెస్టు మ్యాచుల్లా ఉండేవని ముఖ్యమంత్రి అన్నారు. తర్వాత వన్డే మ్యాచ్‌ల్లా మారిపోయాయని, ప్రస్తుతం టీ ట్వంటీ ఆడాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. "ఆడకపోతే ఓడిపోయినట్లే. పోటీలో ఉండాలి గెలవాలి కాబట్టి ఇష్టం లేకపోయినా టీ ట్వంటీ ఆడాల్సి వస్తోంది" అన్నారు. గౌరవప్రదమైన రాజకీయాలు దేవేందర్ గౌడ్ లాంటి వారితోనే మాయమయ్యాయని చెప్పారు. శాసనసభలో ఎవరైనా అబద్ధం మాట్లాడినా దేవేందర్ గౌడ్ అదేమిటీ ఇలా మాట్లాడుతున్నారని ప్రశ్నించే వారని, సభకు ఆయన గౌరవం ఇచ్చేవారని గుర్తు చేసుకున్నారు. దేవేందర్ గౌడ్ విలువలున్న రాజకీయ నాయకుడని, గంటల కొద్దీ అసెంబ్లీ లైబ్రరీలో కూర్చుని, సమాచారాన్ని సేకరించి, సభలో హుందాగా, చతురతతో నొప్పించకుండా మాట్లాడేవారని ప్రస్తావించారు. "మరి నీ సంగతేమిటన్న? అని మీరు అడగవచ్చు కానీ, ఆటే అలా ఉన్నపుడు తప్పదు" అన్నారు. ఈ పుస్తకం మరుగున పడిన తెలంగాణ పోరాట చరిత్రను బహిర్గతం చేసిందని సీఎం వ్యాఖ్యానించారు. ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలన్నారు. నాటి ప్రభుత్వంలో నాయకుడికి సమానంగా వ్యవహరిస్తూ దేవేందర్ గౌడ్ తెలంగాణ కోసం సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఈ క్రమంలో ఆయన ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అయితే ఈ క్రమంలో ఆయన ఎక్కడా వెనక్కి తగ్గకుండా నమ్మిన లక్ష్యం కోసం పోరాటం చేశారన్నారు. గోదావరి జలాలతో తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని భావించి దేవేందర్ గౌడ్ పాదయాత్ర చేపట్టిన తర్వాతే ప్రాణహిత చేవెళ్ల పథకం రూపుదిద్దుకుందని ప్రస్తావించారు. టీజీ అనే పదాన్ని తెలంగాణ గుండె చప్పుడుగా దేవేందర్ గౌడ్ తెర మీదకు తీసుకుని వచ్చారని, దాన్ని గత ప్రభుత్వం టీఎస్‌గా మార్చిందని గుర్తు చేశారు. ప్రజల గుండె చప్పుడు గుర్తించి మళ్లీ టీజీగా మార్చామన్నారు. తెలంగాణ యువత బలిదానాలను పక్కన పెట్టి ఇదంతా ఒక కుటుంబం ఘనతగా చెప్పుకుంటూ, తెలంగాణ చరిత్రను వక్రీకరించారని సీఎం అన్నారు. తెలంగాణ కోసం పోరాడి సర్వం కోల్పోయిన కుటుంబాలు వేలు ఉన్నాయని చెప్పారు. గద్దరన్న లాంటి వాళ్ల ఇంటికి వెళ్లినపుడు వారి ఆర్థిక పరిస్థితి చూసి చలించి పోయానని, అందుకే 9 మందికి కోటి నగదు, ఇంటి స్థలం ఇచ్చి గౌరవించుకున్నామని వివరించారు.

ఉద్యమానికి దేవేందర్ దన్ను

పార్టీల మెడలు వంచిన ఉద్యమం తెలంగాణ ఉద్యమమని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. రాజకీయాలకు, సిద్ధాంతాలకు అతీతంగా దేవేందర్‌గౌడ్ తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారని ప్రశంసించారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాల పాత్రను తెరపైకి తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. గోదావరి జలాల సద్వినియోగంతోనే తెలంగాణ సస్యశ్యామలమవుతుందని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి సంబంధించి చరిత్ర ఘట్టాలను పాఠ్యాంశంగా చేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. తెలంగాణ బిల్లును అద్వానీ వ్యతిరేకించినా సుషాస్వరాజ్ మద్దతు ఇచ్చారని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. అన్ని వర్గాలు కొట్లాడితేనే తెలంగాణ వచ్చిందన్నారు. తెలంగాణ చరిత్రకు సంబంధించి హైదరాబాదులో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేయాలని దేవేందర్‌గౌడ్, సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి చేశారు.

నిజాయతీకి నిలువెత్తు రూపం సంజీవయ్య

» సీఎం రేవంత్



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'నిజాయతీకి నిలువెత్తు రూపం.. దళితజాతి ఆత్మగౌరవానికి ప్రతిరూపం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య' అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇటు పుల్వామా ఉగ్రదాడిలో అసువులు బాసిన వీర సైనికులకు సీఎం నివాళులర్పించారు. 'ప్రాణాన్ని పణంగా పెట్టి దేశాన్ని కాపాడే వీర సైనికులకు సదా సలాం.. పుల్వామా అమరులకు జోహార్లు' అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

వర్గీకరణ చేసినందుకు ధన్యవాదాలు..

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను చేపట్టి, త్వరితగతిన పూర్తి చేసిన సీఎం రేవంత్‌కు మాదిగ మేధావుల ఫోరం ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. సీఎంను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం, ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కాశీం, ప్రొఫెసర్ గడ్డం మల్లేశం పాల్గొన్నారు.

లోకం తీరు



కులగణన సర్వేపై అవగాహన కల్పించేందుకు బీసీ కమిషన్ పర్యటనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈనెల 16 నుంచి 28 వరకు మళ్లీ చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ, కుల సర్వే-2024పై అవగాహన పెంచడానికి క్షేత్రస్థాయిలో పర్యటించనున్నట్లు బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు మరికొన్ని నగర ప్రాంతాల్లో మిగిలిన 3,56,323 కుటుంబాలు తప్పనిసరిగా సర్వేలో పాల్గొనేందుకు ఆయా కులసంఘాలు, సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీ సంఘాలు సహకరించాలని కోరారు. శుక్రవారం బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు సర్వేలో పాల్గొనని కుటుంబాలు టోల్ సెంటర్ ద్వారా కానీ, ప్రజాపాలన సేవా కేంద్రాలు లేదా ఆన్‌లైన్ ద్వారా ప్రశ్నావళి ఫార్మాట్ ప్రకారం వివరాలు నమోదు చేయించి పంపాలని సూచించారు. సర్వే ప్రాధాన్యతపై ఆయా వర్గాలకు అవగాహన పెంచేందుకు ఎంపిక చేసిన ప్రాంతాల్లో 16 నుంచి 28 వరకు తనతో పాటు కమిషన్ సభ్యులు వేర్వేరు ప్రాంతాల్లో పర్యటించనున్నట్టు వివరించారు. బీసీలకు బడ్జెట్‌లో తగిన స్థాయిలో కేటాయింపులు చేసుకునేందుకు బీసీ జనాభా గణన వివరాలు అవసరమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పటికీ జనరల్ స్థానాల్లోనూ సత్తా చూపి బీసీలు 65% నుంచి 70% గెలిచే అవకాశముంటుందని చెప్పారు.

ఎల్‌ఆర్‌ఎస్ రుసుములో 10శాతం రాయితీ!?

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తులను పరిష్కరించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 10 శాతం రాయితీ ఇవ్వాలనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. దీనిపై సర్కారు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పురపాలక శాఖ అధికారులు చెబుతున్నారు. ఇటీవల సీఎంతో జరిగిన సమావేశంలో ఎల్‌ఆర్‌ఎస్ రుసుములో 25 శాతం రాయితీ ఇచ్చే అంశం అసలు చర్చకు రాలేదన్నారు. పురపాలక శాఖ నుంచి కేవలం 10% రిబేట్ ఇవ్వాలని మాత్రమే ప్రతిపాదనలు ఇచ్చామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 25.70 లక్షల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 9 లక్షలే పరిష్కరించారు. వాటిలోనూ క్రమబద్ధీకరణకు అనుమతించినవి కేవలం 1,70,000 మాత్రమే. వీటి ద్వారా ఇప్పటి వరకూ ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ.120 కోట్లు. ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్4 దశల్లో దరఖాస్తుల పరిశీలనకు తొలుత మార్గదర్శకాలు ఇచ్చి, తర్వాత సవరించారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో మరింత జాప్యమవుతుండడంతో మార్పులు చేశారు. ప్రస్తుతం ఎల్1 దశలో పరిశీలించిన తర్వాత నిబంధనలకు అనుగుణంగా ఉంటే క్రమబద్ధీకరణకు ఆమోదం తెలుపుతున్నారు. అలాగే నీటిపారుదల శాఖ, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం సంయుక్త విచారణ చేయాల్సిన అవసరం లేకుండా కొన్ని సడలింపులు చేశారు. జలవనరులకు 200 మీటర్ల దూరంలో ఉండే సర్వే నంబర్లు, ప్రభుత్వ భూములకు ఆనుకుని ఉండే సర్వే నంబర్ల విషయంలో మాత్రమే రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల అభిప్రాయాలను తీసుకునేలా మార్పులు చేశారు.

పట్టణాల్లో పరిస్థితి మరీ దారుణం

రాష్ట్రంలో మునిసిపాలిటీల పరిధిలో 14,38,440 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకు పరిశీలించిన దరఖాస్తులు కేవలం 3,74,825 మాత్రమే. మునిసిపాలిటీల నుంచి ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన ఆదాయం రూ.106.53 కోట్లు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలో 3788 దరఖాస్తులు వస్తే ఇక్కడి నుంచి ఇప్పటి వరకు ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ఒక్క రూపాయి రాలేదు. వరంగల్ గ్రామీణ పరిధిలో ఉన్న వర్ధన్నపేటలోనూ ఇదే పరిస్థితి. అక్కడ 522 దరఖాస్తులు వస్తే నేటికీ రూపాయి వసూలు కాలేదు. ఇలా పలు చోట్ల దరఖాస్తులు వచ్చినా.. రూపాయి కూడా వసూలు కాలేదు. పట్టణ పరిధిలో వచ్చిన దరఖాస్తుల్లో 1,44,925 మందికి ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించాలని సమాచారం పంపితే 14206 మంది మాత్రమే కట్టేందుకు ముందుకు వచ్చారు.

క్రమబద్ధీకరణ రుసుములు ఇలా..

2020 సెప్టెంబరు 16న ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి సంబంధించి అనధికారిక లేఅవుట్ల క్రమబద్ధీకరణ రుసుములపై ప్రభుత్వం జీవో 135 జారీ చేసింది. తొలుత 131 జీవోను 2020 ఆగస్టు 31న ఇచ్చింది. ఇందులో టేబుల్1లో ఎల్‌ఆర్‌ఎస్ కనీస క్రమబద్ధీకరణ రుసుము ఎంత వసూలు చేయాలో నిర్ణయించింది. తర్వాత 135 జీవోలో మార్కెట్ విలువ మీద ఉన్న క్రమబద్ధీకరణ రుసుముల శాతాన్ని సవరిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇది ఆయా ప్రాంతాల్లో ఉండే మార్కెట్ విలువలు, భూ విస్తీర్ణం ఆధారంగా మారుతుంది. గజం రూ.3-5 వేల వరకు ఉంటే 30 శాతం, రూ.5-10 వేల మధ్య ఉంటే 40 శాతం, రూ.10-20 వేల మధ్య ఉంటే 50 శాతం, రూ.20-30 వేల మధ్య ఉంటే 60 శాతం, రూ.30-50 వేల మధ్య ఉంటే 80 శాతం, రూ.50 వేల కంటే ఎక్కువ ఉంటే 100 శాతం చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అనుమతి లేని లేఅవుట్‌లో 10 శాతం ఖాళీ స్థలం లేకపోయినప్పటికీ. నేరుగా భవనాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే ఎల్‌ఆర్‌ఎస్ రుసుముతోపాటు 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీ, అదనంగా 33 శాతం కాంపౌండ్ పెనాల్టీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. అదే ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకుంటే ఈ 33% అదనపు రుసుము పడదని అధికారులు చెబుతున్నారు. జీవో నంబరు 131లో 100 చదరపు మీటర్ల విస్తీర్ణానికి చదరపు మీటరుకు రూ.200 కనీస క్రమబద్ధీకరణ రుసుము చెల్లించాలి. ఆ తర్వాత చదరపు మీటరును బట్టి రుసుము మారుతుంటుంది. డీటీసీపీ దేవేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ రుసుముల్లో 10 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించకుండా నేరుగా బిల్డింగ్ అనుమతులు కోరితే ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలతోపాటు 33 శాతం అదనంగా కాంపౌండ్ ఫీజు విధిస్తామని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వెళితే ఈ చార్జీలు కట్టాల్సిన అవసరం ఉండదని చెప్పారు. ప్రభుత్వం 10 శాతం రాయితీ ఇస్తే ఆ మేరకు మాత్రమే తగ్గింపు ఉంటుందన్నారు.



స్పందన లేకపోవడానికి కారణం ఏంటి?

దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి అధికారుల పరంగా కొన్ని ఇబ్బందులు ఉండగా.. ప్రజల నుంచి స్పందన లేకపోవడానికి మరికొన్ని కారణాలు ఉన్నాయి. దరఖాస్తుల పరిశీలన చేపట్టిన తర్వాత మధ్యలో ఒకసారి వరదలపై సర్వే, మరోసారి కులగణన, ఇంకోసారి ప్రభుత్వ విజయోత్సవాలు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే వంటి అంశాల వల్ల కొంత జాప్యం జరిగింది. దీంతోపాటు ఐదేళ్ల నాటి దరఖాస్తులు కావడం, ఆ రోజు దరఖాస్తు చేసిన వ్యక్తి ఒకరు, ప్రస్తుతం ప్లాట్ యజమాని మరొకరు ఉండడం, కొన్ని సర్వే నంబర్లను తప్పుగా నమోదు చేయడంతో ప్లాట్లను గుర్తించలేకపోవడం, 60 శాతం దరఖాస్తులకు సరైన పత్రాలు లేకపోవడం, ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాల్సిన అవసరం ఏముందిలే అని కొందరు ఆలోచన చేయడం వంటి కారణాల వల్ల కూడా ఆశించిన పురోగతి లేదని అధికారులు చెబుతున్నారు.

రేవంత్.. నోరు అదుపులో పెట్టుకో

- ముఖ్యమంత్రి హోదాలో ఉండి..
- మోదీపై నోటికొచ్చినట్టు మాట్లాడతావా..?
- బీసీలకు కాంగ్రెస్ ఏం చేసింది: కిషన్‌రెడ్డి
- రాహుల్ మతమేంటి : బండి సంజయ్



హైదరాబాద్/కంది/రామచంద్రాపురం టౌన్/కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'సీఎం హోదాలో ఉండి ప్రధాని మోదీపై అవాకులు, చవాకులు పేలుతారా..?' అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. ప్రధాని మోదీ బీసీనా..? కాదా..? అన్న అంశంపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. రాజకీయ విమర్శలు చేసే క్రమంలో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న విషయం మరచిపోయి నోటికొచ్చినట్లు మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి మోదీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల జాబితాను తాను ఇస్తానని.. మరి కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పగలరా..? అని రేవంత్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్ చేసిన కులగణన సర్వేను బీసీ సంఘాలే విమర్శించిన సంగతి నిజం కాదా..? అని నిలదీశారు. 'బీసీల పురోగతి కోసం బడ్జెట్‌లో ఎంత కేటాయించారు..? ఎంత విడుదల చేశారు..? ఒక్క బీసీ వర్గమైనా మీ పాలనలో సంతోషంగా ఉందా చెప్పాలి..?' అని కిషన్‌రెడ్డి.. రేవంత్‌ను డిమాండ్ చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం మరో ప్రయత్నం చేశారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. 'మీ పరిశోధన పూర్తిగా విఫలమైంది. 1994లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మోదీ ఓబీసీ జాబితాలో ఉన్నారు. రాహుల్‌గాంధీ ఏ కులానికి చెందినవారు..? ఆయన మతం ఏంటి..? రాహుల్ తాత ఫిరోజ్ జహంగీర్ గాంధీ. హిందూ సంప్రదాయంలో కులం తండ్రి ద్వారా వస్తుంది. ఎవరు చట్టపరంగా మతం మార్చుకున్నారో చర్చ చేయాలనుకుంటే ముఖ్యమంత్రి.. 10 జనపథ్ నుంచి ప్రారంభించాలి' అని సంజయ్ స్పష్టం చేశారు. మోదీపై విమర్శలు చేస్తే సూర్యుడిపై ఉమ్మివేసినట్లుగా ఉంటుందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

కేంద్రం ఏమిచ్చిందో.. చూపిస్తాం రండి

కేంద్రం ఏం చేసింది అంటూ అందరూ మాట్లాడుతున్నారని.. కేసీఆర్, రేవంత్ కలిసి వస్తే ఈ పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఏం చేసిందో చూపిస్తానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రెండు ప్రభుత్వాలు గ్రామ పంచాయితీలకు రాష్ట్రం నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. పదేళ్లలో గ్రామ పంచాయతీల్లో మంచినీరు, పారిశుధ్యం, రోడ్లు, శ్మశానవాటికలకు నిధులు ఇచ్చింది కేంద్రమేనని తెలిపారు. కేంద్రం ఇచ్చిన నిధులపై హరీశ్ రావు, కేటీఆర్ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం సంగారెడ్డి జిల్లా కందిలో పట్టభద్రుల సమావేశం నిర్వహించారు. రామచంద్రపురంలోనూ ప్రచార సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఎంపీ రఘునందన్‌రావు పాల్గొన్నారు.

హామీల పేరుతో కాంగ్రెస్ దగా: లక్ష్మణ్

అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం కామారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా హైడ్రా, మూసీ ప్రక్షాళన, కుల గణన పేరుతో కాంగ్రెస్ పబ్బం గడుపుతోందన్నారు. రూ.లక్షా 10వేల కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి, సమ్మక్క సారక్క యూనివర్సిటీ ఏర్పాటు వంటి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదని అన్నారు. హిందువులను విడగొట్టేందుకు సీఎం రేవంత్ కుల రాజకీయాలు చేస్తున్నారని ఎంపీ అర్వింద్ ఆరోపించారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలి

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్

కవాడిగూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలని సుప్రీంకోర్టు న్యాయవాది, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ ఛైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్, జాతీయ వర్కింగ్ ఛైర్మన్ పబ్బతి శ్రీకృష్ణ, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు వీఎల్ రాజు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై రేవంత్ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని కూడా రద్దు చేస్తూ ప్రకటన జారీ చేయాలన్నారు. ఈ మేరకు శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాలల జనాభా తక్కువగా ఉన్నట్లు చూపి రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ పేరుతో మాలలకు అన్యాయం చేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో తమ వ్యతిరేకతను తెలియజేయాల్సిన మాల ప్రజాప్రతినిధులు రేవంత్‌కు అమ్ముడుపోయారని ఆరోపించారు. వారంతా తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి మాలలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



మేడారం గద్దెల వద్ద భక్తుల రద్దీ

మేడారం.. భక్తజన సంద్రం

మినీ జాతరకు పోటెత్తుతున్న భక్తులు.. 3 రోజుల్లో 6 లక్షల మందికి పైగా రాక

తాడ్వాయి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వనదేవతలు కొలువైన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం క్షేత్రం జనసంద్రంగా మారింది. బుధవారం మినీ జాతర ప్రారంభం కాగా.. మూడు రోజులుగా 6లక్షల మందికిపైగా భక్తులు తల్లులను దర్శించుకున్నారు. శుక్రవారం సుమారు 2 లక్షల మంది తరలిరావడంతో మేడారం పరిసరాలు, గద్దెల ప్రాంగణాలు సందడిగా మారాయి. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు జంపన్నవాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరించి.. గద్దెలకు చేరుకుని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ చీరె సారె, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించి.. అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. శుక్రవారం సమ్మక్క, సారలమ్మను ములుగు ఎస్పీ శబరీష్, కలెక్టర్ దివాకర దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించారని తెలిపారు. శని, ఆదివారాల్లో మరింత మంది భక్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కాగా, మేడారం మినీ జాతర శనివారంతో ముగియనుంది. దీంతో శని, ఆదివారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా వేస్తున్న అధికారులు.. అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేశారు

ఇసుక అక్రమ రవాణాపై హైడ్రా యాక్షన్

- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో లారీల తనిఖీలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలతో హైడ్రా రంగంలోకి దిగింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం నుంచే ఇసుక లారీల తనిఖీని మొదలుపెట్టింది. హయత్‌నగర్, హస్తినాపురం, ఘట్‌కేసర్, శామీర్‌పేట ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో ఈ తనిఖీలు జరిగాయి. లారీ డ్రైవర్లు చూపించే పత్రాలు(మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇచ్చే ఈ- ట్రాన్సిట్ పాస్)తనిఖీతో సరిపెట్టకుండా ఆన్‌లైన్‌లోనూ ఆయా రికార్డుల పరిశీలనపై దృష్టి పెట్టింది. ఇసుక సక్రమంగా తరలిస్తున్నారా? అక్రమంగా తరలిస్తున్నారా? అనేది కచ్చితంగా కనిపెడుతోంది. నిజానికి, గురువారం డ్రైవర్లు చూపించిన కాగితాలను మాత్రమే హైడ్రా సిబ్బంది తనిఖీ చేశారు. అయితే నకిలీ ఈ-ట్రాన్సిట్ పాస్‌ల వినియోగంపై ఉన్న ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా.. మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎండీసీ) సహకారం తీసుకుంది. హైడ్రా కమిషనర్ విజ్ఞప్తి మేరకు.. హైడ్రా సిబ్బందికి టీజీఎండీసీ లాగిన్‌ను ఇచ్చింది. దీంతో డ్రైవర్లు చూపించే ఈ-ట్రాన్సిట్ పాస్‌లను శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లోనూ తనిఖీ చేయడం మొదలుపెట్టారు. పాస్ తీసుకున్న లారీ నెంబర్‌ను ఇతర వాహనాలకు వినియోగిస్తున్నట్టు గతంలో ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో వాహనాల వివరాల పరిశీలనపైనా హైడ్రా దృష్టి పెట్టింది. ఈ విషయంలో రవాణా శాఖ సహకారం తీసుకోవాలని నిర్ణయించింది. రవాణా శాఖ కూడా ముందుకొస్తే.. వాహనం నెంబర్, చాసిస్ నెంబర్(ఇంజన్)తో పాస్ తీసుకున్న వాహనంలోనే ఇసుకను తరలిస్తున్నారా? లేదా? అనేది ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించి గుర్తించనున్నారు. వే బ్రిడ్జిల వద్ద తూకం వేయించి పరిమితి ప్రకారమే ఇసుకను తరలిస్తున్నారా? అనేది కూడా తనిఖీ చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మిత్రప్రేమలో వాణిజ్య రక్తి

ఇద్దరు గొప్ప మిత్రులు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న ఆ దృశ్యాన్ని ఎంతోకాలం తరువాత మళ్ళీ చూశాం. శ్వేతసౌధంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, భారతప్రధాని నరేంద్రమోదీ చేయీచేయీ కలిపారు, ఈ మారు అదనంగా థంబ్స్‌ప్‌తో స్నేహ గాఢతను తెలియచేశారు. శ్వేతసౌధంలో మిమ్మల్ని మళ్ళీ చూడటం నాకు ఆనందంగా ఉంది అన్న మోదీ వ్యాఖ్యలో ట్రంప్‌కు కచ్చితంగా నిజాయితీ కనిపించి ఉంటుంది. నమస్తే ట్రంప్, హౌడీ మోడీ కార్యక్రమాలను తామిద్దరూ ఒకరికోసం ఒకరు జరుపుకున్న ఘనమైన గతాన్ని మోదీ గుర్తుచేశారు కూడా. మోదీ అద్భుతంగా పనిచేస్తున్నారనీ, అందరూ అదే అంటున్నారని, నిజంగానే గొప్ప నాయకుడనీ ట్రంప్ ఈమారు కూడా మనప్రధాని మనసు ఉప్పొంగేట్టు చేశారు. నిత్యం దేశం గురించి ఆలోచించడమనే అద్భుతమైన నాయకత్వం లక్షణం ట్రంప్‌లో ఉన్నదనీ, తాను కూడా అదే స్ఫూర్తితో వ్యవహరిస్తానని మోదీ గుర్తుచేశారు. పొగడ్తంటేనే ఓ వల, మాయ అని కొందరు మేధావులకు ఏవగింపు ఉంటుంది కానీ, దేశాధినేతల ఈ కీర్తిగానాల మధ్యనే అమ్మకాలు, వ్యాపార లావాదేవీలు జరుగుతాయి.

మేం కలసికట్టుగా ఎవరినైనా జయిస్తాం, ఒకరినొకరు జయించాలని మాత్రం అనుకోవడం లేదని ట్రంప్ చక్కని మాటన్నారు. కలసి జయించాలని ఆయన కోరుకుంటున్నది చైనాని. తన ప్రబల శత్రువుతో పోరాటంలో మిత్రదేశం మరింత కలసిరావాలని కోరుకుంటున్నప్పుడు ఇతరత్రా విషయాల్లో భారత్ పట్ల కాస్తంత ఆదరణపూర్వకంగా అమెరికా అధ్యక్షుడు వ్యవహరించివుంటే ఎంతో బాగుండేది. యుద్ధంలోనే ప్రేమ, వాణిజ్యంలో కలహమేనని ట్రంప్ తేల్చేశారు. ఒకరినొకరు జయించుకోబోమని ఇచ్చిన హామీ వ్యాపారవాణిజ్యాలకు, టారిఫ్ యుద్ధాలకు వర్తించబోదని మోదీతో భేటీకి కాస్తంత ముందే రుజువుచేశారు. ప్రతి సుంకాలని ఓ మర్యాదమాట వాడుతున్నప్పటికీ ప్రతీకార సుంకాలతో మిగతాదేశాలతో మననూ కలగలపి మోదేశారు. ఈ నిర్ణయం ఆఖరునిముషంలో మనపై మరింత ఒత్తిడిపెంచి, దారికితేవడానికి ఉద్దేశించింది కానప్పుడు, ఆ భేటీ ఏదో ముగిసేవరకూ ఆగితే మరింత గౌరవంగా ఉండేది. భారతప్రధానితో భేటీలో ట్రంప్ ఓ నాలుగు మర్యాదమాటల తరువాత పూర్తిగా బిజినెస్‌లో పడ్డారు. సుంకాల విషయంలో ఆయనకు ఉన్న ఆగ్రహాన్ని కాస్తంత చల్లార్చేందుకు మోదీ అమెరికా యాత్రకు ముందే విశేషమైన ప్రయత్నం జరిగింది. హార్లీడేవిడ్సన్ బైకులూ, ఎలాన్ మస్క్ కార్లూ ఖరీదు తగ్గేట్టు చేసినా భారత్ సుంకాలమీద ట్రంప్ మోదీ సమక్షంలోనే గట్టిగా మాట్లాడారు, హెచ్చరికలు చేశారు. రెండుదేశాల మధ్య వాణిజ్యంలో అమెరికాకు వంద బిలియన్ డాలర్ల లోటు ఉన్నదని అంటున్న ట్రంప్ ఈ విషయంలో అమెరికన్లకు న్యాయం జరిగేలా చేస్తానని స్పష్టం చేశారు. ఈ ఏడాదిలోగా ఆచరణలోకి వస్తుందంటున్న వాణిజ్య ఒప్పందంలో ఎవరిది పైచేయి అవుతుందో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు.

మగా, మిగా, మెగా అంటూ భారతప్రధాని చేసిన సూత్రీకరణ ఇరుదేశాల సంబంధాలకు మంచి ఉత్తేజాన్నిస్తుంది. ట్రంప్‌తో వ్యవహారం అంత సులభం కాదనీ, ప్రపంచదేశాల నాయకులు సైతం బోల్తాపడుతున్న తరుణంలో మోదీ నెగ్గుకొచ్చారని అమెరికన్ మీడియా ప్రశంసలు కురిపిస్తోంది. రక్షణ, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో హెచ్చిన భాగస్వామ్యం దశాబ్దాల బంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది. దశాబ్దకాలంలో అమెరికాతో సాన్నిహిత్యం ఆలింగనాలస్థాయికి చేరి, చైనాతో శత్రుత్వం మరింత పెరిగిన తరువాత అత్యాధునిక యుద్ధవిమానాల అవసరం కూడా హెచ్చింది. ఎఫ్–35 యుద్ధ విమానాల కొనుగోలు మన అమ్ములపొదిని బలోపేతం చేస్తుంది. ఈ ప్రతిపాదన ఏ దశలో ఉన్నదో తెలియదు కానీ, భారతదేశం అందుకు సిద్ధంగా ఉన్నదన్నట్టుగా ట్రంప్ వ్యాఖ్యానించడం విశేషం. అక్రమవలసదారులను వెనక్కుతెచ్చుకోవడం, సుంకాల విషయంలో రాజీపడటం, యుద్ధవిమానాలతో సహా అతిఖరీదైన ఆయుధసామగ్రిని కొనుగోలు చేయడం, డ్రిల్ బేబీ డ్రిల్ అంటూ చమురు తోడిపోస్తున్న అమెరికానుంచి భారీగా ఇంధనాన్ని కొనుగోలుచేయడానికి సిద్ధపడటం ఇత్యాదివి కచ్చితంగా ట్రంప్‌ను సంతృప్తిపరుస్తాయి. ఈ ఇచ్చిపుచ్చుకోవడాల్లో అంతిమ లబ్ధి ఎవరిదన్నది అటుంచితే, నాకంటే నరేంద్రమోదీయే బహుచక్కగా బేరమాడగలరు అని ట్రంప్ చేసిన ప్రశంస ఒక అతితెలివైన వ్యాపారిని గుర్తుచేస్తోంది.

బిరుదులన్నీ వ్యక్తి పూజలే!

ఏటా రిపబ్లిక్ దినానికి, 'పద్మ ఎవార్డు'ల పేరుతో, నాలుగు రకాల బిరుదుల్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. భారత రత్న, పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ. ఈ నాలుగు బిరుదుల వరసా చూస్తే, ప్రాచీన కాలంలో ఉండిన నాలుగు వర్ణాల వ్యవస్థ గుర్తుకు వస్తుంది. కానీ, భారత పాలకవర్గాలు రాసుకున్న 1950 నాటి రాజ్యాంగంలో, ప్రభుత్వం బిరుదులు ఇవ్వకూడదనే ఉంది. కానీ, 1954లో, ఈ బిరుదుల్ని అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ బిరుదులు రాజ్యాంగంలో రాసుకున్నదానికి విరుద్ధమైనవి కాబట్టి, వీటిని రద్దు చెయ్యాలని అప్పట్లో కొందరు కొన్ని రాష్ట్రాల హైకోర్టులకి వెళ్ళారు. చివరికి, ఐదుగురు జడ్జీల సుప్రీం కోర్టు ధర్మాసనం, "అవి బిరుదులు కావు, 'గౌరవ పురస్కారాలు' ('ఆనరరీ ఎవార్డ్స్'). కాబట్టి అవి రాజ్యాంగానికి విరుద్ధమైనవి కావు" అని తేల్చింది. బిరుదులు కాక పోతే, ఈ ఎవార్డులను పొందినవారిని, "భారత రత్న, ఫలానా", "పద్మ విభూషణ్, ఫలానా", "పద్మశ్రీ, ఫలానా" అని సభల్లోనూ, పత్రికల్లోనూ, సంబోధించడం ఎందుకు? ఆ పురస్కారాలు పొందిన కొందరు తమ లెటర్ హెడ్స్ లోనూ, తమ జీవిత విశేషాల్లోనూ ('బయోడేటా') ఆ ఎవార్డుల్ని చెప్పుకోవడం ఎందుకు? ఇతరులు చెబుతూ ఉంటే ఆనందిస్తూ కూచోడం ఎందుకు? కాబట్టి, గౌరవ పురస్కారాలైనా, బిరుదులైనా, రెండూ సారాంశంలో ఒకటే. ఒక రకంగా అవి పర్యాయపదాలే!

దేశంలో మనుషులందరూ సమానులే అని ఒక పక్క చెప్పుకుంటూనే, ఆ దేశంలోనే కొంతమందిని ఎక్కువ సమానులుగా బిరుదులు ఇవ్వడం ఏమిటి? ప్రభుత్వం ప్రకటించినా, తీసుకోవడం ఏమిటి? "అవును, మేము అందరితో సమానం కాము. మేము ప్రత్యేకం! మేము 'పద్మ' బిరుదాంకితులం! అల్లాటప్పాగాళ్ళం కాదు!" అని చెప్పుకోవడం కాదూ? ఏం? "ఎందుకీ గౌరవ పురస్కారాలూ? ఏముందీ? మాకు ఆయా రంగాల్లో పరిస్థితులూ, అవకాశాలూ కుదిరాయి. మాకు చేతనైన పనులు మేము చేశాము. అంతమాత్రాన, తోటి మనుషులనించీ, మమ్మల్ని విడగొట్టి గొప్ప చెయ్యడం ఏమిటి?" అనవద్దా? "నేను ఫలానా రంగంలో కృషి చేసినందుకు గుర్తింపుగా నాకు ఈ పురస్కారం లభించింది. ఇది నా రంగంలో కృషి చేస్తున్నవారందరికీ లభించిన పురస్కారంగా భావిస్తాను" అని ఒకరంటే, "ఇది నా జాతి (కులం) ప్రజలందరికీ దక్కిన గౌరవం" అని ఇంకొకరు అంటారు. అసలీ బిరుదులన్నీ, ఆ సమయానికి ఉన్న ప్రభుత్వానికి అనుకూలంగానో, వ్యతిరేకత లేకుండానో ఉండేవారికే వస్తాయి. పైగా ఆ బిరుదుల కోసం స్వయంగా గానీ, మిత్రుల ద్వారా గానీ, సిఫార్సులూ, పైరవీలూ జరుగుతాయని ఎన్నో వింటాం!



ఈ బిరుదులూ, ప్రత్యేక గౌరవ పురస్కారాలూ, ఇవన్నీ మనుషుల మధ్య అసమానత్వానికి గుర్తులు. వీటిని ఇచ్చేవారూ, పులకించి పుచ్చుకునే వారూ, వారిని చూసి సమ్మోహితులయ్యేవారూ, 'మాకు రాలేదే' అని బెంగ పడేవారూ... అందరూ సమానత్వ భావనకి వ్యతిరేకులు, తెలిసిగానీ, తెలియక గానీ! ఇతర్లని పొగడ్డమూ, పొగిడించుకోవడమూ ఇష్టమైనవారు అంటే, 'వ్యక్తి పూజ'కి అనుకూలురు!

ప్రభుత్వాలు బిరుదులిచ్చినట్టే, కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా, ఒక వ్యక్తిని గొప్ప చెయ్యడానికి, కొన్ని బిరుదులిస్తూ ఉంటాయి. ఉదాహరణకి, సినిమా హీరోల విషయంలో: నట స్మామ్రాట్, నట రత్న, విశ్వవిఖ్యాత నట సార్వభౌమ, మెగాస్టార్, పవర్ స్టార్, రెబెల్ స్టార్.. ఇలా రకరకాల బిరుదులున్నాయి. అవన్నీ, ఆ హీరోలతో తీసిన సినిమాలను బాగా అమ్ముడయ్యే సరుకులుగా ప్రచారం చేసుకోవడానికి ఉపయోగించుకుంటారు. అలాగే, కవులకి కూడా కొన్ని రకాల బిరుదులున్నాయి. 'విశ్వ కవి', 'మహా కవి', 'ప్రజా కవి', 'కవి సామ్రాట్', 'కవి రత్న', 'కవి కోకిల', 'కవి రాజు' వగైరాలు. గతంలో అయితే, 'గండపెండేరాలు' తొడిగి, ఏనుగు మీద ఊరేగించడం కూడా చేసేవారు!

ఈ బిరుదులూ, ప్రత్యేక గౌరవ పురస్కారాలూ, ఇవన్నీ మనుషుల మధ్య అసమానత్వానికి గుర్తులు. వీటిని ఇచ్చేవారూ, పులకించి పుచ్చుకునే వారూ, వారిని చూసి సమ్మోహితులయ్యేవారూ, 'మాకు రాలేదే' అని బెంగ పడేవారూ... అందరూ సమానత్వ భావనకి వ్యతిరేకులు, తెలిసిగానీ, తెలియక గానీ! ఇతర్లని పొగడ్డమూ, పొగిడించుకోవడమూ ఇష్టమైనవారు! అంటే, 'వ్యక్తి పూజ'కి అనుకూలురు! ఈ కీర్తి దాహానికి ('కీర్తి కండూతి' అని ఒక పరుషపదం కూడా ఉంది) లొంగిపోయే వారూ, ప్రోత్సహించేవారూ, బానిస యజమానులే కాదు, ఫ్యూడల్ చక్రవర్తులే కాదు, బూర్జువా నాయకులే కాదు, విప్లవ కమ్యూనిస్టులు కూడా! 'కామ్రేడ్ స్టాలిన్', 'కామ్రేడ్ మావో' ఈ విషయంలో, అందరినీ అధిగమించారు 'వ్యక్తి పూజ' చరిత్రలో! నిజానికి, సమానత్వ సిద్ధాంతమైన కమ్యూనిజం పూర్తిగా వంటబట్టిన వారెవ్వరూ, వ్యక్తి పూజని అంగీకరించరు. దానికి, శాస్త్రీయ కమ్యూనిజం సిద్ధాంతకర్తలైన, మార్క్సు, ఎంగెల్సుల్ని ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చును.

'విల్ హెల్మ్ బ్లాస్' అనే ఒక జర్మన్ పత్రికా సంపాదకుడికి రాసిన ఉత్తరంలో ఎంగెల్స్ గురించీ, తన గురించీ మార్క్సు ఇలా అంటాడు. (మార్క్సు ఏంగెల్స్: సెలెక్టడ్ కరెస్పాండెన్స్ పే. 291) "మాలో ఎవ్వరం పాప్యులారిటీకి గడ్డిపరకంత విలువైనా ఇవ్వం. వ్యక్తి పూజ ('పెర్సనాలిటీ కల్టు') ఏ రకమైందైనా మాకు విముఖతే. అనేక దేశాల నించీ వచ్చే ఎన్నో రకాల పొగడ్తల ఉత్తరాలు బహిరంగం కావడానికి నేను ఎన్నడూ ఒప్పుకోలేదు. ఇంటర్నేషనల్ ఉన్నంత కాలం ఆ ఉత్తరాలు నన్ను మహా చికాకు పెట్టేవి. వాటికి నేను ఎన్నడూ జవాబే ఇవ్వలేదు ఎప్పుడైనా ఓసారి తప్ప. అదైనా వాటిని వ్యతిరేకిస్తున్నానని గట్టిగా చెప్పడానికే. "ఎంగెల్సూ, నేనూ మొట్టమొదట రహస్య కమ్యూనిస్టు సంఘంలో చేరినప్పుడు, 'అధికారం' గురించి మూఢ విశ్వాసాన్ని ప్రోత్సహించే ప్రతీ అంశాన్నీ నిబంధనావళి నించి తీసెయ్యాలని షరతు పెట్టాం."

బిరుదులూ, ఎవార్డులూ, సన్మానాలూ ఆనందంగా అంగీకరించే మేధావులు, బిరుదులూ వగైరాల్లో ఉన్న అసమానత్వ కోణం గురించి ఆలోచించాలా, వద్దా?

◆ బి.ఆర్. బాపూజీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

నిరుపేదలకు అభయమేదీ?

తమిళ సమాజంలో ఒక సామెత ఉంది: 'ఆకలి దహించివేస్తే మొత్తం పదీ ఎగిరిపోతాయి'. ఇవీ ఆ పది: గౌరవం, వంశం, విద్య, ఔదార్యం, జ్ఞానం, ఉదారత, తపస్సు, సాధన, ధైర్యం, ప్రార్థన.

మన ఆధునిక ప్రజాస్వామ్య సమాజంలో ఈ పది మాత్రమే కాదు, ఇంకా ఎన్నో సుగుణాలూ హఠాత్తుగా మాయమైపోతాయి. ఇది సత్యం కాదూ? ఢిల్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలోను, బిహార్ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ప్రవేశపెట్టిన 2025–26 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌ను విలోకిస్తే ఆ సత్యం మీకు మరింతగా విశదమవుతుంది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అయితే ప్రభుత్వం ఒక సంవత్సర కాలంలో ఇవ్వగలిగినదంతా, ఎన్నికలలో పాలక పక్షం లబ్ధి పొందగలదనే ఆశాభావంతో, కేవలం కొద్ది మంది వ్యక్తులకు మాత్రమే ఇచ్చిన వార్షిక బడ్జెట్‌ను నేను చాలా చాలా అరుదుగా మాత్రమే చూశాను. గౌరవనీయ ఆర్థిక మంత్రి 2025–26 కేంద్ర బడ్జెట్‌ను కచ్చితంగా ఆ ఆశాభావంతోనే నివేదించారని నిక్కచ్చిగా చెప్పదలుచుకున్నాను.

ప్రజలకు పంపిణీ చేసేందుకు రూ.1,00,000 కోట్ల కాసుల కాణాచి తనకు అందుబాటులో ఉందని లేదా తాను కనుగొనవలసి ఉందని ఆర్థిక మంత్రి చెప్పారు. ఆమె ఆ భారీ ధనరాశిని 'కనుగొన్నారు'. ఆ సమస్త నిధులను (143 కోట్ల దేశ జనాభాలో) ఆదాయపు పన్ను చెల్లించే 3.2 కోట్ల మందికి ఇచ్చేందుకు ఆమె నిర్ణయించారు. మధ్య తరగతి కుటుంబీకులు, సంపన్నులు, మహా సంపన్నులు, కుబేర సమానులు ఆ 3.2 కోట్ల మందిలో ఉన్నారనేది ఒక అనావశ్యక వివరణ. తమిళ లోకోక్తిని పది సుగుణాలతో పాటు ఆధునిక పరిపాలనా విలువలు అయిన సమ దృష్టి, సామాజిక న్యాయం, సమంజసమైన పంపకం మొదలైన వాటిని కూడా పూర్తిగా గాలికి వదిలివేశారు.

బడ్జెట్ రూపకల్పనలో ఉండగా ప్రభుత్వ వార్షికాదాయం తగ్గుదల ఆర్థిక మంత్రిని వేధించింది. కేంద్ర ప్రభుత్వ మొత్తం వసూళ్లకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ అంచనాల కంటే రూ.60,000 కోట్ల మేరకు తక్కువగా ఉంటాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ లెక్కతేల్చింది. మరీ ముఖ్యంగా 2024–25 ఆర్థిక సంవత్సర ద్రవ్యలోటును 'మెరుగుపరచాలని' ఆర్థిక మంత్రి ఆశిస్తే, అందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ కనీసం రూ. 43,000 కోట్లను కనుగొనవలసి ఉన్నది. వసూళ్లలో తగ్గుదల భర్తీకి, ద్రవ్యలోటు 'మెరుగుదల'కు అవసరమైన నిధులకు మొత్తం రూ.1,00,000 కోట్లను సమకూర్చుకోవలసి ఉన్నది. ఇదిలావుండగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపించాయి. ఓటర్లకు భారీ వితరణ చేయదలుచుకుంటే అందుకు అదనపు నిధులు అవసరమవుతాయి. ఆ 'వితరణ' ఆదాయపు పన్నులో కోత రూపేణా ఉండాలని ప్రభుత్వ అత్యున్నత స్థాయిలో నిర్ణయం తీసుకుని ఉంటారు. పన్ను చెల్లింపుదారులలో ఏ వర్గానికి ఆ లబ్ధి చేకూర్చాలి? డొనాల్డ్ ట్రంప్ మహాశయుడు చేప్పినట్టు ప్రతి ఆదాయపు పన్ను చెల్లింపుదారుడు తగ్గింపు లబ్ధి పొందాలి! ఇంకేం, వార్షికాదాయం రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షల దాకా ఉన్న వారందరూ ఆదాయపు పన్ను చెల్లించనవసరం లేకుండా నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి రూ.1,00,000 కోట్ల ఆదాయం తగ్గి పోతుందని ఆర్థిక మంత్రి చెప్పారు.

ఈ నిర్ణయాల పర్యవసానంగా 2024–25 ఆర్థిక సంవత్సర వ్యయాలలో కోత పెట్టడం, 2025–26లో ఇతర వర్గాల పౌరులకు అవసరమైన సహాయాన్ని సమకూర్చడాన్ని నిలిపివేయడం అనివార్యమయింది. దీంతో ఉపాధి హామీ లబ్ధిదారులు (పేదలలో నిరుపేదలు), దినసరి కూలీలు, ఆదాయపు పన్ను చెల్లించని వేతన ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, ఎమ్ఎస్ఎమ్ఈలు, గృహిణులు, పెన్షనర్లు, నిరుద్యోగ యువతను పూర్తిగా ఉపేక్షించారు. పెట్టుబడి వ్యయం, రాబడి వ్యయం రెండిటిలోను కోత విధించారు. ఈ నిర్ణయం ఫలితంగా విదేశీ వ్యవహారాలు, మానవ వనరుల అభివృద్ధి, సాంఘిక సంక్షేమం, పట్టణాభివృద్ధి మొదలైన మంత్రిత్వ శాఖలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోను, రాబోయే ఆర్థిక సంవత్సరాలలోను నిధుల కేటాయింపు గణనీయంగా తగ్గిపోనున్నది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ నికర పన్ను వసూళ్లు 2024–25లో వలే 11 శాతం చొప్పున పెరుగుతాయని ఆర్థిక మంత్రి విశ్వసిస్తున్నారు! వాస్తవమేమిటి? పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్) ప్రకారం యువతలో నిరుద్యోగిత 10.2 శాతంగా ఉన్నది. పట్టభద్రుల నిరుద్యోగిత 13 శాతంగా ఉన్నది. ఉపాధి కల్పన పథకాల అమలుకు చేసే వ్యయం ఎనిమిది విధాలుగా నిర్ణయించారు. ఉత్పాదకతతో ముడివడి ఉన్న పెట్టుబడి పథకాలు కూడా ఇందులో ఉన్నాయి. ఉపాధి కల్పన పథకాల అమలుకు అయ్యే వ్యయం రూ.23,318 కోట్లుగా 2024–25 బడ్జెట్‌లో అంచనా వేశారు. సవరించిన అంచనాల ప్రకారం ఆ వ్యయం కేవలం రూ.20,035 కోట్లు మాత్రమే. ఏతవాతా ఉపాధి కల్పనా కార్యక్రమాలు లక్ష్య పరిపూర్తిలో పూర్తిగా విఫలమయ్యాయని చెప్పక తప్పదు.

పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం వేతన ఉద్యోగులలో పురుషుల నెలసరి వేతనం గత ఏడు సంవత్సరాలలో రూ.12,665 నుంచి రూ.11,858కి పడిపోయింది. అలాగే స్వయం ఉపాధి కార్మికులలో పురుషుల నెలసరి ఆదాయం కూడా గత ఏడు సంవత్సరాలలో రూ.9,554 నుంచి రూ.8,591కి పడిపోయింది. మహిళా ఉద్యోగుల, కార్మికుల ఆదాయాలు కూడా ఇదే విధంగా తగ్గి పోయాయి. కుటుంబ వినియోగంపై సర్వే ప్రకారం నెలసరి సగటు తలసరి వినియోగం గ్రామీణ ప్రాంతాలలో రూ.4,226 కాగా పట్టణ ప్రాంతాలలో రూ.6,996గా ఉన్నది. ఈ సగటు దేశ జనాభా మొత్తానికి వర్తిస్తుంది. కింది స్థాయిలో ఉన్న 50 శాతం మంది నెలవారీ తలసరి వినియోగ వ్యయం తక్కువ స్థాయిలో ఉన్నది. జనాభాలో కింది స్థాయిలో ఉన్న 25 శాతం నెలవారీ తలసరి వినియోగం మరింత తక్కువగా ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.



భారత ఆర్థిక వ్యవస్థ తగినంత వృద్ధిరేటుతో అభివృద్ధి చెందడం లేదు. ప్రభుత్వ విధానాల (ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ఇవి ప్రతిబింబించాయి) ఫలితంగా చాలా కొద్ది మంది సంపన్నులు, మధ్యతరగతి జనాలు (వీరు మహా అయితే దేశ జనాభాలో 30 శాతంగా ఉంటారు) మాత్రమే జీవనోల్లాసంతో జీవించగలుగుతున్నారు. ఆర్థికంగా కింది స్థాయిలో ఉన్న 50 శాతం మంది ప్రజలకు సంక్షేమాన్ని సమకూర్చవలసిన బాధ్యతను ప్రభుత్వం క్రూరంగా వదిలివేసింది.

నెలవారీ తలసరి వినియోగం రూ.4,000 నుంచి రూ.7,000 దాకా మాత్రమే ఉంటే, నలుగురు సభ్యులు ఉన్న ఒక కుటుంబం సుఖప్రదంగా ఎలా జీవించగలుగుతుంది? ఈ తలసరి వినియోగ వ్యయంలోనే ఆహారం, విద్యుత్తు, విద్య, ఆరోగ్య భద్రత, అద్దె, రవాణా, అప్పుల చెల్లింపు, వినోద విహారాలు, సామాజిక బాధ్యతలు, అత్యవసర వ్యయాలు మొదలైనవి కూడా భాగంగా ఉన్నాయన్న వాస్తవాన్ని మనం విస్మరించ కూడదు.


2030 సంవత్సరం దాకా ఏటా 78.5 లక్షల ఉద్యోగాలను వ్యవసాయేతర రంగాలలో సృష్టించవలసిన అవసరమున్నదని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. గత పదేళ్లుగా మన తయారీ రంగం స్థితిగతులు క్షీణించి పోతున్నాయి. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం స్థూల దేశీయోత్పత్తిలో మన తయారీరంగం వాటా 2014లో 15.07 శాతం నుంచి 2023లో 12.93 శాతానికి తగ్గి పోయింది. ప్రపంచ వస్తూత్పత్తుల వాణిజ్యంలో చైనా వాటా 28.8 శాతం కాగా, మన దేశం వాటా కేవలం 2.8 శాతం మాత్రమే! నిరుద్యోగ యువజనులు, దినసరి వేతనకార్మికులు, స్వయం ఉపాధి శ్రామికులు అందరికీ అవసరమైన ఉద్యోగాలను మన తయారీరంగం సృష్టించలేక పోతోంది. ప్రభుత్వం ఘనంగా చెప్పే 'మేడ్ ఇన్ ఇండియా' కూడా లక్ష్య పరిపూర్తిలో విఫలమయింది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ తగినంత వృద్ధిరేటుతో అభివృద్ధి చెందడం లేదు. ప్రభుత్వ విధానాల (ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ఇవి ప్రతిబింబించాయి) ఫలితంగా చాలా కొద్ది మంది సంపన్నులు, మధ్యతరగతి జనాలు (వీరు మహా అయితే దేశ జనాభాలో 30 శాతంగా ఉంటారు) మాత్రమే జీవనోల్లాసంతో జీవించగలుగుతున్నారు. మిగతా వారి మాటేమిటి? ఆర్థికంగా కింది స్థాయిలో ఉన్న 50 శాతం మంది ప్రజలకు సంక్షేమాన్ని సమకూర్చవలసిన బాధ్యతను ప్రభుత్వం క్రూరంగా వదిలివేసింది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

పరీక్షా ఫలితాలే జీవిత విజయమా?

పరీక్షల సీజన్లలో దేశంలో ప్రతి ఏటా విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. అధిక ఒత్తిడి కారణంగా విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా ప్రకారం 2022లో మొత్తం 1,70,924 ఆత్మహత్యలు నమోదు కాగా, వాటిలో 7.6 శాతం ఆత్మహత్యలు విద్యార్థులవి. వీటిలో పరీక్షల్లో ఫెయిల్ అవుతామన్న భయంతో చేసుకున్న ఆత్మహత్యలు 2,248. ఈ ఆందోళనకరమైన ధోరణి భారతీయ సమాజాన్ని ఆవరించిన విద్యా ఒత్తిడిని నొక్కి చెబుతుంది.

పెరుగుతున్న పరీక్షా ఒత్తిడి సంక్షోభానికి ప్రతిస్పందనగా భారత ప్రభుత్వం 2018లో 'పరీక్షా పే చర్చ' (పీపీసీ)ను ప్రారంభించింది. ప్రతి సంవత్సరం జనవరి / ఫిబ్రవరి నెలల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఎంపిక చేయబడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి, ఎంపిక చేయబడ్డ ప్రశ్నలకు ప్రధానమంత్రి సమాధానాలిస్తూ ప్రసంగిస్తారు. పరీక్షలకు సంబంధించిన ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో సలహాలు అందిస్తారు. ఈ సంవత్సరం దాని ఎనిమిదవ ఎడిషన్ కార్యక్రమం ఇటీవలే ముగిసింది. పీపీసీ లక్ష్యం ప్రశంసనీయమైనప్పటికీ, దాని ప్రభావం, ప్రాధాన్యత ప్రశ్నార్థకంగానే ఉన్నాయి.



'పరీక్ష పే చర్చ' వంటి కార్యక్రమాలు విద్యార్థి ఆత్మహత్యల సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా ఉన్నప్పటికీ, వాటి ప్రభావం పరిమితంగా ఉంది. సామాజిక విలువలను పునర్నిర్వచించడం, మూల్యాంకన పద్ధతులను సంస్కరించడం, ఉపాధ్యాయ శిక్షణలో పెట్టుబడి పెట్టడం ద్వారా మాత్రమే నిజమైన పరిష్కారాలు సాధ్యం.

పీపీసీపై ఉన్న ప్రాథమిక విమర్శలలో ఒకటి దాని వనరుల కేటాయింపు. 2022 నుంచి 2024 వరకు మూడేళ్ళకు ఈ కార్యక్రమానికి రూ.62 కోట్ల ఖర్చు అయింది. 2022, 2023 సంవత్సరాలలో ఈ కార్యక్రమానికి రిజిస్టర్ చేసుకొని ఆన్‌లైన్‌లో వీక్షించిన వారికి ప్రశంసాపత్రాలను పంపించారు. దీని కోసం నేషనల్ బుక్ ట్రస్ట్ రూ.28 కోట్లు ఖర్చు చేసింది. ఒక కేంద్రీయ విద్యాలయాన్నీ, ఒక నవోదయ విద్యాలయాన్నీ ఒక ఏడాది పాటు నిర్వహించడానికి అయ్యే ఖర్చు కంటే ఒక పీపీసీ కోసం ఒక ఏడాది పెట్టే ఖర్చు ఎక్కువ. మరొక వైపు నేషనల్ టాలెంట్ సెర్చ్ పరీక్ష ద్వారా పదవ తరగతి పిల్లలకు పీహెచ్‌డీ చదువు వరకు ఇవ్వబడే స్కాలర్‌షిప్ పథకాన్ని రద్దు చేశారు. దేశవ్యాప్తంగా ప్రతిభ కలిగిన పిల్లలకు ఎంతగానో ఉపయోగపడే ఈ పథకం 1963 నుండి కొనసాగుతున్నది. సంవత్సరానికి సుమారు పన్నెండు కోట్ల రూపాయలు ఈ పథకానికి ఖర్చు అవుతాయి. ఒకపక్క ఇటువంటి ప్రభావవంతమైన కార్యక్రమాలకు బడ్జెట్లు రద్దు చేస్తూ, పీపీసీ లాంటి కార్యక్రమాలను మాత్రం నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

ప్రేరణాత్మక ప్రసంగాలు, పరీక్షల ఒత్తిడి నిర్వహణ చిట్కాలు తాత్కాలిక ఉపశమనాన్ని అందించవచ్చు. కానీ అవి పరీక్షల ఒత్తిడికి ఉండే మూల కారణాలను పరిష్కరించవు. నిజానికి ఇలాంటి ప్రసంగాలు, నిర్వహణ చిట్కాలను టీచర్లు చాలా ప్రొఫెషనల్‌గా నిత్యం అందిస్తూనే ఉంటారు. వాటికంటే ముఖ్యంగా, ఆరోగ్యకరమైన, మరింత స్థిరమైన అభ్యాస వాతావరణాన్ని సృష్టించడానికి, విధాన నిర్ణేతలు ఈ క్రింది అంశాలపై దృష్టి పెట్టాలి:

1) పరీక్షా ఫలితాలే జీవిత విజయం అనే ఇరుకైన నిర్వచనాన్ని సవాలు చేయాలి. వృత్తి శిక్షణ, కళలు, క్రీడలు వంటి ప్రత్యామ్నాయ కెరీర్ మార్గాలు సమానంగా చెల్లుబాటు అయ్యే విధానాలను పెంపొందించాలి, వాటి ఎంపికలను ప్రోత్సహించాలి. 2. అధిక పోటీతో ఉండే పరీక్షలపై అతిగా ఆధారపడటాన్ని తగ్గించాలి. తుది పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి ఏడాది పొడవునా విద్యార్థుల పురోగతిని అంచనా వేసే నిరంతర, సమగ్ర మూల్యాంకన (CCE) పద్ధతులను అమలు చేయాలి. లాభాపేక్షతో నడిచే కోచింగ్ సెంటర్లను చైనా నిషేధించింది. హోంవర్క్‌పై పరిమితులను విధించింది. మనం ఈ చర్యలను చేపట్టలేకపోతున్నాము, 'ఒకే దేశం–ఒకే పరీక్ష' విధానాలను తెస్తూ ఇంకా ఒత్తిడి పెరిగేటట్లు చేస్తున్నాము. 3. శిక్షణ పొందిన కౌన్సిలర్లు, మనస్తత్వవేత్తల సేవల ద్వారా పాఠశాలలు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగ శ్రేయస్సుపై అవగాహన కార్యక్రమాలను పాఠ్యాంశాల్లో విలీనం చేయాలి. 4. విద్యార్థుల విద్యా అనుభవాలను రూపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారు. వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థి కేంద్రీకృత అభ్యాసంపై మొక్కుబడి శిక్షణలు గాక సరైన శిక్షణ అందించడం వలన మరింత ఆకర్షణీయమైన తరగతి గది వాతావరణం ఏర్పడుతుంది. 5. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, ఉపాధ్యాయ–విద్యార్థి నిష్పత్తులను తగ్గించడానికి, వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించడానికి ప్రభుత్వం తగినంత నిధులను కేటాయించాలి. ప్రజా సంబంధాలను పెంచుకునే పనిలో భాగంగా పెద్దగా ప్రభావాన్ని కలిగించని కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తూ, ముఖ్యమైన కార్యక్రమాలకు బడ్జెట్ తగ్గిస్తున్నారు. ఇది ప్రతికూల ఫలితాన్నిస్తుంది.

పరీక్షల ఒత్తిడి కారణంగా పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య వ్యవస్థాగత సంస్కరణల తక్షణ అవసరాన్ని గుర్తు చేస్తుంది. 'పరీక్ష పే చర్చ' వంటి కార్యక్రమాలు ఈ సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా ఉన్నప్పటికీ, వాటి ప్రభావం పరిమితం. సామాజిక విలువలను పునర్నిర్వచించడం, మూల్యాంకన పద్ధతులను సంస్కరించడం, ఉపాధ్యాయ శిక్షణలో పెట్టుబడి పెట్టడం ద్వారా మాత్రమే నిజమైన పరిష్కారాలు సాధ్యం.

• ఎడమ శ్రీనివాస రెడ్డి
అధ్యాపకులు

మలయాళీ బానిసల న్యాయ ఉద్ఘోష

కేరళకు చెందిన పోయ్‌కయిల్ యోహనన్ గొప్ప సంఘ సంస్కర్త. సామాజిక విప్లవకారుడిగా ఆయన అక్కడి బానిస జాతుల అభ్యున్నతి కోసం జీవితకాలం పోరాడాడు. వివిధ సంస్థలను స్థాపించి తన పాటలు, ప్రసంగాల ద్వారా దళిత జన ఐక్యతకు పాటుపడ్డాడు. ఆనాటి బానిస జాతుల వేదనలను తన పాటల ద్వారా వినిపించాడు. ఆయన రాసిన 'నా గురించి ఒక్క అక్షరమూ లేదు' అనే గీతం ఇప్పటికీ అక్కడి జనం గొంతెత్తి పాడుకుంటారు. "ఎన్నో జాతుల గురించి చరిత్రలున్నాయి/ మా గురించి ఎక్కడా ఓ అక్షరం లేదు/ నా జాతి చరిత్ర రాసేందుకు భూమ్మీద ఎవరూ లేరు/ నేల నుంచి ఆకాశం దాకా మమ్మల్ని ద్వేషించేవారే!" అనే పంక్తులు అప్పటి మలయాళీ బానిస జాతుల వేదనను స్పష్టం చేస్తాయి. దేశంలో నేటికీ మారని అణగారిన వర్గాల పరిస్థితులకు అవి అద్దం పడతాయి.

బానిస వ్యవస్థ అంటే అమెరికాలో నీగ్రోలే గుర్తుకొస్తుంటారు. అయితే అదే పరిస్థితి కేరళలోని సంస్థానాల్లో ఎంతోకాలం కొనసాగింది. దళిత, గిరిజనులను దొరకబుచ్చుకొని వారిని బానిసలుగా అమ్ముకున్న చరిత్ర కేరళకు ఉంది. అయితే, బ్రిటిష్ పాలనా కాలంలో వివిధ సంస్థానాలు 1850–60 దశకాల్లో ఈ దురాచారాన్ని రద్దు చేశాయి. అయితే చట్టాలు సామాజిక ఆచరణలోకి ఊరికే రావు. వాటి కోసం సామాజిక ఉద్యమాలు కావాలి. దళితజాతులపై వివక్షను సమాజంలోంచి పెకిలించేందుకు పాటుపడిన కేరళ ఉద్యమకర్తల్లో పోయ్‌కయిల్ యోహనన్ ముందుంటారు. కేరళలోని ఎరవిపేరూరులో యోహనన్ 17 ఫిబ్రవరి 1879న జన్మించాడు. ఆయనది పరయ బానిస కుటుంబం.



దళిత క్రైస్తవులపై వివక్షకు నిరసనగా 1909లో ఆయన ప్రత్యక్ష రక్ష దైవసభను స్థాపించాడు. ఈ సభ ద్వారా దిగువజాతులపై జరుగుతున్న మతపర వైపరీత్యాలను తీవ్రంగా వ్యతిరేకించాడు. మతాతీతంగా మనుషులందరిలో దేవుడున్నాడని, మనుషులందరి హితం కోరే మనిషి రూపంలోనే ఉద్భవిస్తాడని ఆయన అనుచరులకు బోధించాడు.

సంస్కర్తగా యోహనన్ అణగారిన జాతుల క్షోభ అందరికీ చేరేందుకు కవిత్వాన్ని ఆయుధంగా వాడుకున్నాడు. ఆయన గేయాల్లో దళిత పేదల బాధలు కళ్ళకు కట్టినట్లుగా ఉంటాయి. సామాన్యులకు అర్థమయ్యే రీతిలో, జనభాషలో రాసిన ఆ పాటలు మౌఖికంగా వ్యాప్తి చెంది ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి. "నన్ను బానిస అంటే చర్చికి వెళ్ళాను/ అక్కడా అందరితో సమానంగా నన్ను చూడలేదు/ హిందుత్వపు నీడలో అస్తిత్వాన్ని వెదుకుతూ/ చివరి వరుసలో అనాథగా తిరుగుతున్నాను/ హిందువులు, క్రిస్టియన్లు మమ్మల్ని ఎవరూ తమవారిగా ఒప్పుకోరు/ నా జాతి గురించి చెప్పుకోవడానికి నేను సిగ్గు పడను/ గుండె నిండా వేదనతో నా గాథ ముందుంచుతాను/ జనంలోని క్రూరత్వాన్ని విప్పి చెబుతాను/ అందరి దృష్టిలో ఈ భూమ్మీద నేను శాపగ్రస్త జీవిని/ భూమ్యాకాశాల నడుమ నన్నే నిందిస్తారు/ భూమ్మీద అన్నిటిని తీర్చిదిద్దిన దేవుడు/ ఈ వివక్షను ఎలా అనుమతించాడు" అని తన గీతాల్లో ఆయన ప్రశ్నించాడు.

"దైవమా నన్ను విస్మరించకుము/ భూమ్మీద ఏ ఒక్కరు నన్ను దీవించలేదు/ భవిష్యత్తులో కూడా జరుగుతుందని ఆశ లేదు/ ఈ భూమ్మీద నన్ను అంగీకరించేవారెవరూ లేరు/ మరెవరు రారు/ నీ భుజాలతో చుట్టేసి నా కన్నీరును తుడువు/ ఈ భూమ్మీద ఎవరికీ చెందని గూటి కోసం వెదుకుతూ తిరుగుతున్నాను/ నా బాధ్యత తీసుకొని చేరదీసి పక్కన కూచోబెట్టుకో/ మోక్షం ప్రసాదించి నా బాధల్ని తుడిచెయ్" అని ఆధ్యాత్మిక ధోరణిలో వేడుకున్నాడు. రత్నమాణికల్ అనే పేరిట యోహనన్ గీతాలు సంపుటిగా వచ్చాయి. ఎం.ఆర్. రేణుకుమార్ 'పోయ్‌కయిల్ యోహనన్' అనే పేరుతో ఆయన ఆత్మకథను రాశాడు. యోహనన్ జీవితాన్ని వి.వి. శాంతకుమార్ 'మన్నిక్కులే మాణిక్యం' పేరుతో నాటకంగా తీర్చిదిద్దాడు. ఆత్మగౌరవం కోసం వెదికిన యోహనన్ తొలుత మార్థోమా సిరియన్ చర్చి విధానాన్ని స్వీకరించాడు. అక్కడ కూడా క్రైస్తవుల మధ్య సమానత్వం దొరకకపోవడంతో దాన్ని వదిలేశాడు. ఆ తర్వాత ఎవాంజెలికల్ అనే క్రిస్టియన్ బ్రెదెన్ మిషన్‌లో చేరి నాలుగేళ్ళ తర్వాత అదీ నచ్చక బయటికొచ్చాడు. ఈ రెండు అనుభవాల తర్వాత భారత సమాజంలోని క్రిస్టియన్లలో కులతత్వం మూలాల్లోనే ఉందని, క్రీస్తు బోధనల వల్ల అది మరింత లోతుగా వెళ్లిందని గ్రహించిన ఆయన సొంత మార్గంలో దళిత విముక్తి ఉద్యమంగా ప్రత్యక్ష రక్ష దైవసభను స్థాపించాడు.

"బైబిల్‌లో మా గురించి ఒక్క అక్షరం లేదు. అందులో ఉన్నదంతా బయటి ప్రాంతాల్లో జరిగిందే. మా బానిసత్వం గురించి ప్రస్తావన, సానుభూతి కనబడని పుస్తకాన్ని మేమెందుకు చదవాలి" అని ప్రశ్నించాడు. క్రైస్తవాన్ని నిరసిస్తూ తనను ద్రావిడ దళితుడిగా ప్రకటించుకున్నాడు. కేరళకు చెందిన ప్రసిద్ధ సంఘ సంస్కర్త అయ్యంకాళి స్థాపించిన సాధుజన పరిపాలన సంఘంలో సభ్యత్వం తీసుకున్నాడు. దళితజాతి ఉన్నతికి నిర్విరామంగా పాటుపడిన యోహనన్ 29 జూన్, 1939న మరణించాడు. నేటికీ కేరళలోని అణగారిన వర్గాల గుండెల్లో ఉద్యమకర్తగా, వాగ్గేయకారుడిగా ఆయన స్థానం పదిలంగా ఉంది.

• బి. నర్సన్

(ఫిబ్రవరి 17: పోయ్‌కయిల్ యోహనన్ జయంతి)



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మొక్కు చెల్లించేందుకు గద్దెలకు వస్తున్న భక్తురాలు

భక్తురాలి పూనకం

భక్త వనసంద్రం

చిన్న జాతరకు పోటెత్తుతున్న జనం

- మూడోరోజు 2లక్షల మందికిపైగా రాక
- సందడిగా మేడారం పరిసరాలు, వనదేవతల గద్దెలు
- నేడు ముగియనున్న మినీ సంబురం

వివరాలు : 7 లో..

వనం.. భక్త జన సంద్రంగా మారింది. చిన్న జాతరకు తరలొస్తున్న లక్షలాది భక్తులతో మేడారం పరిసరాలు, వన దేవతల గద్దెల ప్రాంగణాలు సందడి మారాయి. ఈ మినీ సంబురంలో మూడోరోజూ పూజారులు మేడారం గ్రామంలోని సమ్మక్క కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ పూజా మంది రాల్లో అంతర్గత పూజలు చేశారు. శుక్రవారం సుమారు 2 లక్షల మందికిపైగా తరలొచ్చి జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించి.. గద్దెలకు చేరుకొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించు కున్నారు. ఇక ఈ మినీ జాతర సంరంభం శనివారం ముగియ నుండగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరి రోజు శనివారంతో పాటు, ఆదివారం భక్తులు భారీగా తరలొస్తారన్న అంచనాలు వేసిన అధికారులు ఆమేరకు ఏర్పాట్లు చేశారు.

- తాడ్వాయి, ఆంధ్రజ్యోతి



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

సొసైటీలకు కలిసొచ్చిన కాలం

- డీసీసీ బ్యాంకు, పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు పొడిగింపు
- ఆరు నెలల పాటు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- ఆనందంలో ప్రజాప్రతినిధులు.. సీఎంకు కృతజ్ఞతలు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీసీసీ బ్యాంకు, పీఏసీఎస్ నూతన పాలకవర్గాల ఏర్పాటు విషయమై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్రంలోని డీసీసీ బ్యాంకులు, పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువును 6 నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నుంచి టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్‌రావు ప్రభుత్వ ఉత్తర్వులను అందుకున్నారు. దీంతో పాలకవర్గ సభ్యుల్లో ఆనందం నెలకొంది.

మహాజన సభలోనే సభ్యుల ఆశాభావం

డీసీసీ బ్యాంకు చివరి మహాజన సభ జనవరి 20న జరిగింది. ప్రభుత్వం గడువు పొడిగిస్తే మిగిలిన లక్ష్యాలను కూడా పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్న భావనలను సభ్యులు వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం గడువు పొడిగించాలనే విజ్ఞాపనతో పాటు ఆ మేరకు సర్కారు స్పందిస్తుందన్న ఆశాభావాన్ని సైతం వ్యక్తం చేశారు. చివరకు ప్రభుత్వం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పాలకవర్గ సభ్యుల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరిశాయి.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు : టెస్కాబ్ చైర్మన్

సహకార సంఘాలకు మరో ఆరు నెలల గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయడంపై టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలకు రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలియచేశారు.

గంజాయి తరలిస్తున్న దంపతుల అరెస్టు

- వరంగల్ రైల్వేస్టేషన్‌లో పట్టివేత
- 64లక్షల విలువ చేసే 24 కిలోల సరుకు స్వాధీనం



గంజాయితో పట్టుబడ్డ దంపతులు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తున్న ఒడిషాకు చెందిన దంపతులను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.64లక్షల విలువ చేసే 24కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం... ఒడిషాకు చెందిన గోగి శంకర్ దాసు(39), పూర్ణిమ గోగిదాస్(30) దంపతులు ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో నివాసం ఉంటున్నారు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు ఒడిషా నుంచి సూరత్‌కు గంజాయి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దానిలో భాగంగా నిందితులు ఒడిషాలో పరిచయం ఉన్న ప్రదీప్ అనే గంజాయి స్మగ్లర్ వద్ద గంజాయిని కొనుగోలు చేశారు. బ్యాగుల్లో రహస్యంగా భద్రపరిచి రైలు ద్వారా ముంబయి నుంచి సూరత్‌కు పలుమార్లు తరలించారు. ఇదే తరహాలో నిందితులు శుక్రవారం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయిని తరలించారు. అయితే పట్టుబడుతామనే భయంతో వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగారు. మరో మార్గం గుండా ముంబయి వెళ్లేందుకు మూడో ప్లాట్‌ఫారమ్ నుంచి రైల్వేస్టేషన్ బయటికి పోతున్నారు. ఈ క్రమంలో దంపతులపై డ్రగ్ కంట్రోల్ టీంతో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మిల్స్‌కాలనీ ఎస్సై సురేశ్‌కు అనుమానం వచ్చింది. వారిని ఆదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా బ్యాగుల్లో గంజాయి లభ్యమైందని సీఐ తెలిపారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో వసతులు కల్పించాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలలకు మంజూరైన నిధులను పాఠశాలల్లో వివిధ వసతుల కల్పనకు సత్వరమే వినియోగించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పీఎంశ్రీ పథకం, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ఉదయం, సాయంత్రం వేళల్లో తప్పనిసరిగా గంటపాటు నిర్వహించాలన్నారు. ప్రతీ విద్యార్థికి అల్పాహారాన్ని అందించి విద్యాశాఖ రూపొందించిన అభ్యాస దీపికలను వినియోగించాలన్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో వారికి కేటాయించిన నిధులను సకాలంలో వినియోగించాలన్నారు. పాఠశాలల్లోని విద్యార్థులను విజ్ఞాన యాత్రలో భాగంగా చారిత్రక ప్రదేశాలు, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు దర్శించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులలో మిగిలిన వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, సమగ్ర శిక్ష గుణాత్మక విద్య సమన్వయ అధికారి ఎ.శ్రీనివాస్‌రెడ్డి, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, జీసీడీఓ సునీత, ప్రణాళిక అధికారి బోయినపల్లి మహేశ్, సహాయ గణాంక సమన్వయకులు రఘుచందర్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు చేపట్టండి

వరంగల్ కలెక్టరేట్: పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యోగితా రాణా మాట్లాడుతూ.. పీఎంశ్రీ, సర్వశిక్ష అభియాన్ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు మంజూరైన నిధులను వివిధ వసతుల కల్పనకు సత్వరమే వినియోగించాలన్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి స్ఫూర్తిదాయకమైన విజ్ఞానం, కథల పుస్తకాలను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. ఎంపిక చేసిన పాఠశాలలో మ్యూజికల్ బ్యాండ్, క్రీడోత్సవాలు, వార్షికోత్సవం తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. అనంతరం వరంగల్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా పరిధిలో పీఎంశ్రీ పథకం కింద 16 పాఠశాలలను ఎంపిక చేసి ప్రభుత్వం కేటాయించిన నిధుల ద్వారా చేపట్టిన పనుల్లో కొన్ని పూర్తి అయినట్లు తెలిపారు. కొన్ని పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నట్లు వివరించారు. అదే విధంగా సర్వశిక్షా అభియాన్ కింద మంజూరైన నిధులను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా పాఠశాలలకు అభివృద్ధి పనుల చెల్లింపు నిమిత్తం నిధులను కూడా కేటాయించినట్లు తెలిపారు. జూమ్ మీటింగ్‌లో డీఆర్వో విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన కల్పించండి..

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- కంపోస్ట్ యూనిట్‌ను అకస్మికంగా తనిఖీ చేసిన కమిషనర్



పోతననగర్ కంపోస్ట్ యూనిట్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చెత్తను వేరు వేరుగా సేకరించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. వరంగల్ పోతన నగర్‌లోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లోని కంపోస్ట్ యూనిట్‌ను శుక్రవారం కమిషనర్ అకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. చెత్త సమస్యలను సమర్థవంతంగా నిర్మూలిచేందుకు పలు డివిజన్‌లను ఎంపిక చేశామన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయడానికి శానిటేషన్ సిబ్బంది ప్రజల వద్దకు వెళ్లి చైతన్యం కలిగించాలన్నారు. తడి, పొడి చెత్తను డీఆర్‌సీసీ సెంటర్‌లకు తరలిస్తామన్నారు. మోడల్ డివిజన్‌ల నుంచి సేకరించిన చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అన్ని డివిజన్‌లలో కూడా ఇదే తరహాలో చెత్తసేకరణ జరగాలని సూచించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న డ్రైకంపోస్ట్ సెంటర్‌ను సందర్శించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్‌వర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చెన్నూరి శ్యాంరాజ్, వెంటేశ్, ఐటీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలుంటే శ్రేయోభిలాషులతో పంచుకోండి

- క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబాలు రోడ్డున పడతాయి
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో కానీ లేదా ఏదైనా వ్యక్తిగత సమస్యలతో ఒత్తిళ్లకు గురైతే శ్రేయోభిలాషులకు లేదా స్నేహితులతో పంచుకోని సమస్య నుంచి బయటపడాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. విధి నిర్వహణతో పాటు వ్యక్తిగతంగా ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లను నియంత్రించడం ఎలా అనే దానిపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలోని రాణి రుద్రమదేవి ఆడిటోరియంలో శుక్రవారం అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నిరంతరం విధులు నిర్వర్తించే పోలీసులు విధి నిర్వహణలో భాగంగా ఎన్నో పని ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రణాళికబద్ధంగా, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తే ఒత్తిళ్లను అధిగమించవచ్చన్నారు. వ్యక్తిగత కారణాలతో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లు చాలా ప్రమాదకరమని, కొన్ని సందర్భాల్లో ఆ ఒత్తిళ్ల కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. ఆ క్షణాల్లో తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఉంటుందన్నారు. ఒత్తిళ్లను అధిగమించేందుకు.. రోజూ కొద్దిసేపు వ్యాయామం లేదా యోగాకు సమయాన్ని కేటాయించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అలవాటు చేసుకొని ఆనారోగ్యానికి గురయ్యే అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి, స్వరూప, బెన్‌సన్‌లు మానసిక ఒత్తిళ్లను ఏ విధంగా నియంత్రించుకోవాలనే దానిపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏసీపీలు జితేందర్, మధుసూదన్, నాగయ్య, అనంతయ్య, ఏఓ రామకృష్ణ, ఆర్ఐలు, ఇన్స్‌పెక్టర్లు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

మెరుగైన సేవలు అందించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మాతా, శిశు సంక్షేమ కార్యక్రమాల ద్వారా మాతృ మరణాల రేటు, శిశు మరణాల రేటు చాలా వరకు తగ్గినప్పటికీ ఇంకా మెరుగైన సేవలు అందించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అర్మాన్ స్వచ్ఛంద సంస్థ, జాతీయ ఆరోగ్య మిషన్ సంయుక్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. అధిక రక్తపోటు, మధుమేహం, క్షయ వ్యాధి, రక్తహీనత, అధిక బరువు, మెంటల్ హెల్త్, ప్రమాదకరమైన సూచనలు ఉన్నప్పుడు వారి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ సంతోషిణి, డాక్టర్ సౌజన్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ్ కుమార్, ప్రోగ్రాం అధికారి మంజుల, అర్మాన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, డెమో అశోక్‌రెడ్డి, ప్రసన్న కుమార్, రాజేశ్వర్ రెడ్డి, ప్రవీణ్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణికులపై ఆర్టీసీ బాదుడు

మేడారం వెళ్లే భక్తుల నుంచి అదనపు చార్జీల వసూళ్లు

బస్సులు లేక ఇతర ప్రయాణికుల ఇబ్బందులు



హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర కోసం వెళ్లే భక్తులపై ఆర్టీసీ ప్రత్యేక బస్సుల పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తోంది. హనుమకొండ బస్టాండ్ నుంచి ములుగు జిల్లా మేడారం జాతరకు వెళ్లే భక్తులకు స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశామని చెప్పిన ఆర్టీసీ అధికారులు.. ప్రయాణికులపై అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్లు భక్తులు మండిపడుతున్నారు.

టిక్కెట్ ధరలు పెంచి..

హనుమకొండ నుంచి మేడారానికి సాధారణ రోజులలో రూ.120 పెద్దలకు ఉండగా, చిన్నారులకు రూ.60 టికెట్ ధర ఉంది. జాతర కోసం ప్రస్తుతం ప్రత్యేక బస్సులలో పెద్దలకు రూ.200, చిన్నారులు రూ.90 అధికంగా వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు.

బస్సులు లేక ఇబ్బందులు

వరంగల్ రీజినల్ పరిధిలో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక బస్టాండ్‌లలో గంటల తరబడి ఎదురుచూస్తున్నారు. వరంగల్ రీజియన్‌లోని పరకాల, నర్సంపేట, తొర్రూరు, జనగామ, ములుగు, వరంగల్-1, వరంగల్-2, హనుమకొండ, భూపాలపల్లి డిపోల పరిధిలోని బస్టాండ్ల కూడళ్లలో బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. సాయంత్రం హనుమకొండ బస్టాండ్ నుంచి హైదరాబాద్, నిజమాబాద్, కరీంనగర్, కాళేశ్వరం వెళ్లే రూట్లలో సమయానికి బస్సులు లేక ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలలో వెళ్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు.

పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

మహాలక్ష్మీ పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. దీంతో ప్రయాణికులకు సరిపడా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో బస్సులలో రద్దీ పెరిగి ప్రయాణికులు కూర్చోవడానికి సీట్లు దొరకడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రయాణికులకు సరిపడా బస్సులు ఏర్పాటు చేసి పెంచిన టికెట్ ధరలు తగ్గించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీఎస్ఏ అవార్డు సెలక్షన్ కమిటీ మెంబర్‌గా మోహన్



కేదాసి మోహన్

బాలసముద్రం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర సెలక్షన్ కమిటీ మెంబర్‌గా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత కేదాసి మోహన్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. మార్చి 25న మహారాష్ట్ర పూణేలో నిర్వహించే 18వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో మహాత్మా జ్యోతీరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఏపీజే అబ్దుల్ కలాం సేవారత్న సాహిత్య రత్నతో పాటు అనేక రంగాలకు చెందిన సామాజిక ఉద్యమకారులు సంఘ సేవకులకు కవులు, రచయితలు గాయకులకు అవార్డులు ప్రదానం చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ : 97012 96568 లో సంప్రదించాలని ఆయన కోరారు. అకాడమీ మెంబర్‌గా తనను నియమించిన బీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దూడపై హైనా దాడి

- గర్మిళ్లపల్లిలో భయాందోళన చెందుతున్న రైతులు
- వరుసగా ఇది నాలుగో సారి
- పట్టుకునేందుకు ఆటవీశాఖ బోను ఏర్పాటు



హైనాను బంధించేందుకు తీసుకు వచ్చిన బోను

ఐనవోలు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం గర్మిళ్లపల్లిలో గురువారం రాత్రి దూడపై హైనా దాడి చేసి చంపేసింది. వారం వ్యవధిలో ఇదే ప్రాంతంలో వరుసగా ఇది నాలుగో ఘటన. దీంతో ఈ ప్రాంత రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గర్మిళ్లపల్లికి చెందిన రైతు గండు రాజు గర్మిళ్లపల్లి - ఐనవోలు గ్రామాల మధ్య (మల్లన్న పాదాల బండ) సమీపంలో ఉన్న తన వ్యవసాయ భూమి వద్ద పాకలో గురువారం రాత్రి కాడెడ్లు, ఆవులు, పాడి గేదే, దూడ మొత్తం 8 పశువులను కట్టేసి రాత్రి ఇంటికి వెళ్లాడు. తెల్లవారాక పాలు పితికేందుకు రాగా అప్పటికే హైనా దుడ్డెను చంపి తినేసింది. వారం వ్యవధిలో గ్రామ శివారులో రెండు లేగదూడలు, ఒక దుడ్డెపై హైనా దాడిచేసి చంపేసింది. దీంతో రైతులు బయాందోళనలకు గురవుతున్నారు. ఫలితంగా వ్యవసాయ పనులు కుంటుపడుతున్నాయని రైతులు వాపోతున్నారు. కాగా, రెండు గ్రామాల మధ్య వందల ఎకరాల్లో మొక్కజొన్న చేలు, మధ్య, మధ్యలో బోడ్లు, పొదలు ఉండటంతో హైనా ఆ ప్రాంతంలోనే తచ్చాడుతూ రాత్రివేళల్లో కట్టేసిన దూడలను హైనా తీంటోంది. వరుసగా హైనా దాడిచేస్తుండటంతో లేగదూడలు, దుడ్డెలు, గొర్రెలు, మేకలను వ్యవసాయ భూముల వద్ద కట్టేయవద్దని అటవీశాఖ అధికారులు దండోరా వేయించి రైతులకు అవగాహన కల్పించినప్పటికీ రైతులు పశువులకు ఇళ్లకు తోలుకపోవడం లేదు. వ్యవసాయ భూములు గ్రామానికి దూరంగా ఉండటంతో పశువులను తోలుకపోవడం తీసుకరావడం ఇబ్బందిగా ఉందని రైతులు ససేమిరా అంటున్నారు. ఆహారం దొరకకుండా చేస్తే ఆ ప్రాంతం నుంచి వెళుతుందనిచెప్పినా రైతులు వినడం లేదని వాపోతున్నారు.

హైనాను బంధించేందుకు బోను ఏర్పాటు

హైనాను బంధించేందుకు ఎట్టకేలకు ట్రాప్ (బోను)ను ఏర్పాటు చేశారు. క్రూరమృగాలను బంధించేందుకు తయారు చేసిన బోనును వరంగల్ జూ పార్కు నుంచి గర్మిళ్లపల్లికి తరలించారు. ఎఫ్ఆర్‌వో భిక్షపతి ఆధ్వర్యంలో డీఆర్‌వో మోహన్, సిబ్బంది కలిసి గురువారం సాయంత్రం దుడ్డెను చంపిన స్థలానికి సమీపంలో బోనును ఏర్పాటు చేశారు. దుడ్డే కళేబరానికి ఎరగా వేసి బోనులో చిక్కేవిధంగా ఏర్పాట్లు చేశారు. కళేబరం వాసనను పసిగట్టి తినడానికి తప్పక వస్తుందని.. అలా వచ్చిన హైనా బోనులో చిక్కుకుపోతుందని ఎఫ్ఆర్‌వో తెలిపారు.

బీఆర్ఎస్ నేతలకు మతి భ్రమించింది..

- కేటీఆర్, కవితలకు వింత జబ్బు సోకింది...
- పేపర్లలో ఫొటో కనిపించకపోతే వారికి పిచ్చిలేస్తుంది..
- ఉప ఎన్నికలు ఎదుర్కోవడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉంది..
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయి, మతిభ్రమించి మాట్లాడుతున్నారని, పేపర్లలో కనిపించకపోతే వారికి పిచ్చిలేస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎద్దేవా చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవి, అధికారం లేకుండా ప్రజాసేవా చేసే అలవాటు బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. అందుకే ప్రభుత్వం ఎప్పుడు పడిపోతుందా, ఎప్పుడు అధికారంలోకి రావాలా అన్న ఆలోచనలో ఉన్నారని, బీఆర్ఎస్ నేతలు తొందరపడొద్దని, నాలుగేళ్లు వేచి ఉండాలని, అప్పుడే ఎన్నికలు వస్తాయన్నారు. ఒకవేళ ఉప ఎన్నికలు వచ్చినా ఎదుర్కోవడానికి తాము సిద్ధమేనని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు రాష్ట్రం మిగులు బడ్జెట్ ఉంటే, బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ స్పష్టం చేసినట్టు గుర్తుచేశారు. కేటీఆర్, కవితలకు వింత జబ్బు సోకిందని, పత్రికలు, మీడియాలో వారి ముఖాలు కనిపించకపోతే అయ్యో ఎక్కడ వెనుకబడిపోతామోననే వింత జబ్బుతో బాధపడుతున్నారని దుయ్యబట్టారు. బీసీల రిజర్వేషన్లపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందని, బీసీల విషయం ఆమెకు ఏం అవసరమని, ఆమెను ఎవరడిగారని, అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని, 42 శాతంకు బీసీ రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆర్థిక వెసులుబాటు ను చూసుకొని కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు.

వాటర్ ట్యాంకు ఎక్కిన మాజీ సర్పంచ్

- చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో చర్య
- నడికూడ మండల కేంద్రంలో ఘటన



నడికూడలో వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు

నడికూడ, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి కోసం చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో హనుమకొండ జిల్లా నడికూడ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ వాటర్‌ట్యాంకు ఎక్కి నిరసన వ్యక్తం చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నడికూడ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో శుక్రవారం వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. కొంతసేపటికి ఆయన కిందికి దిగి మీడియాతో మాట్లాడారు. 2018 నుంచి 2024 వరకు నడికూడ గ్రామానికి సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికోసం చాలా పనులు చేశానని, వాటికి సంబంధించిన రూ.51 లక్షల బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందలేదని ఆరోపించారు. నూతన జీపీ కార్యాలయం, మన ఊరు మన బడిలో పాఠశాల డైనింగ్ హాల్ నిర్మాణం, హెచ్ఎం ఆఫీసు నిర్మాణం, ఎంపీపీఎస్ క్లాస్ రూం నిర్మాణం, పైపులైన్, గ్రామంలో లైటింగ్, తదితర అభివృద్ధి పనుల కోసం రూ. 51.50 లక్షలు ఖర్చు చేసి అప్పుల పాలయ్యామని తెలిపారు. గ్రామాభివృద్ధికి కష్టపడడమే మేం చేసిన తప్పా.. అంటూ నిలదీశారు. అప్పులకు వడ్డీలు కట్టలేక ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అయినప్పటికీ సర్పంచుల పెండింగ్ బిల్లులను విడుదల చేయడం లేదని వాపోయాడు. ప్రభుత్వం సర్పంచుల పెండింగ్ బిల్లుల నిధులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కిన్నెర మణి, మాజీ పాక్స్ డైరెక్టర్ ఊర సతీష్ రావు, బీఆర్ఎస్ నాయకులు దుప్పటి మొగిళి తదితరులు పాల్గొన్నారు.



సమ్మక్క గద్దె వద్ద మొక్కుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మేడారంలో వరంగల్ సీపీ పూజలు

తాడ్వాయి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మలను వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం రాత్రి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వనదేవతల గద్దెలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

17న మహా కుంభమేళాకు ప్రత్యేక రైలు

కాజీపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు కాజీపేట మీదుగా ఈనెల 17న ప్రత్యేక రైలు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు (07121) చర్లపల్లి - ధానాపూర్‌ల మధ్య నడవనున్న ఈ రైలు చర్లపల్లిలో మధ్యాహ్నం 3:10 నిమిషాలకు బయలుదేరి కాజీపేటకు 5.10కి చేరుకుంటుంది. ఈ రైలు కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బాల్హార్షా, చంద్రాపూర్, సేవాగ్రామ్, నాగపూర్, ఇటార్సీ, పిపారియ, జబల్‌పూర్, కట్నీ, సట్న, మనిక్‌పూర్, ప్రయాగ్‌రాగ్, చెక్కి, మిజాపూర్, దీన్‌దయాల్ రైల్వేస్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అర్చకుడిపై దాడి అమానుష చర్య

వడ్డెపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ప్రసిద్ధి చెందిన చిలుకూరి బాలాజీ దేవాలయం ప్రధానార్చకుడు రంగరాజన్‌పై దాడి అమానుష చర్య అని శ్రీవైష్ణవ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెలిగేటి సేనాచార్యులు అన్నారు. శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో శ్రీవైష్ణవ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన రంగాచార్యులు అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్చకులు రంగరాజన్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీవైష్ణవ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు అమరవాది పురుషోత్తమాచార్యులు, ఆర్థిక కార్యదర్శి డింగరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వందేభారత్ రైలుకు కోచ్‌ల కుదింపు

కాజీపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి నాగపూర్ రైల్వేస్టేషన్‌ల మధ్య ప్రయాణించే (20101) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైలుకు ఇక నుంచి కోచ్‌లను కుదించి నడిపించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. ఇంతకు ముందు 20 కోచ్‌లతో నడిచే ఈ రైలు ఇక నుంచి కేవలం 8 కోచ్‌లతో మాత్రమే నడవనుంది. ప్రధానంగా ఈ రైలులో ప్రయాణికులు తక్కువగా ప్రయాణించడం ఒక కారణమైతే చార్జీలు ఎక్కువగా ఉండడం మరో కారణం అని రైల్వే అధికారులు అంటున్నారు. ఇదే మార్గంలో రాజధాని, దురంతో ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకల సమయంలో కూడా పెద్దగా తేడా లేకపోవడం తో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల ఆదరణ లేదనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం కోచ్‌లు తగ్గించి నడిపే ఈ వందేభారత్ రైలుకు సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



రఘురామారావు | వీరేశం | సదానందం | మామిడాల ఇస్తారీ | ఎస్.ప్రసాద్

అత్యున్నత ప్రతిభ చూపిన కేయూ ప్రొఫెసర్లు

- అత్యున్నత ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్‌లో వెల్లడి
- ఫార్మసీలో ముగ్గురు.. లైఫ్‌సైన్స్‌లో ఇద్దరికి చోటు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలోని ఐదుగురు ప్రొఫెసర్లు అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన ఏడీ సైంటిపిక్ ఇండెక్స్ సంస్థ-2025 (ఆల్పర్ డోగర్)లో అత్యున్నత ప్రతిభ చాటారు. ఈ మేరకు శుక్రవారం అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్ సంస్థ-2025 (ఆల్పర్ డోగర్) ఏడాదికి ప్రపంచవ్యాప్తంగా వివిధరంగాల్లోని అత్యున్నత ప్రతిభావంతులైన సైంటిస్టులను ఎంపిక చేసి ప్రకటించింది. దీనిలో కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఫార్మసీ నుంచి ముగ్గురు, లైఫ్ సైన్స్‌లో మరో ఇద్దరికి చోటు దక్కింది. ప్రొఫెసర్లు తాము రూపొందించిన పరిశోధన పత్రాల ఇండెక్స్, ఐ-10 ఇండెక్స్ సైటేషన్‌లోని ప్రతిభ ఆధారంగా ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్ సంస్థ-2025 (ఆల్పర్ డోగర్) ప్రొఫెసర్ల ఐదుగురిని ఎంపిక చేసినట్లు ప్రకటించింది. కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ రఘురామరావు, ప్రొఫెసర్ సిద్ది వీరేశంలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే లైఫ్‌సైన్స్ బయోటెక్నాలజీ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ సదానందం తృతీయ స్థానంలో నిలిచారు. తర్వాతి స్థానాల్లో కేయూ జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, ఫార్మసీ కళాశాల ప్రస్తుత ప్రిన్సిపాల్ నీరడి ప్రసాద్‌లు వర్సిటీస్థాయిలో ఘనత చాటారు. కాగా, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ ఇప్పటి వరకు నాలుగు పేటెంట్‌లు, వందాలది ప్రఖ్యాత పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఫార్మసీ విభాగం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నీరడి ప్రసాద్ పేటెంట్‌లు సాధించారు. అలాగే ప్రసాద్ అమెరికాలో ఏడాదిపాటు పోస్టు డాక్టోరల్ ఫెల్లోగా పరిశోధనలు సాగించారు. కాగా, ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్ సంస్థ-2025 (ఆల్పర్ డోగర్) ర్యాకింగ్‌లో అమెరికాలోని హార్వర్డు మొదటి స్థానం పొందగా, ఇండియాలో బెంగళూరు. మొదటి స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా 960వ స్థానంలో కేయూ చోటు నిలుపుకోగా ప్రపంచవ్యాప్తంగా 8939 ర్యాంకులో కాకతీయ యూనివర్సిటీ నిలిచింది. ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్ సంస్థ-2025 (ఆల్పర్ డోగర్) స్థానం పొందిన ప్రొఫెసర్లను పలువురు అభినందించారు.

యువతితో అసభ్య ప్రవర్తన

రెడ్డికాలనీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డికాలనీ ప్రాంతంలో ఓ యువతితో ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించారు. స్థానికుల వివరాల ప్రకారం.. రెడ్డికాలనీ ప్రాంతానికి చెందిన ఓ యువతి శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో రోడ్డుపై ఉన్న టైలర్ షాపునకు బయలుదేరింది. అదే ప్రాంతంలో నివాసం ఉండే వివాహితుడు యువతి ఒంటరిగా వెళ్లడాన్ని గమనించాడు. ఆ ప్రదేశం అంతా కారుచీకటిగా ఉండటంతో దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టేందుకు యత్నించాడు. ఆ యువతి కేకలు వేయడంతో అక్కడి నుంచి జారుకున్నాడు. యువతి తల్లిదండ్రులు వెంటనే 100కు డయల్ చేయడంతోపాటు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు, యువతి బంధువులు నిందితుడు కిరాయికి ఉన్న ఇంటికి వెళ్లి దాడి చేసేందుకు ప్రయత్నించారు. సదరు ఇంటి యజమాని కూడా 100కు డయల్ చేశారు. కేయూ పోలీసులు రంగ ప్రవేశం చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కేయూలో నిరసన చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

కేయూ ప్రధాన లైబ్రేరీ ఎదుట పీడీఎస్‌యూ నిరసన

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, విద్యాశాఖ మంత్రిని నియామించాలనిడిమాండ్ చేస్తూ శుక్రవారం కేయూ ప్రధాన లైబ్రరీ ఎదుట పీడీఎస్‌యూ నేతృత్వంలో నిరసన, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కంపాటి పృథ్వీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారావులు హాజరైమాట్లాడారు. ఏడాది గడుస్తున్నప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. కనీసం విద్యాశాఖ మంత్రిని నియమించకుండా విద్యకు గాలికి వదిలివేసిందన్నారు. గురుకులాల్లో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులను కేటాయించాల న్నారు. విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. యూజీసీ నూతన ముసాయి దాను రద్దు చేయాలని అన్నారు. లేకపోతే ఉద్య మిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కావ్యపి. అనూష, కన్వీనర్ బాలు, శ్రీజ, సాధన, గణేశ్‌చారి, వంశీ, వినయ్, పవన్ కల్యాణ్, గణి, యాదగిరి, హరి కృష్ణ, రాజశేఖర్, సాయి, నాగరాజు, వెంకటేశ్, రాకేశ్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2301	2100
పల్లికాయ (సూక)	6500	4600
పల్లికాయ (పచ్చిది)	4500	3100
కందులు	7206	5540
పెసళ్లు	7259	5645
పత్తి	6820	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13600	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	15500	11500
యూఎస్341	13650	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
దీపిక	17500	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

భక్త వనసంద్రం

చిన్నజాతరకు పోటెత్తుతున్న జనం

- మూడోరోజు 2లక్షల మందికిపైగా రాక
- సందడిగా మేడారం పరిసరాలు, వనదేవతల గద్దెలు
- నేడు ముగియనున్న మినీ సంబురం



భక్తులతో రద్దీగా గద్దెల ప్రాంగణం



తాడ్వాయి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మినీ జాతరతో మేడారం జనసంద్రమవుతోంది. ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం పూజారులు మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ పూజా మందిరాల్లో అంతర్గత పూజలను కొనసాగించారు. ఈ క్రమంలో తరలివచ్చిన లక్షలాది భక్తులు తల్లులను దర్శించుకున్నారు. శుక్రవారం సుమారు 2లక్షలకు పైగా తరలివచ్చిన భక్తజనంతో మేడారం పరిసరాలన్నీ సందడిగా మారాయి. ఈ మూడురోజుల్లో సుమారు 6లక్షల మంది అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు గద్దెలకు చేరుకొని ఎత్తు బంగారం(బెల్లం), చీర, సారె, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, యాట మొక్కులను చెల్లించుకుంటున్నారు.

భక్తులకు దొరకని ప్రసాదం

సుదూర ప్రాంతాల నుంచి మేడారం తరలివచ్చే భక్తులు మొక్కులు చెల్లించుకొని అమ్మవారి పసుపు కుంకుమ కొబ్బరిముక్క, వనదేవతలకు ప్రీతికరమైన బంగారాన్ని ప్రసాదంగా తీసుకుంటారు. అయితే చాలామంది భక్తులకు ప్రసాదం దొరకడం లేదని వెంటవెంటనే తొలగించి భక్తులకు దొరకకుండా చేస్తున్నారని భక్తులు అంటున్నారు. తమకు కొంచె ప్రసాదం ఇవ్వండి అని అడిగినా ఇవ్వడంలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని జాతరలుగా బెల్లం ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేయాలని అధికారులు పలు ప్రయత్నాలు చేసి విఫలమవుతున్నారు. మేడారంలో భక్తులకు వనదేవతల ప్రసాదం ఎప్పటికి అందిచగలుగుతారని వారు ప్రశ్నిస్తున్నారు.



నేటితో ముగియనున్న మినీ జాతర

సమ్మక్క సారలమ్మల మినీ జాతర శనివారంతో ముగియనుంది. ఈ సందర్భంగా పూజారులు తల్లులకు చేస్తున్న అంతర్గత పూజలను కూడా ముగించనున్నారు. చివరి రోజు శనివారం వారాంతం కావడంతో పెద్ద సంఖ్యలో వస్తారని, అలాగే ఆదివారం కూడా అధికంగా వస్తారని అంచనాలు వేసిన అధికారులు అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేశారు.

దేవస్థానానికి ఆర్థిక నష్టం

మేడారం మినీ జాతరలో దేవాదాయ శాఖకు ఆర్థిక నష్టం జరుగుతుందని పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు అంటున్నారు. మినీ జాతరలో కొబ్బరి, బెల్లం, జుట్టు(తలనీలాలు), కోళ్ల పలు వ్యాపారలపై ఎలాంటి ఆంక్షలు లేకుండా కోట్లలో వ్యాపారాలు జరుగుతున్నాయని ఒకరిద్దరి స్వార్థానికి దేవాదాయ శాఖకు ఆర్థిక నష్టం జరుగుతోందని అంటున్నారు. ప్రతీ వ్యాపారంపై రుసుం వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



జంపన్నవాగు వద్ద స్నానాలు ఆచరిస్తున్న భక్తజనం



వనదేవతలకు యాటమొక్కులు చెల్లిస్తున్న భక్తులు

గాడి తప్పిన పారిశుధ్య నిర్వహణ

మేడారం పరిసరాల్లో పారిశుధ్య పనులు గాడితప్పయని భక్తులు ఆరోపిస్తున్నారు. లక్షల మంది వస్తున్న సమయంలో పారిశుధ్య పనులు చురుగ్గా జరగక పోవడంతో ఎక్కడి వ్యర్థాలు అక్కడే దర్శనమిస్తున్నాయని మండిపడుతున్నారు. డీపీవో దేవరాజ్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు జరుగుతుండగా.. మూడురోజులలోనే అధికారులు అలసిపోయారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడే ఇలా చేస్తే జాతర తరువాత పరిస్థితేంటని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



మేడారం పరిసరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

పటిష్ఠ ఏర్పాట్లతో సందడిగా మినీ జాతరలు

- ములుగు కలెక్టర్ దివాకర
- మేడారంలో విలేకరుల సమావేశం

తాడ్వాయి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యంత్రాంగం చేసిన పటిష్ఠ ఏర్పాట్లతో ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం, కన్నాయిగూడెం మండలం ఐలాపూర్, ఏటూరునాగారం మండలం కొండాయి, మల్యాల గ్రామాల్లో జరుగుతున్న వనదేవతల మినీ జాతరలు సందడిగా జరుగుతున్నాయని కలెక్టర్ టీఎస్ దివాకర పేర్కొన్నారు. శుక్రవారం మేడారంలో సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించిన ఆయన అనంతరం ఐటీడీఏ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేడారం మినీ జాతర సందర్భంగా ఇప్పటి వరకు 5లక్షల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని, అలాగే ఇతర గ్రామాల్లో జరుగుతున్న మినీ జాతరల్లో కూడా 3లక్షల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారని తెలిపారు. శని, ఆదివారాల్లో మేడారానికి భక్తులు భారీసంఖ్యలో తరలి వస్తారని అంచనాలతో ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించామన్నారు. అలాగే 2026లో రానున్న మేడారం మహా జాతరకు కూడా ఇదే తరహాలో ఏర్పాట్లు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి ఎండీ రఫిక్, మేడారం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం, డీడబ్ల్యూవో శిరీష, ఐటీడీవో ఎస్‌వో రాజ్‌కుమార్, తహసిల్దార్‌లు జగదీశ్వర్, రవీందర్, సృజన్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లడుతున్న కలెక్టర్ దివాకర

ప్రేమగా.. గమ్మత్తుగా..

ఐదుగురు బావమరుదులకు ఒకేసారి కల్లు తాపించిన బావ



పీవీసీ పైప్ సాయంతో ఒకేసారి కల్లు తాగుతున్న బావ (మధ్యలో వ్యక్తి), బావమరుదులు

గ్రామీణప్రాంతాల్లో బావ, బావమరుదుల మధ్య సరదా సంభాషణలు.. సరదా సవాళ్లు సాధారణంగానే జరుగుతుంటాయి. అలా కేసముద్రం మండలం ఉప్పరపల్లికి చెందిన ఎలబోయిన సారయ్యకు అదే గ్రామానికి చెందిన ఆయనకు బావమరుదుల వరుసైన బోనగిరి రమేష్, వీరయ్య, చాగంటి వెంకటేశ్వర్లు, గాదె యాకస్వామి, అంకిరెడ్డి రాంబాబులతో శుక్రవారం ఉదయం ఓ సరదా సంభాషణ జరిగింది. ఆసమయం లోనే సారయ్య... వారికి ఒకేసారి కల్లుతాపిస్తానని అనడంతో.. వారు కూడా చాలెంజ్ విసిరారు. దాంతో సారయ్య ఇదిగో ఇలా.. ఓ పీవీసీ పైపు రంధ్రాలు చేసి.. గ్రామ సమీపంలోని గణపురం తాటివనం వద్ద బావమరుదుల మధ్య కూర్చుని కల్లు తాగారు. దీంతో బావ ఐడియా భళా అంటూ బావమరుదులు ప్రశంసించారు. సోషల్‌మీడియాలో వైరల్ అయిన ఈ దృశ్యాలు చూసిన వారు 'బావ ప్రేమగా.. గమ్మత్తుగా' ఐడియా వేశాడు అంటూ ఆసక్తిగా చూశారు.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి



రాకాసి గాలులు.. మిగిలిన మోడులు..

పచ్చని వనంలో రాకాసి గాలుల విధ్వంసానికి నిదర్శనమీ చిత్రం. గతేడాది ఆగస్టు 31న వచ్చిన భారీ సుడిగాలులకు ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అటవీ ప్రాంతంలో లక్షల సంఖ్యలో భారీ వృక్షాలు కూకటి వేళ్లతో సహా నేలకొరిగిన విషయం తెలిసిందే. అయితే ప్రకృతి విధ్వంసానికి గురైన ఆ అటవీప్రాంతంలో తీసిన ఈ డ్రోన్ చిత్రంతో... ఇదిగో ఇలా ఓ వైపు పచ్చగా.. మరోవైపు నేలమట్టమైన లక్షలాది చెట్లతో కళావిహీనంగా కనిపిస్తోంది.

ఫొటో: 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫోటోగ్రాఫర్, హనుమకొండ.

బాధితుల ప్రాణాలు.. మీ చేతుల్లో!

- గోల్డెన్ అవర్ గురించి తెలుసుకోండి..
- 'గుడ్ సమరిటన్' అందుకోండి..
- రోడ్డు ప్రమాద సమాచారం అందిస్తే ప్రోత్సాహకం
- గంటలోపు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కాపాడగలిగితే రూ.5వేలు
- కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంపై అవగాహన కరువు



వర్ధన్నపేట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిని వ్యక్తి కోసం అంబులెన్సుకు ఫోన్ చేస్తున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్(ఫైల్)



రోడ్డు ప్రమాదంలో గాయపడి వారిని అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గోల్డెన్ అవర్.. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులను గంటలోపు ఆస్పత్రికి తరలిస్తే వారిని ప్రాణాపాయం నుంచి కాపాడే కీలక సమయం. సహజంగా ఏదైనా రోడ్డుప్రమాదం జరిగినప్పుడు అందరూ ఆందోళనకు గురవుతారు. పోలీసులకు, అంబులెన్సులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్న ఆలోచన కూడా వచ్చే పరిస్థితి ఉండదు. కానీ ఆ పరిస్థితిని అధిగమించి.. కాస్తంత ధైర్యం చేసి.. గోల్డెన్ అవర్‌ను వినియోగించుకుంటే క్షతగాత్రులను ప్రాణాలను కాపాడిన వారవుతారు. అలా స్పందించే గుణాన్ని అలవాటు చేసేందుకు కేంద్రం ప్రభుత్వం ఓ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. గుడ్ సమరిటన్ పేరిట ఆపద సమయంలో స్పందించిన వారిని ప్రోత్సహించేందుకు ప్రశంసా ప్రతంతో పాటు రూ.5వేల నగదు ప్రోత్సాహం అందిస్తోంది. అయితే ఈ కార్యక్రమం గురించి సరైన అవగాహన లేదు. దాంతో ప్రమాదాల బారిన పడి తీవ్రగాయాలైన వారిని సకాలంలో ఆసుపత్రులకు చేర్చలేకపోతుండటంతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఆవశ్యకతను తెలియజేయాల్సి బాధ్యత అధికారుల పై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చట్టం ఉద్దేశం...

వాహన ప్రమాదాల్లో రహదారులపై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. దాదాపు 50 శాతం రోడ్డు ప్రమాదాల్లో సకాలంలో వైద్యం అందకనే చనిపోతున్నట్లు జాతీయ స్థాయిలో అధికారులు చేసిన ఓ సర్వేలో వెల్లడైంది. ప్రమాదం జరిగిన తొలి గంటలోనే వైద్యం అందిస్తే ప్రాణాలు నిలపవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. కానీ పోలీసులు, కేసులు లాంటి అపోహలతో చాలా మంది చూసీచూడనట్లుగా వెళ్లిపోతున్నారని, పైగా రోడ్డు ప్రమాదాల తీరును, క్షతగాత్రులను ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నది వెల్లడైంది. ఇక ఈ గుడ్ సమరిటన్ చట్టం రోడ్డు ప్రమాద బాధితులను కాపాడటానికి, సహాయం చేసే వ్యక్తులకు రక్షణగా ఉంటుంది. సహాయానికి వచ్చిన వారిపై ఎలాంటి పోలీస్, న్యాయపరమైన చర్యలు ఉండవు. వారికి పోలీసులు, చట్టం రక్షణగా నిలుస్తుంది. సహాయం చేసిన వ్యక్తి సమాచారం, పూర్తి వివరాలు వెల్లడించే విషయంలో అధికారుల బలవంతమేమీ ఉండదు. రోడ్డు ప్రమాద బాధితులను గంటలోపు ఆస్పత్రికి తీసుకెళ్లి కాపాడితే రూ.5వేల నగదును ప్రోత్సాహకంగా అందిస్తారు. దేశ వ్యాప్తంగా పది ఉత్తమ గుడ్ సమరిటన్లకు రూ.లక్ష, సర్టిఫికెట్, ట్రోఫీ అందజేస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి...

క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తే రూ.5వేల గుడ్ సమరిటన్ ప్రోత్సాహం అందుతుంది. ఈ ప్రోత్సాహం పొందాలంటే గంటలోపు బాధితుడిని ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారమివ్వాలి. దీంతో పోలీసులు గుర్తించి వారిని ప్రాణదాత (గుడ్ సమరిటన్) అంటూ ప్రమాద వివరాలతో కూడిన సర్టిఫికెట్‌ను అందిస్తారు. పోలీసులు జిల్లా కమిటీ ఈ రివార్డు సొమ్ము ఇవ్వాలని రోడ్డు రవాణా శాఖ అధికారులకు పంపిస్తారు. ఇది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి నగదు గుడ్ సమరిటన్ బ్యాంకు ఖాతాలో జమవుతుంది. ప్రశంసా పత్రం సైతం ఇస్తారు. ఒక వ్యక్తి గరిష్ఠంగా ఏడాదిలో ఐదుసార్లు ఈ అవార్డును పొందవచ్చు. కాపాడిన వ్యక్తి తన వ్యక్తిగత వివరాలేవీ చెపాల్సిన అవసరం, డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఆస్పత్రిలో చేర్పించి వెళ్లిపోవచ్చు. అయితే జాతీయ, రాష్ట్ర రహదారులపై జరిగిన ప్రమాద బాధితులను చేర్పిస్తే ఈ పథకం వర్తిస్తుంది.

పోలీసుల నుంచి ఎలాంటి వేధింపులు ఉండవు



రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు బాధితులను గంటలోపు ఆస్పత్రికి తరలించి గుడ్ సమరిటన్‌గా పేరు తెచ్చుకోవాలి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం గుడ్ సమరిటన్‌గా నిలిచిన వారికి రూ.5వేల ప్రోత్సాహం అందేలా చూస్తాం. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు వారికి ఎలాంటి వేధింపులు ఉండవు. ప్రాణాలు కాపాడడం సాటి పౌరుడిగా మన బాధ్యత అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రికి తరలించడం లేదా పోలీసులకు, అంబులెన్సుకు సమాచారం అందించి అండగా నిలవాలి.

- శ్రీనివాసరావు, సీఐ వర్ధన్నపేట

అవగాహన లేకే గాల్లో కలుస్తున్న ప్రాణాలు...

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఒక పౌరుడిగా సహాయం చేయాలనే అవగాహన లేకపోవడంతో క్షతగాత్రుల ప్రాణాలు ఆస్పత్రికి పోయే లోపే గాల్లో కలుస్తున్నాయి. సమాచారం పేరిట పోలీసుల వేధింపులు, కోర్టు కేసులు, సాక్షులుగా పెట్టి పంపిస్తారనే అపనమ్మకంతో కనీసం అంబులెన్స్‌కు సైతం సమాచారమిచ్చేందుకు సగటు వ్యక్తి వెనకాడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం గుడ్ సమరిటన్ అనే విధానాన్ని తీసుకువచ్చింది. కానీ, దీనిపై కూడా అవగాహన లేకపోవడంతో ప్రమాదాలను చిత్రీకరించడానికే తప్ప, సహాయం చేయాలనే ఆలోచన రావడంలేదు. దీంతో ఇటు పోలీసులు, అటు రోడ్డు రవాణా శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలతో పాటు కొన్ని పట్టణాలు, నగరాల్లోని ప్రజలకు గుడ్ సమరిటన్ అంటే ఏంటో తెలియకుండా పోయింది. నేషనల్ హైవే అధికారులు కూడా ముందుకు వచ్చి జాతీయ రహదారిపై ఏర్పాటు చేసే సూచిక బోర్డులతో పాటు గుడ్ సమరిటన్ కర్తవ్యం గురించి వివరిస్తూ బోర్డులు పెట్టాలని పౌరులు కోరుతున్నారు.

నేడు ఇంజనీరింగ్ విద్యార్థులకు సదస్సు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల నేతృత్వంలో కేయూ సెనెట్ హాల్‌లో శనివారం ఉదయం 10గంటలకు వీడియో ఎస్ కోడింగ్ యూజింగ్ ఎంఎల్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు తెలిపారు. ఈ సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ టీకేఎస్ శ్రీనివాస్‌లు హాజరై మాట్లాడుతారని తెలిపారు.

19న జరిగే బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల వాయిదా

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19న జరగాల్సిన బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షను కానిస్టేబుల్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాతో పాటు ఇతర పోటీ పరీక్షల దృష్ట్యా వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ శుక్రవారం వెల్లడించారు. విద్యార్థులు గమనించాలని కోరారు. ఇతర వివరాలకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

వీధిలైట్లు కట్టేశారు..

» ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన బల్దియా అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. విద్యుత్ సిబ్బంది హుటాహుటిన హనుమాన్‌నగర్‌కు చేరుకుని 24/7 వెలుగుతున్న వీధిలైట్లను కట్టేశారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'వారం రోజులుగా వెలుగుతున్న వీధిలైట్లు' అనే వార్తకు సిబ్బంది స్పందించి వీధిలైట్లను నిలిపివేశారు.నగరంలోని 54వ డివిజన్ హనుమాన్‌నగర్ ఫేజ్-4 మెయిన్ లైన్‌తో పాటు చుట్టుపక్కల నాలుగు కాలనీల్లో వారంరోజులుగా సుమారు 50 వీధిలైట్లు మూడు పూటలా వెలుగుతున్నట్టు కథనం ప్రచురితమైంది. దీంతోబల్దియా అధికారుల ఆదేశాల మేరకు ఇద్దరు లైన్‌మెన్లు, ఇద్దరు హెల్పర్లు కాలనీకి చేరుకుని వీధిలైట్లకు కరెంటు సప్లయ్‌ని తొలగించారు.


హనుమాన్‌నగర్‌లో వీధిలైట్లను నిలిపివేసిన సిబ్బంది

21న వర్సిటీలో లైబ్రరీ సైన్స్ జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21న శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ, లైబ్రరీ సైన్స్ విభాగం నేతృత్వంలో జాతీయసదస్సు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ మెంబర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ సీజే శ్రీలత, కన్వీనర్ డాక్టర్ బి.రాధికారాణి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కేయూ వీసీ చాంబర్‌లో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరు రామచంద్రంలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రాధికారాణి, సీజే శ్రీలత, లైబ్రరీ అసిస్టెంట్ ఐజాక్ ప్రభాకర్, జావీద్, రవీందర్ పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ


ఈఎస్ఐ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు, నాయకులు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఖాదీ పరిశ్రమల మాజీ డైరెక్టర్, అఖిల భారత పద్మశాలి సంఘం మాజీ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం జన్మదినం సందర్భంగా వరంగల్ నగరంలోని వివిధ ప్రాంతాలలో కేక్ కటింగ్, పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం 18వ, డివిజన్ క్రిస్టియన్ కాలనీలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో మంజు చారిటబుల్ ట్రస్ట్ వరంగల్ చైర్మన్ పోతన వెంకటేశ్వర్లు కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్లు, సిబ్బంది, రోగులకు స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాస్కుల హరినారాయణ, గోపి, రాజేశ్వర్, మహేందర్, సమ్మయ్య, పాషా, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే 38వ, డివిజన్ ఖిలావరంగల్ మధ్యకోటలో మహిళా గ్రూపు అధ్యక్షురాలు గూడూరు పద్మ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా గ్రూపు సభ్యులు మెట్టు పద్మ, జి. రత్నకుమారి, భవాని, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ హాస్టల్ డైరెక్టర్లుగా నరేందర్, సుజాత నియామకం

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ అడిషనల్ హాస్టల్స్ డైరెక్టర్లుగా కేయూ ఫిజిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.నరేందర్, మైక్రోబయోలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇ.సుజాతలను నియామిస్తూ శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు విడుదల చేశారు. వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకాలు చేపట్టారు. శుక్రవారం వీసీ ప్రతాప్‌రెడ్డి తన చాంబర్‌లో రిజిస్ట్రార్ రామచంద్రం, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లతో కలిసి నియామక ఉత్తర్వులను నరేందర్, సుజాతలకు అందచేసి అభినందనలు తెలిపారు. వీరు ఏడాదికాలం పాటు అడిషనల్ హాస్టల్స్ డైరెక్టర్లుగా కొనసాగుతారు. నూతనంగానియమితులైన నరేందర్, సుజాతను పలువురు ప్రొఫెసర్లు, స్కాలర్లు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

సేవాలాల్ జయంతిని జరుపుకోవాలి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రతీ తండాలో జరుపుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాంకుడోత్ వీరన్ననాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ - జవహర్ కాలనీ జంక్షన్‌లో సేవాలాల్ మహారాజ్ జయంతిని ముందస్తుగా నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వీరన్ననాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని శనివారం ఉదయం 9 గంటలకు హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి అశోక కాలనీలోని గిరిజన భవన్ వరకు సద్భావన ర్యాలీ ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని బంజారాలు, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా నాయకులు జగన్, రమేష్, వెంకన్న, స్వరూప, రజిత, లాలూ నాయక్ పాల్గొన్నారు.

పుల్వామా అమరులకు శ్రద్ధాంజలి


కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటిస్తున్న రిటైర్డ్ ఆర్మీ జవానుల కుటుంబసభ్యులు

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కశ్మీర్‌లోని పూల్వామా ఉగ్రదాడిలో వీరమరణం పొందిన అమరజవానులకు రిటైర్డ్ ఆర్మీ జవానుల కుటుంబసభ్యులు శుక్రవారం శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రదాడిలో 40 మంది జవానులు వీరమరణం పొంది ఆరేళ్ల అయిన సందర్భంగా మాజీ కేంద్ర సాయుధ పోలీసు బలగాల సిబ్బంది సంక్షేమ సంఘం వరంగల్ అధ్యక్షుడు సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించారు.

- వడ్డెపల్లి: జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో 2019, ఫిబ్రవరి 14న పాకిస్థాన్ ఆత్మాహుతి దళం జరిపిన దాడిలో అమర వీరులైన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నివాళులర్పిం చారు. కళాశాల ప్రిన్సిపాల్, లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళిగౌడ్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు శాంతి ర్యాలీని నిర్వహించి జవాన్ల త్యాగనిరతిని మరిచిపోమంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆఫీసర్ డాక్టర్ సువర్ణ, కళాశాల ఎన్‌సీసీ కంపెనీ సీనియర్ అండర్ ఆఫీసర్ దివ్యశ్రీ, ఎన్‌సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మ్యూజికల్ గార్డెన్‌కు పునరుజ్జీవనం

- రూ.3.50 కోట్లతో పునరుద్ధరణ పనులు
- 40 అడుగుల ఎత్తైన లేజర్ ఫౌంటేన్లు
- ఖరీదైన ఆటవస్తువులతో చిల్డ్రన్స్ జోన్
- పార్టీ కార్నర్, లోటస్ పాండ్, డక్ పాండ్ ఏర్పాటు
- భద్రకాళి చెరువు మట్టితో ల్యాండ్ స్కేపింగ్
- భద్రకాళి మాఢవీధులను కలుపుతూ గార్డెన్‌కు రోడ్డు
- గార్డెన్ నుంచి చెరువు వరకు బండ్ విస్తరణ


కొత్తగా ఏర్పాటు చేస్తున్న గార్డెన్ ప్రధాన ద్వారం

హనుమకొండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పూర్వవైభవం సంతరించుకోబోతున్నది. గతంలో నగర ప్రజలనే కాకుండా యావత్ ఉమ్మడి జిల్లాప్రజలను ఆకట్టుకున్న మ్యూజికల్ గార్డెన్ ఆలనాపాలనా లేక చెత్తకుప్పగా మారింది. దీంతో సందర్శకుల రాక తగ్గింది. నాలుగేళ్లుగా మ్యూజికల్ గార్డెన్ మూతపడింది. దీనిని తిరిగి పునరుద్ధరించాలని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవలే పనులు మొదలయ్యాయి. సుమారు రూ.3 నుంచి రూ.3.50కోట్ల అంచనా వ్యయంతో మ్యూజికల్ గార్డెన్‌లో వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నారు. మొత్తం 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కు.. పూర్తిస్థాయిలో పునరుద్ధరణ జరిగితే నగరానికే తలమానికంగా తిరిగి నిలవనున్నది. నాలుగేళ్ల కిందట మూతపడిన ఈ పార్కు పూర్వ కళతో తిరిగి తెరుచుకోబోతున్నది.

40 అడుగుల లేజర్ ఫౌంటేన్లు

మ్యూజికల్ గార్డెన్‌కు ప్రధాన ఆకర్షణ లేజర్ ఫౌంటేన్లు. సాయంత్రం వేళ రంగు రంగుల విద్యుద్దీపాల వెలుగుల్లో ఫౌంటేన్ నుంచి ఎగజిమ్మే నీరు మ్యూజిక్‌ను అనుగుణంగా డ్యాన్స్ చేయడం వీటి ప్రత్యేకత. ఇది చూడడానికి నగరప్రజలు పెద్దసంఖ్యలో గార్డెన్‌కు తరలివచ్చేవారు. గతంలో ఫౌంటేన్ల నిర్వహణ సరిగా లేక, తరుచూ సాంకేతిక లోపాలు తలెత్తడంతో ఈ మ్యూజికల్ ఫౌంటేన్ల పరిస్తితి మూన్నాళ్ల ముచ్చటగా మారిపోయింది. ఫౌంటేన్లు మూలపడడంతో గార్డెన్ తన ప్రత్యేకతను కోల్పోయింది. దీంతో సందర్శకులు రావడం తగ్గింది. తిరిగి అదే స్థానంలో కొత్త మ్యూజికల్ ఫౌంటేన్లను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గతంలోకన్నా ఈసారి 40 అడుగుల ఎత్తైన అత్యాధునికమైన రెండు మ్యూజికల్ లేజర్ ఫౌంటేన్లను తిరిగి అమర్చనున్నారు. ఈ మేరకు ఫౌంటేన్ల వాటర్ పూల్ పనులు చురుకుగా జరుగుతున్నాయి. లేజర్ కాంతుల వెలుగుల్లో ఈ ఫౌంటేన్ నీటి విన్యాసాలు చూడడానికి రెండు కళ్లు చాలవు. దీనితో పాటు గార్డెన్ అంతటా రంగు రంగుల విద్యుద్దీపాలను అమర్చుతున్నారు.


చురుకుగా సాగుతున్న లేజర్ ఫౌంటేన్ పనులు

కృత్రిమ జలపాతం

మ్యూజికల్ గార్డెన్‌లో మరొక ఆకర్షణ కృత్రిమ జలపాతం. గతంలో గార్డెన్‌లోని గుట్టపై నుంచి మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేసి సృష్టించిన కృత్రిమ జలపాతం ఎంతో కనుల విందుగా కనిపించేది. దీనిపై ప్రసరించే రంగు రంగుల లేజర్ కిరణాలు అద్భుతంగా గోచరించేవి. ఈ కృత్రిమ జలపాతాన్ని కూడా పునరుద్ధరిస్తున్నారు. దీనికి దగ్గరలోనే ఉన్న చిన్న నీటి కుంటలో బోటింగ్ సౌకర్యం ఉండేది. గార్డెన్‌ను సందర్శించేందుకు వచ్చిన వారు తమ పిల్లలను ఈ బోట్లలో తిప్పేవారు. దీనిని నిర్వహణ కష్టంగా ఉండడంతో ప్రస్తుతం ఈ నీటి కుంటనే లోటస్ పాండ్‌గా మార్చుతున్నారు. దీనితోపాటుడక్‌పాండ్‌ను కూడా రూపొందించనున్నారు.

గార్డెన్ నేపథ్యం

ఓరుగల్లు ప్రజలకు ఆహ్లాదం పంచడంతో పాటు పర్యాటకులను ఆకర్షించే ఉద్దేశంతో 1995లో 18 ఎకరాల విస్తీర్ణంలో కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. శాలినీమిశ్రా కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఒక పక్కచెరువు, మరో పక్క గుట్టలు, ఇంకో పక్క భద్రకాళి గుడి చుట్టూ దట్టమైన చెట్లతో ప్రకృతి రమణీయంగా ఉన్న ఈ ప్రాంతాన్ని చూసి ఆశ్చర్యపోయారు. అన్ని హంగులతో కూడిన పార్కును ఏర్పాటు చేయాలన్న ఆమె ఆలోచన నుంచి ఈ మ్యూజికల్ గార్డెన్ ఆవిష్కృతమైంది. అప్పట్లో కుడా జేఈగా ఉన్న భీమ్‌రావు స్వీయ పర్యవేక్షణలో పార్కు రూపుదిద్దుకున్నది. అప్పట్లో ఈ గార్డెన్ నగరానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చాలాకాలం పాటు గార్డెన్‌ను బాగానే నిర్వహించారు. తర్వాత కాలంలో నిర్లక్ష్యానికి గురై శిధిలావస్థకు చేరుకున్నది. దీనిని రూ.15కోట్లతో తిరిగి అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2017 నవంబర్ 18న అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా గార్డెన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కూడా జరిగింది. ఆ తర్వాత అభివృద్ధి పనులు నత్తనడకన సాగాయి. అనంతరం 2020లో కరోనా లాక్‌డౌన్‌తో పార్క్ పూర్తిగా మూతపడింది.

చిల్డ్రన్స్ జోన్

మ్యూజికల్ గార్డెన్‌లో చిల్డ్రెన్స్ జోన్ మరో ఆకర్షణగా ఉండబోతోంది. గతంలో కూడా గార్డెన్‌లో పిల్లల పార్క్ ఉండేది. అయితే అప్పటికన్నా ఇప్పుడు దీనిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో పిల్లలను విశేషంగా ఆకట్టుకునే అత్యంత ఖరీదైన ఆట వస్తువులను అందుబాటులో ఉంచుతున్నారు. పేరున్న కంపెనీల నుంచి బ్రాండెడ్ పరికరాలను ఇందులో అమర్చుతున్నారు. ఈ చిల్డ్రన్స్ జోన్‌లోని ఆట వస్తువులకు రక్షణగా దానిని చుట్టూ ప్రత్యేకమైన ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ఇతర ఏ పార్కుల్లో లేనటువంటి ఆట వస్తువులు ఇందులో పిల్లల కోసం ఏర్పాటు చేస్తారు. లోపల విశ్రాంతిగా కూర్చొనేందుకు కుర్చీలు, బెంచీలను ఏర్పాటు చేస్తారు.

పార్టీ కార్నర్

పుట్టిన రోజు వేడుకల వంటి చిన్నచిన్న పార్టీలు చేసుకునేందుకు వీలుగా మ్యూజికల్ గార్డెన్‌లో పార్టీ కార్నర్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నారు. లోటస్ పాండ్ పక్కనే దీనిని ఏర్పాటు చేస్తారు. కుటుంబ సభ్యులు నిర్ణీత రుసుము చెల్లించి ఈ పార్టీ కార్నర్‌లో చిన్నపాటి విందుల, వినోదాలు జరుపుకోవచ్చు. రంగు రంగుల విద్యుద్దీపాల వెలుగుల మధ్య ఈపార్టీ కార్నర్‌లో జరుపుకునే వేడుకలు కుటుంబ సభ్యులకు మధురానుభూతులను విగుల్చుతాయి.


మ్యూజికల్ గార్డెన్‌లో రూపుదిద్దుకుంటున్న చిల్డ్రన్స్ పార్క్

ఆకట్టుకునే గ్రీనరీ

మ్యూజికల్ గార్డెన్‌లో ఆకట్టుకునే రీతిలో గ్రీనరీని అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే గార్డెన్‌లో ముందు భాగం గ్రీనరీని పూర్తి చేశారు. వెనుక భాగం ల్యాండ్ స్కేపింగ్ జరుగుతున్నది. ప్రస్తుతం పూడికతీత కోసం భద్రకాళి చెరువు నీటిని ఖాళీ చేయడం వల్ల చాలినంత మట్టి అందుబాటులోకి రావడం కలిసొచ్చింది. ఈ మట్టినే గార్డెన్‌ను అభివృద్ధికి ఉపయోగిస్తున్నారు. లోతట్టుగా ఉన్న ప్రాంతాలను మట్టితో నింపి చదును చేస్తున్నారు. గ్రీనరీ, ల్యాండ్ స్కేపింగ్‌కు ఈ మట్టినే వాడుతున్నారు. గార్డెన్‌లోని నేల ఎత్తును పెంచుతున్నారు. సందర్శకులు లేజర్ మ్యూజికల్ ఫౌంటేన్ల విన్యాసాలను తిలకించేందుకు వీలుగా గతంలో సుమారు 300 కుర్చీలు ఉండేవి. ఇప్పుడు ఇందుకు భిన్నంగా ఇదే చోటును చిన్నపాటి స్టేడియంలా అభివృద్ధి చేస్తున్నారు. కింద నాపరాళ్లు పరుస్తారు. ఇక్కడి నుంచి ఫౌంటేన్లను తిలకించవచ్చు.

మాఢవీధుల వరకు రోడ్డు

భద్రకాళి గుడికి సమీపంలోనే ఈ మ్యూజికల్ గార్డెన్ ఉంటుంది. గుడికి వచ్చిన భక్తులు, పర్యాటకులు మ్యూజికల్ గార్డెన్‌ను కూడా సందర్శించేందుకు వీలుగా ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న మాడవీధులతో గార్డెన్‌ను కలుపుతూ రోడ్డు నిర్మించనున్నారు. ఈ రెండింటి మధ్య ఉన్న గుట్ట వద్ద క్వారీ జరగడం వల్ల ఈ ప్రాంతంలో కొంత లోతు ఏర్పడింది. మట్టితో దీనిని పూడ్చి బాట వేయడానికి బండ్‌ను విస్తరించనున్నారు. దీని వల్ల మ్యూజికల్ గార్డెన్‌ను సందర్శించే వారి సంఖ్య పెరిగి తద్వారా గార్డెన్‌కు ఆదాయం సమకూరనున్నది. గతంలో లేని మరికొన్ని ప్రత్యేకతలు, విశేషాలతో గార్డెన్‌ను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

మ్యూజికల్ గార్డెన్‌కు సరికొత్తరూపు

భీమ్‌రావు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ

మ్యూజికల్ గార్డెన్‌కు పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం పునరుద్ధరణ పనులు చురుకుగా జరుగుతున్నాయి. గతంలో కన్నా ఈసారి అత్యాధునికమైన 40 అడుగుల ఎత్తైన లేజర్ లేజర్ ఫౌంటేన్లను ఏర్పాటు చేస్తున్నాం. గార్డెన్‌లో రూ.3నుంచి రూ.3.50కోట్ల వ్యయంతో ఇది వరకు లేని కొత్త హంగులను కల్పిస్తున్నాం. 1995లో కుడా జేఈగా ఉన్నప్పుడు ఈ గార్డెన్‌కు రూపకల్పన చేసింది నేనే. కొవిడ్ తర్వాత మూతపడిన దీనిని తిరిగి పునరుద్ధరిస్తున్నాం. పనులు పూర్తయి గార్డెన్ త్వరలోనే నగర ప్రజలకు తిరిగి అందుబాటులో రానున్నది. భద్రకాళి మాఢవీధులను నుంచి గార్డెన్ వరకు రోడ్డు వేసే ఆలోచన ఉంది.

క్రీడలతో మానసిక ఉల్లాసం

» మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్
» మూడు రోజుల పాటు కొనసాగిన క్రికెట్ టోర్నమెంట్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో స్నేహపూర్వకంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో పాల్గొన్న మీడియా టీమ్ గెలుపొందింది. హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని విజయవంతం చేసిన క్రీడాకారులను, బీఆర్ఎస్ పార్టీ నాయకులను ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.


క్రీడల్లో గెలుపొందిన మీడియా జట్టుకు బహుమతి అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

బాలసముద్రం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండలోని కాళోజీ విగ్రహం ఎదుట కార్యక్రమ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 7వ గ్యారంటీగా ప్రజాపాలన అందిస్తామని వాగ్దానం చేసి ప్రశ్నించే గొంతుకలను, మేధావులు, విప్లవ సంస్థల నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తుందని పలువురు న్యూ డెమోక్రసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకుడు గంగుల దయాకర్, ఇనుముల కృష్ణ, మన్నె కరుణాకర్, పీడీఎస్‌యూ నాయకులు మర్రి మహేష్, ఉడుత గణేష్, పవన్, సుమన్, శ్రీనివాస్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు కాంట్రాక్టు అధ్యాపకుల పునర్నియామకం

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ముగ్గురు కాంట్రాక్టు అధ్యాపకులు గతంలో రిటైర్డుమెంట్ పొందగా, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పెంచిన వయస్సును పరిగణలోకి తీసుకుని శుక్రవారం పునర్నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. కెమిస్ట్రీ విభాగంలో ఉషారాణి, జర్నలిజం విభాగంలో ఆదిరెడ్డి, బాటనీలో లక్ష్మారెడ్డిలు 2024 ఆగస్టు తర్వాత ఉద్యోగ విరమణ పొందారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ, కాలేజియేట్ కమిషనర్ ఇటీవల ఇచ్చిన ఉత్తర్వుల మేరకు వీరిని పునర్నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేయగా విధుల్లో చేరారు. వీరి నియామకంపై తెలంగాణ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ శ్రీధర్‌కుమార్‌లోథ్, ఇతరులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ సదస్సు దృశ్యమాలిక ఆవిష్కరణ


సదస్సు దృశ్యమాలికను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, మనోహర్ తదితరులు

కేయూక్యాంపస్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ, టూరిజం మేనేజ్‌మెంట్ నేతృత్వంలో ఇటీవల కేయూలో నిర్వహించిన 82వ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, 49వ ఎపిగ్రాఫికల్ సొసైటీ సదస్సు దృశ్యమాలికను శుక్రవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. సమష్టితత్వం, సమన్వయంతోనే జాతీయ సదస్సుల నిర్వహణ సామర్థ్యవంతంగా జరుగుతాయని చెప్పారు. సదస్సులు మంచిగా నిర్వహించే వనరులు, వర్సిటీకి ఉన్నాయని గుర్తు చేశారు. మంచి సదస్సులతో వర్సిటీ ప్రతిష్ఠ పెరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో హిస్టరీ విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, డాక్టర్ ఎం.కృష్ణసుమంత్, డాక్టర్ కె.నాగేశ్వర్‌రావు, డాక్టర్ కేవీఎస్ నరేందర్, డాక్టర్ బి.శ్రీధర్, డాక్టర్ ఎ.కుమార్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెడితే సహించేది లేదు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై స్పందిస్తున్న జర్నలిస్టులను అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించడంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం కొడంగల్‌లో వార్త కవరేజ్ కోసం వెళ్లిన ఓ యూట్యూబ్ చానల్ జర్నలిస్టును అక్కడి పోలీసులు అడ్డుకొని కేసులు నమోదు చేసి అరెస్టు చేయడాన్ని దయాకర్‌రావు తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులు కొనసాగితే సహించేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నేడు కేయూలో సంత్ సేవాలాల్ జయంతి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియం గ్రౌండ్‌లో 15న శనివారం ఉదయం 10 గంటలకు శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ జయంతి మహా బోగ్ భండరో నిర్వహిస్తున్నట్లు కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ రాజమణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, కీలక వక్తగా మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్, గౌరవ అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరు రామచంద్రంలు పాల్గొని మాట్లాడుతారని ఆమె తెలిపారు. అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎంజేపీలో ఆరుగురు విద్యార్థుల అస్వస్థత


వైద్య చికిత్స అందిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

హసన్‌పర్తి/ఎంజీఎం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జయగిరి మహాత్మాజ్యోతిబా పూలే పాఠశాలలో శుక్రవారం రాత్రి ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. సాయంత్రం భోజనం తిన్న తరువాత విద్యార్థులంతా గురుకుల ఆవరణలో ఉన్న బాదం చెట్టు పచ్చి బాదం పప్పు తిన్నట్లు తెలిపారు. బాదం పప్పు తిన్న 5వ తరగతికి చెందిన చందు, హరికృష్ణ, సచిన్, సుషాంత్, రిషిత్‌కుమార్, సామ్యూల్ భార్గవ్ అనే ఆరుగురు విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్ హుటాహుటిన అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. అప్రమత్తమైన డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య విద్యార్థుల పరిస్థితిని గమనించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రస్తుతం ఆరుగురు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు డీఎంహెచ్‌వో వెల్లడించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్‌ను ఫోన్‌లో వివరణ కోరగా జరిగిన విషయంపై కలెక్టర్‌కు, డీఎంహెచ్‌వోకు సమాచారం అందించామని, ప్రస్తుతం ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపారు.

ఇంటర్‌నెట్‌ను మంచి కోసం వినియోగించుకోవాలి

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్‌నెట్‌ను మంచి పనుల కోసం వినియోగించుకోవాలని షీటీం ఇన్‌స్పెక్టర్ సుజాత సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని కాకతీయ మహిళా డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై షీటీం పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుజాత మాట్లాడుతూ.. సైబర్ మోసాలపై 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఆడపిల్లలు, మహిళలు వేధింపులకు గురైతే వరంగల్ షీటీం నెంబర్ 8712685142, డయల్ 100 కు సమాచారం ఇవ్వాలన్నారు. లోన్ యాప్‌లకు దూరంగా ఉండి, సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైన పాస్‌వర్డ్‌లను పెట్టుకోవాలన్నారు.

ఇంటర్ విద్యాశాఖ అధికారిని విధుల నుంచి తప్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మంద శ్రీకాంత్ తదితరులు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ)ను వెంటనే విధుల నుంచి తప్పించాలని ఎస్ఎఫ్ఐ జనరల్ సెక్రటరీ మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్య సంస్థలకు డీఐఈఓ కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూల్ చూస్తున్నాయని ఆరోపించారు. ఒక్కో కళాశాలకు అనుమతి పొంది ఐదారు కళాశాల బ్రాంచ్‌లను నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. కళాశాల అక్రమల దందాపై డీఐఈఓ ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అనేకకళాశాలలు సీబీఎస్ఈ పర్మిషన్ పొందినట్లు బోర్డులు పెట్టుకున్నాయని అన్నారు. ఆయా కళాశాలపై తమ సంఘం తరుపున డీఐఈఓకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించాలని, ఆయా కళాశాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హనుమకొండ డీఐఈఓను విధుల నుంచి తొలగించి చర్యలు చేపట్టాలని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆయా కళాశాలలకు కొమ్ము కాస్తున్న డీఐఈఓకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బీరెడ్డి జశ్వంత్, సాయికుమార్, మల్లేశ్, అజయ్, పవన్, నాగరాజు, సాయి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

డిఫాల్టర్లకు కోట్లు ఇస్తున్నారు..
రైతులకు రుణాలివ్వరా?

- అన్నదాతలు సకాలంలో చెల్లించకపోతే ప్రహరీ గేట్లు ఊడదీసుకొని పోతారా?
- ఇదెక్కడి విధానం?: మంత్రి తుమ్మల
- రైతులకు నాబార్డ్ విరివిగా రుణాలు ఇవ్వాలి: భట్టి




హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. అప్పులు చెల్లించని డిఫాల్టర్లకు బ్యాంకులు కోట్లలో రుణాలు ఇస్తున్నారని, రైతులు సకాలంలో రుణాలు చెల్లించకపోతే ఇంటి ప్రహరీ గేట్లను ఊడదీసుకొని పోతున్నారని.. ఇదెక్కడి విధానం? అని ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లో నాబార్డు రాష్ట్ర రుణ ప్రణాళిక సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నాబార్డు సీజీఎం ఉదయ భాస్కర్, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడారు. రైతులకు రుణాలివ్వడంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని, వారికి విరివిగా రుణాలివ్వాలని బ్యాంకర్లకు సూచించారు. కోతుల మందలు పంటలపై విరుచుకుపడుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కోతుల బెడద తప్పేందుకు సోలార్ ఫెన్సింగ్ విధానం మేలు అని.. ఇందుకు రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు ముందుకురావాలన్నారు. అనంతరం భట్టి మాట్లాడారు. రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు. రాష్ట్రంలో మామిడి, పసుపు, మిర్చి, చిరుధాన్యాలు ఎక్కువగా సాగవుతాయని, వీటి కోసం కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేసుకునేందుకు హైదరాబాద్ శివారు గ్రామాల్లో పూలసాగును ప్రోత్సహించేందుకు రుణం అందించాలని నాబార్డుకు సూచించారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపు సెట్లు ఉన్నాయని, వీటన్నింటినీ సౌర విద్యుత్తు పంపుసెట్లుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని, వీటికి నాబార్డు రుణాలు అందించాలని సూచించారు.

పంట రుణాలకు రూ.87వేల కోట్లు

రాష్ట్రంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను తెలంగాణకు రూ.3.86 లక్షల కోట్ల రుణ అవసరాలు ఉంటాయని జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) ప్రకటించింది. ఇది గత ఆర్థిక సంవత్సరం రుణ ప్రణాళిక కన్నా 37.8 శాతం ఎక్కువ అని పేర్కొంది. ఈ మేరకు తన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఆయా రంగాలవారీగా అందించనున్న రుణాలను నాబార్డు ప్రతినిధులు వెల్లడించారు. రుణ ప్రణాళికలో భాగంగా వ్యవసాయ రంగానికే రూ.1.63 లక్షల కోట్ల రుణ అవసరాలు ఉంటాయని, వీటిలో పంట రుణ అవసరాలకు రూ.87వేల కోట్లు అని వివరించారు. వ్యవసాయ సంబంధిత నిర్వహణ మూలధనం కింద రూ.7వేల కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాల టర్మ్ లోన్ల కింద రూ.69 వేల కోట్ల మేర రుణ అవసరాలుంటాయని తెలిపారు. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని నిర్ణయించామని, వీటికి రూ.2.03 లక్షల కోట్ల రుణాలు, ఇతర పారిశ్రామిక ప్రాధాన్య విభాగాలకు రూ.19 వేల కోట్ల రుణ అవసరాలు ఉంటాయని పేర్కొన్నారు.

విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు బీసీ కమిషన్ సిఫారసులు ఉండాలి

- బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లను పెంచాలంటే అందుకు బీసీ కమిషన్ సిఫారసులు అనివార్యమని బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. రిజర్వేషన్ల బిల్లును రాష్ట్ర ప్రభుత్వం చట్టంగా చేసినప్పటికీ కేంద్రాన్ని ఒప్పించి పార్లమెంటు ఉభయసభల్లో ఆమోదింపజేయాలంటే అందుకు కమిషన్ నివేదికలు, విశ్లేషణలు కీలకమన్నారు. రిజర్వేషన్లు 50శాతానికి మించి ఉండకూడదని ఇప్పటికే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ఈ నేపథ్యంలో రిజర్వేషన్‌ల పెంపు చట్టాన్ని షెడ్యూల్ 9లో చేర్చాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. అయితే షెడ్యూల్ 9లో చేర్చినప్పటికీ న్యాయ సమీక్షకు అవకాశం ఉందని, కనుక ఈ విషయంలో ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

ఎన్నికల వేళ అధికారుల బదిలీలు ఏల?

- ఇది కోడ్ ఉల్లంఘనే అంటోన్న ఉద్యోగులు

హైదరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉండగా అధికారుల బదిలీలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ జిల్లా, డివిజన్ స్థాయి అధికారులను ఎలా బదిలీ చేస్తారని పంచాయతీరాజ్ శాఖలోని పలువురు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ తనశాఖ పరిధిలోని జిల్లా పంచాయతీ అధికారులు, డివిజన్ పంచాయతీ అధికారులను బదిలీచేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. దీని ప్రకారం పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న (వెయిటింగ్) కె.మురళిని నిర్మల్ డీపీఓగా, జగదీశ్వర్‌ను కరీంనగర్ డీపీఓగా బదిలీచేశారు. కొమ్మగల్ల యాదగిరిని సూర్యాపేట డీఎల్‌పీఓగా, ముత్యాల శ్రీనివాస్‌ను నిజామాబాద్ డీఎల్‌పీఓగా, గుడిపల్లి రమేశ్‌ను నిర్మల్ నుంచి ఆదిలాబాద్ డీఎల్‌పీఓగా, మహమ్మద్ షర్ఫుద్దీన్‌ను పరకాల నుంచి సిరిసిల్ల డీఎల్‌పీఓగా, ఈ.హరికిషన్‌ను జగిత్యాల నుంచి కరీంనగర్ డీఎల్‌పీఓగా బదిలీ చేశారు. ఆదిలాబాద్ డీఎల్‌పీఓ ఎస్.శ్రీలతను పీఆర్ కమిషనర్ కార్యాలయంలో ఆర్‌ఈగా బదిలీచేశారు. అయితే జిల్లా, డివిజన్ స్థాయి అధికారులను బదిలీ చేయడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని ఉద్యోగులు చెబుతున్నారు.

మార్గదర్శిపై కేసు కొనసాగాల్సిందే!

- అదనపు కౌంటర్ సమర్పించిన ఆర్బీఐ

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి అవిభాజ్య హిందూ కుటుంబం (హెచ్‌యూఎఫ్) కర్త అయిన రామోజీరావు మరణించినప్పటికీ ఆ సంస్థపై కేసు కొనసాగించాల్సిందేనని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) శుక్రవారం హైకోర్టును కోరింది. మార్గదర్శి చట్టబద్ధమైన సంస్థగా కార్యకలాపాలను నిర్వహిస్తున్నందున కేసును కూడా కొనసాగించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టులో అదనపు కౌంటర్ దాఖలు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి సంస్థ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించిందంటూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ చేసిన ఫిర్యాదు మేరకు అప్పటి ఏపీ ప్రభుత్వం కేసు నమోదు చేసింది. ఈ కేసు కొట్టివేయాలని కోరుతూ మార్గదర్శి సంస్థ దాఖ లు చేసిన క్వాష్ పిటిషన్ సుప్రీంకోర్టు వరకు వె ళ్లింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మళ్లీ హైకోర్టు విచారణ చేపడుతోంది. తాజాగా శుక్రవారం జస్టిస్ శ్యాంకోషి, జస్టిస్ కే సుజన ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. ఈ కేసుపై ఆర్బీఐ తన వాదనను వినిపించింది. ఆర్బీఐ చట్టంలోని 45 (ఎస్) నిబంధనలను ఉల్లంఘించి, అర్హత లేకపోయినా అక్రమంగా డిపాజిట్లు సేకరించినందుకు పీనల్ సెక్షన్ అయిన 58(బీ)5ఏ ప్రకారం శిక్షను మార్గదర్శి ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది. మార్గదర్శి తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ లూథ్రాలు వాదనలు వినిపిస్తూ ఒకవేళ తండ్రి తప్పు చేసి మరణిస్తే అతడి వారసులపై ఆ క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడం సాధ్యం కాదని ధర్మాసనానికి నివేదించారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. మార్గదర్శి హెచ్‌యూఎఫ్ ఇప్పటికీ వ్యాపా రం నిర్వహిస్తోందని, సివిల్ తప్పులకైనా బాధ్యత వహించాల్సి వస్తుంది కదా? అని ప్రశ్నించింది. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది.

2400 కోట్ల ప్రాజెక్టులు

(మొదటిపేజీ తరువాయి)

వంతెనలు, ఆరు ఏరియాల్లో 6.58 కిలోమీటర్ల మేర రహదారుల విస్తరణ పనులకు నెలాఖరులోపు టెండర్ నోటిఫికేషన్ ప్రకటించేందుకు జీహెచ్ఎంసీ రంగం సిద్ధం చేస్తోంది. పలు ప్రాంతాల్లో వంతెనలు, అండర్‌పాస్‌లు, రహదారుల విస్తరణ పనులకు రూ.7,032 కోట్లతో ప్రభుత్వం గతంలోనే పాలనాపరమైన అనుమతులు జారీ చేసింది. ఈ మేరకు దశల వారీగా ప్రాజెక్టులు చేపట్టనుండగా.. ట్రాఫిక్ జామ్ సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మొదటి విడత పనులు చేయాలని నిర్ణయించారు. తొలి విడతలో మొత్తం 16 చోట్ల 20.14 కిలోమీటర్ల మేర రూ.2400 కోట్లతో ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించనున్నారు. ఆయా ప్రాజెక్టుల కోసం ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఆస్తుల సేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. రహదారి అభివృద్ధి ప్రణాళిక(ఆర్‌డీపీ)ను సిద్ధం చేసిన అధికారులు.. పలు మార్గాల్లో రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్ కూడా చేశారు. ఏకకాలంలో అటు ఆస్తుల సేకరణ, టెండర్ ప్రక్రియ కొనసాగించాలని నిర్ణయించారు. ప్రాజెక్టుల పనులు వీలైనంత త్వరగా ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. పనులు జరుగుతున్న సమయంలో పౌరులకు ఎక్కువ ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీంతో తదనుగుణంగా క్షేత్రస్థాయిలో పనులు చేపట్టేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కేబీఆర్ పార్కు చుట్టూ..

కోర్ ఏరియాలోని పలు ప్రాంతాల నుంచి ఐటీ కారిడార్ వైపు రాకపోకలు సాగించేవారు కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న జంక్షన్లలో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పార్కు చుట్టూ ఉన్న ఆరు చౌరస్తాల్లో సిగ్నల్ చిక్కులు లేని ప్రయాణం కోసం వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ ప్రతిపాదించింది. తక్కువ ఆస్తుల సేకరణ, వేగంగా పనులు జరిగేలా స్టీల్ వంతెనలు నిర్మించనున్నారు. దీంతో అంచనా వ్యయం రూ.860 కోట్ల నుంచి రూ.1,090 కోట్లకు పెరిగింది. రెండు ప్యాకేజీలుగా ఇక్కడి ప్రాజెక్టుల కోసం టెండర్లు పిలవనున్నారు. కేబీఆర్ పార్కు జాతీయ ఉద్యానవనం కావడం, ప్రాజెక్టుల కోసం చెట్లు తొలగిస్తే పర్యావరణంపై ప్రభావం పడుతుందంటూ పలువురు కోర్టుకు వెళ్లడంతో రోడ్డు విస్తరణ ప్రణాళికను అధికారులు మార్చారు. పార్కు వైపు వాక్‌వేలోని చెట్లనూ ముట్టుకోవద్దని నిర్ణయించారు. సెంట్రల్ మీడియన్, మరోవైపు ఉన్న 1942 చెట్లను తొలగించాల్సి ఉంటుందని గుర్తించారు. ప్రస్తుతం కేసు కోర్టు విచారణలో ఉండగా.. పార్కు వైపు సేకరణ లేని దృష్ట్యా.. టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ బల్దియాకు సూచించినట్టు తెలిసింది. సర్కారు కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో బిడ్‌లు ఆహ్వానిస్తామని ఓ అధికారి తెలిపారు. ప్రాజెక్టుల్లో భాగంగా బంజారాహిల్స్ విరించి చౌరస్తా నుంచి జూబ్లీ చెక్ పోస్ట్ చౌరస్తా వరకు ఆర్‌డీపీ సిద్ధమైంది. ఈ మార్గంలో 303 ఆస్తులను మార్కింగ్ చేయగా.. 45 మంది వరకు సుముఖత వ్యక్తం చేసినట్టు పట్టణ ప్రణాళికా విభాగం వర్గాలు చెబుతున్నాయి. మాజీ మంత్రి జానారెడ్డి, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ తదితర ప్రముఖులు తమ ఆస్తుల సేకరణకు సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది.

త్వరలో టెండర్లు పిలవనున్న ప్రాజెక్టులు..

నియోజకవర్గం (పార్లమెంటు/అసెంబ్లీ)	వంతెన/అండర్‌పాస్ నిర్మించే జంక్షన్	పొడవు కి.మీలలో
సికింద్రాబాద్/	జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్	2.25
ఖైరతాబాద్	కేబీఆర్ పార్కు, ముగ్ధ	1.49
	రోడ్ నెంబర్-45	0.79
	ఫిల్మ్‌నగర్	1.03
	మహారాజా అగ్రసేన్	1.00
	కేన్సర్ ఆస్పత్రి	0.87
చేవెళ్ల/	ఖాజాగూడ	1.52
శేరిలింగంపల్లి	ఐఐఐటీ	3.25
	విప్రో	1.05
మల్కాజిగిరి/	పైపులైన్ రోడ్	0.31
కుత్బుల్లాపూర్	ఫాక్స్ సాగర్ నాలాపై (బ్రిడ్జి)	
	మొత్తం	13.56

రూ.837 కోట్లతో వంతెనలు..

ఐటీ కారిడార్‌లోని పలు ప్రాంతాల్లో మరిన్ని వంతెనలు, అండర్‌పాస్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఖాజాగూడ, ఐఐఐటీ, విప్రో జంక్షన్ల వద్ద రూ.837 కోట్లతో ఫ్లై ఓవర్లు, గ్రేడ్ సెపరేటర్లు నిర్మించనున్నారు. దీంతో ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలు సులువు కానున్నాయి. సైబరాబాద్ సీపీ కార్యాలయం నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు పాత ముంబై రహదారిని 215 అడుగులు, గచ్చిబౌలి- మియాపూర్ రహదారిలోని అంజయ్యనగర్ నుంచి రాంకీ టవర్స్ వరకు 150 అడుగుల మేర రోడ్లను రూ.70 కోట్లతో విస్తరించనున్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో అజీమ్ హోటల్ నుంచి చర్చి గేట్, లక్కీ స్టార్ హోటల్ నుంచి హఫీజ్ బాబా నగర్, తులసినగర్ నుంచి గౌస్‌నగర్, చాంద్రాయణగుట్ట ఎక్స్ రోడ్ నుంచి చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ మీదుగా బార్కస్ వరకు రూ.320 కోట్లతో రహదారులను విస్తరించనున్నారు. ఈ పనులకు టెండర్ నోటిఫికేషన్ ప్రకటిస్తారు.

రహదారి విస్తరణ...

నియోజకవర్గం (పార్లమెంటు/అసెంబ్లీ)	కారిడార్	పొడవు కి.మీలలో
చేవెళ్ల/శేరిలింగంపల్లి	సైబరాబాద్ సీపీ ఆఫీస్ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు 210 అడుగులు	0.985
	అంజయ్యనగర్ నుంచి రాంకీ టవర్స్ 150 అడుగులు	0.8
హైదరాబాద్/ చాంద్రాయణగుట్ట	అజీమ్ హోటల్ నుంచి చర్చి గేట్ 80 అడుగులు	0.65
	లక్కీ స్టార్ హోటల్ నుంచి హఫీజ్‌బాబా నగర్ వయా పూల్‌బాగ్ 60, 40 అడుగులు	1.2
	తులసినగర్ నుంచి గౌస్ నగర్ 100 అడుగులు	2.5
	చాంద్రాయణగుట్ట ఎక్స్ రోడ్ నుంచి బార్కస్ రోడ్ 60 అడుగులు	0.45
	మొత్తం	6.585
	గ్రాండ్ టోటల్	20.145

ఒకే పిల్లర్‌పై ఫ్లై ఓవర్.. మెట్రో కారిడార్!

- విప్రో చౌరస్తాలో డబుల్ డెక్కర్ నిర్మాణం
- కింద వాహనాలు.. పైన మెట్రోరైల్
- జీహెచ్ఎంసీ, హెచ్ఎంఆర్ సమన్వయంతో డిజైన్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): హెచ్-సిటీ ప్రాజెక్టుల్లో భాగంగా ఐటీ కారిడార్‌లో డబుల్ డెక్కర్ వంతెన అందుబాటులోకి రానుంది. ఐటీ కారిడార్‌లోని విప్రో జంక్షన్ వద్ద ఒకే పిల్లర్‌పై ఫ్లైఓవర్‌ను, మెట్రో కారిడార్‌ను నిర్మించనున్నారు. వాహనాలు, మెట్రో రైల్ ఒకే నిర్మాణంపై రాకపోకలు సాగించేలా ప్రాజెక్టును డిజైన్ చేస్తున్నారు. ఆస్తుల సేకరణ అవసరం లేకుండా, తక్కువ వ్యయంతో నిర్మించేలా దీనిని రూపొందిస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రైల్(హెచ్ఎంఆర్) వర్గాలతో పలుమార్లు చర్చించామని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. సాధారణ వంతెన కంటే ఎక్కువ పటిష్ఠంగా ఫౌండేషన్లు, పిల్లర్లు, పియర్ క్యాప్‌లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు. వంతెనపై వాహనాల రాకపోకలకు రోడ్డు మార్గం.. దానిపైన నిర్మించనున్న మెట్రో కారిడార్‌కు అనుగుణంగా స్ట్రక్చరల్ డిజైన్ సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రాథమిక డిజైన్ రూపొందించామని, హెచ్ఎంఆర్ అధికారులతో తిరిగి సమావేశమై ఖరారు చేస్తామని ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే నగరంలో మొట్ట మొదట అందుబాటులోకి వచ్చే డబుల్ డెక్కర్ వంతెన ఇదే అవుతుందని బల్దియా వర్గాలు పేర్కొంటున్నాయి. విప్రో జంక్షన్ వద్ద ఐఎస్‌బీ వైపు రోడ్డు నుంచి కాగ్నిజెంట్ చౌరస్తా వరకు 1.05 కి.మీల మేర ఫ్లై ఓవర్ ప్రతిపాదించారు. రాయదుర్గ్ నుంచి కోకాపేట నియోపొలిస్ వరకు ఫేజ్-2లో ప్రతిపాదించిన మెట్రో కారిడార్ ఈ మార్గంలోనే ఉంది.

ఖాజాగూడ నుంచి నియోపొలిస్ వరకు..

రాయదర్గ్ నుంచి ఖాజాగూడ, నానక్‌రాంగూడ, విప్రో జంక్షన్, కాగ్నిజెంట్ చౌరస్తా, ఔటర్ కోకాపేట ఎగ్జిట్-1, ఖానాపూర్ మీదుగా కోకాపేట నియోపొలిస్ వరకు మెట్రో కారిడార్ నిర్మించనున్నారు. నానక్‌రాంగూడ నుంచి వచ్చే మెట్రో కారిడార్ విప్రో జంక్షన్ వద్ద ఎడమ వైపునకు తిరిగి కోకాపేట ఎగ్జిట్ వైపు వెళ్తుంది. విప్రో జంక్షన్ నుంచి కాగ్నిజెంట్ చౌరస్తా వరకు మెట్రో, వంతెన కలిపి నిర్మించనున్నారు. కాగ్నిజెంట్ చౌరస్తా ముందు వంతెన దిగే వాహనాలు అక్కడ నిర్మించనున్న అండర్‌పాస్ మీదుగా ఔటర్ ఎక్కుతాయి. ఔటర్ నుంచి వచ్చే వాహనాలు కోకాపేట ఎగ్జిట్-1 వద్ద దిగి కాగ్నిజెంట్ చౌరస్తాలోని అండర్‌పాస్, అనంతరం వంతెన మీదుగా ఐఎస్‌బీ వైపు సులువుగా వచ్చే వెసులుబాటు ఉంటుంది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పడుతుందని అధికారులు చెబుతున్నారు. వంతెనలు, మెట్రో కారిడార్ వేర్వేరుగా చేపట్టిన పక్షంలో భారీ స్థాయిలో ఆస్తులు సేకరించాల్సి ఉంటుంది. ఇందుకు రూ.వందల కోట్లు వెచ్చించాలి. డబుల్ డెక్కర్ వంతెనతో.. ఆస్తుల సేకరణ భారం ఉండదని, నిర్మాణ వ్యయమూ తగ్గుతుందని ఓ అధికారి తెలిపారు. మేడ్చల్, శామీర్‌పేట మార్గాల్లో నిర్మించే ఎలివేటెడ్ కారిడార్లనూ మెట్రోతో పాటు కలిపి డిజైన్ చేస్తున్నారు. ఆయా మార్గాల్లోనూ డబుల్ డెక్కర్ వంతెనల ప్రతిపాదనలున్నాయి.

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల
ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్

- దీపా దాస్‌మున్షీ స్థానంలో నియామకం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల నూతన ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్ నియమితులయ్యారు. దాదాపు ఏడాదిపాటు ఇన్‌చార్జిగా వ్యవహరించిన దీపా దాస్‌మున్షీ స్థానంలో మీనాక్షి బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే, కాంగ్రెస్ భాగస్వామ్యంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉన్న జార్ఖండ్‌కు పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొప్పుల రాజుకు అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. వీరితోపాటు దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇన్‌చార్జులను నియమించింది. ఇందులో త్వరలో ఎన్నికలు జరగనున్న బిహార్ సైతం ఉంది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం రాత్రి నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. బిహార్ ఇన్‌చార్జిగా పార్టీ సీనియర్ నేత కృష్ణ అల్లవారు, హిమాచల్ ప్రదేశ్, చండీగఢ్ ఇన్‌చార్జిగా రజనీ పాటిల్, హరియాణాకు బీకే హరిప్రసాద్, మధ్యప్రదేశ్‌కు హరీశ్ చౌదరి, తమిళనాడు, పుదుచ్చేరికి గిరీశ్ చౌడాంకర్, ఒడిసాకు అజయ్‌కుమార్ లల్లూ, మణిపూర్, త్రిపుర, సిక్కిం, నాగాలాండ్‌కు సప్తగిరి శంకర్ ఉల్కాను నియమించారు. కాగా, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌చార్జిగా నియమితులైన మీనాక్షి నటరాజన్.. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆమె కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం ఎన్‌ఎస్‌యూఐ నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1999 నుంచి 2022 వరకు ఎన్ఎస్ యూఐ జాతీయ అధ్యక్షురాలిగా పని చేశారు. ప్రస్తుతం రాజీవ్ గాంధీ పంచాయతీ సంఘటన్ జాతీయ అధ్యక్షురాలిగా ఉన్నారు. 2009 నుంచి 2014 వరకు మందసౌర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీగా పనిచేసిన మీనాక్షి నటరాజన్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ టీమ్‌లో కీలక సభ్యురాలనే పేరుంది. మీనాక్షి నటరాజన్ నియామకం పట్ల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

ఢిల్లీ వెళ్లిన రేవంత్..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మళ్లీ ఢిల్లీకి వచ్చారు. ఈ నెల 7, 8 తేదీల్లో ఢిల్లీకి వచ్చి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో రెండు రోజులపాటు మంతనాలు జరిపిన రేవంత్‌కు వారం తిరగకముందే మళ్లీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. దీంతో శుక్రవారం రాత్రి ఢిల్లీ చేరుకున్న సీఎం.. శనివారం పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని కూడా కలుసుకోనున్నారు. ఇంతకుముందు రేవంత్‌తోపాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కూడా పిలవగా.. ఈసారి సీఎం ఒక్కరినే పిలవడం గమనార్హం. గతవారం పార్టీ పెద్దలు పీసీసీ కార్యవర్గం ఎంపికపై మంతనాలు జరపడంతోపాటు కులగణనపై కూడా సమీక్ష నిర్వహించారు. మంత్రివర్గ జాబితాపై మాత్రం ఏకాభిప్రాయం లేకపోవడంతో దానిపై నిర్ణయాన్ని వాయిదా వేశారు. ఈ విషయాలను కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఉదయం రాహుల్‌గాంధీకి వివరించారు. దీంతో రాహుల్ ఆదేశాల మేరకే రేవంత్‌ను మళ్లీ ఢిల్లీ పిలిపించినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈసారి మంత్రివర్గ విస్తరణపై కూడా రేవంత్ అధిష్ఠానంతో మరోసారి చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది.

వర్గీకరణ ఎవరికీ వ్యతిరేకం కాదు

- ఎస్సీ రిజర్వేషన్లపై ఎలాంటి అనుమానాల్లేవు
- విపక్షాల ఆరోపణలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలి
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో మంత్రి దామోదర



హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఏ ఒక్క కులానికి, మతానికి వ్యతిరేకం కాదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రిజర్వేషన్ల కేటాయింపు 2011 జనాభా లెక్కల ప్రకారం చేశామని, ఎస్సీ రిజర్వేషన్లపై ఎవరికీ ఎలాంటి అనుమానాలు లేవని స్పష్టం చేశారు. విపక్షాలు చేస్తున్న ఆరోపణల ను కాంగ్రెస్ శ్రేణులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్(పీపీపీ) ద్వారా కాంగ్రెస్ ముఖ్య నాయకులకు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో పాటు ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు, డీసీసీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన గంట వ్యవధిలోనే శాసనసభలో ప్రకటన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుదీర్ఘకాలం పోరాటం చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎస్సీ వర్గీకరణపై చిత్తశుద్ధితో సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసి సీనియర్ న్యాయవాదులతో కేసును వాదించామని తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందన్నారు. దళితుల్లో అత్యంత వెనుకబడిన కులాలకు సామాజిక న్యాయం చేయడానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కాగా, ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తూ 57 ఎంబీఎస్సీ కులాల ఐక్యవేదిక ప్రతినిధులు మంత్రి దామోదరను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో 300 ఎంపీ సీట్లతో
ప్రజలు రాహుల్‌ను ప్రధానిని చేస్తారు

- తెలంగాణ బీజేపీ ఎంపీలూ.. హైదరాబాద్‌కు ఐటీఐఆర్ తీసుకురండి
- యూపీఏ హయాంలో ఐఐటీ మంజూరు
- అప్పుడు నాకు ఐఐటీ ఫుల్ ఫామ్ తెలియదు
- దాన్ని సంగారెడ్డిలో పెట్టాలనుకుంటున్నట్లు వైఎస్ఆర్ చెప్పారు
- ప్రకటన పది రోజులు ఆపుతా.. చుట్టూతా భూమి కొనుక్కోమనీ చెప్పారు
- లేదు.. వెంటనే ప్రకటించాలని కోరా
- రఘునందన్.. నువ్వు డిక్షనరీ చదివినవ్
- నేను జీవితాన్ని చదివిన: తూర్పు జగ్గారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి 300 ఎంపీ సీట్లు ఇచ్చి.. రాహుల్‌గాంధీని ప్రధానిని చేస్తారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ నాలుగేళ్లలో హైదరాబాద్‌కు ఐటీఐఆర్ తీసుకురావాలంటూ తెలంగాణ బీజేపీ ఎంపీలకు సూచించారు. వారు తేలేని పక్షంలో రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యాక తానే అడిగి తీసుకువస్తానన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ తాను బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంత చదువుకోలేదని, ఐటీఐఆర్ ఫుల్ ఫామ్ కూడా తనకు తెలియదన్నారు. కానీ ఐటీఐఆర్ వల్ల రాష్ట్రానికి కలిగే లాభం మాత్రం తెలుసునన్నారు. "యూపీఏ హయాంలో తెలంగాణకు ఐఐటీ మంజూరైంది. దాన్ని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పెట్టాలంటున్నారంటూ అప్పటి సీఎం వైఎస్ఆర్.. నన్ను అసెంబ్లీలోని తన చాంబర్‌కు పిలిపించుకుని చెప్పారు. మంజూరైన ఐఐటీని సంగారెడ్డిలో పెట్టాలనుకుంటున్నాననీ అన్నారు. వాస్తవానికి ఆ రోజున నాకు ఐఐటీ అంటే ఏంటో తెలియదు. కానీ సీఎం అడిగాడంటే ప్రధానమైందని అని భావించి వెంటనే ఓకే చెప్పా" అని వెల్లడించారు. నాడు బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా ఉన్న తనకు.. కందిలో ఐఐటీ ఇచ్చారని గుర్తు చేసుకున్నారు.



ఆనాడు వైఎస్ఆర్ చెప్పింది వినుంటే..!

సంగారెడ్డిలో ఐఐటీ పెట్టాలనుకుంటున్నట్లు చెప్పిన వైఎస్ఆర్.. ప్రకటన పది రోజులు ఆపుతాను.. చుట్టు పక్కల భూములు ఏమైనా కొనుక్కుంటావా అంటూ పెద్ద మనసుతో తనను అడిగారని జగ్గారెడ్డి వెల్లడించారు. ఇప్పుడు భూములు కొనుక్కుంటే ప్రకటన తర్వాత వాటి ధరలు పెరుగుతాయనీ ఆయన చెప్పారన్నారు. అయితే అప్పటికే ఐఐటీని హైదరాద్‌లోనే పెట్టాలంటూ కొందరు నేతలు ఆయనపై ఒత్తిడీ పెడుతున్నారని తెలిపారు. దాంతో ప్రకటన ఆపొద్దని, వెంటనే అసెంబ్లీలో ప్రకటించాలని ఆయనను కోరానన్నారు. అదే రోజున ఆయన అసెంబ్లీలో ప్రకటించారని చెప్పారు. అప్పట్లో కందిలో ఎకరా భూమి కేవలం రూ.5 లక్షలు మాత్రమే ఉండేదని, ఐఐటీ రావడం వల్ల అక్కడ ప్రస్తుతం ఎకరా రూ.5 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకూ పలుకుతోందని తెలిపారు. ఆనాడు వైఎస్ఆర్ తనను అడిగినప్పుడు ఐఐటీ ఫుల్ ఫామ్ గురించి ఆలోచించుకుంటూ కూర్చుంటే కందిలో ఐఐటీ వచ్చుండేదే కాదన్నారు. "సంగారెడ్డికి నేను ఐఐటీని తీసుకువచ్చాను.. ప్రత్యక్షంగా, పరోక్షంగా 35 లక్షల ఉద్యోగాలు వచ్చే ఐటీఐఆర్‌ను హైదరాబాద్‌కు మీరు ఎప్పుడు తెస్తరని అడిగితే.. ఐటీఐఆర్ ఫుల్ ఫామ్ అడుగుతవా? ఉత్త మాటలు కాదు..! హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను తీసుకువచ్చి.. నువ్వు, కిషన్ రెడ్డి నవ్వండి" అంటూ ఎంపీ రఘునందన్‌రావుపై ధ్వజమెత్తారు. ఈ నాలుగేళ్లలో బీజేపీ ఎంపీలు హైదరాబాద్‌కు ఐటీఐఆర్ తెస్తరో తేరో అన్నది తేలుతదని, రాహుల్ ప్రధాని అయ్యాక తీసుకువచ్చేందుకు తాను ప్రయత్నిస్తానని చెప్పారు. ఒకవేళ బీజేపీ తెలంగాణ ఎంపీలే ఐటీఐఆర్ తీసుకొస్తే వారికి శాలువా కప్పి సన్మానిస్తానన్నారు. రఘునందన్‌లాగా తాను లా పుస్తకాలు చదవలేదని, కానీ ప్రజల మనస్తత్వం చదివి.. వారి అవసరాలను గుర్తించానన్నారు. రఘునందన్‌కు చదువు అహంకారాన్ని నేర్పిందని ఆయన వ్యాఖ్యానించారు.

అటవీ ప్రాంత రహదారులకు ప్రాధాన్యం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ ప్రాంతాల్లోని రోడ్ల మరమ్మ తులను చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని రోడ్ల మరమ్మతులు, హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) రోడ్ల గుర్తింపుపై జిల్లాల సూపరింటెండెంట్ ఇంజనీర్లతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..వర్షాకాలంలో తీవ్రంగా దెబ్బతిన్న రహదారుల ప్యాచ్ వర్కు పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.


మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన మందకృష్ణ మాదిగ

మంద కృష్ణది ముప్పై ఏండ్ల పోరాటం

"ఎస్సీల వర్గీకరణ కోసం ముప్పై ఏండ్ల పోరాటం నీది. వర్గీకరణతో పాటు, మరోవైపు పద్మ శ్రీ అవార్డును పొందావు. రెండింటికి కలిపి శుభాకాంక్షలు మిత్రమా" అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సచివాలయానికి వచ్చిన మంద కృష్ణ.. మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణమాదిగను.. మంత్రి శాలువా కప్పి సన్మానించారు.

మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుకు ఊరట!

- శరతులతో కూడిన బెయిలిచ్చిన నాంపల్లి కోర్టు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ2గా ఉన్న ప్రణీత్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ2గా ఉన్న మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావుకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. మూడు రోజులుగా ఆయన బెయిలు పిటిషన్‌పై విచారణ జరుగుతుండగా శుక్రవారం కోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. రూ.లక్ష డిపాజిట్‌తో పాటు ఇద్దరి పూచీకత్తులను సమర్పించాలంటూ ఒకటో అదనపు జిల్లా కోర్టు జడ్జి రమాకాంత్ ఆదేశాలు జారీ చేశారు. పాస్‌పోర్టును కోర్టులో సమర్పించాలని, ప్రతి సోమవారం ఉదయం 11 గంటలకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బెయిల్ షరతులను అతిక్రమించినట్లు తెలిస్తే వెంటనే రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసులో ప్రణీత్‌రావు రిమాండ్ ఖైదీగా 11 నెలలుగా జైల్లో ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ పోలీసు అధికారి ప్రభాకర్‌రావు, ఐన్యూస్ యజమాని శ్రవణ్‌రావుపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నందున వారిద్దరూ పరారీలో ఉన్నట్లుగా ప్రకటించాలని పోలీసులు పిటిషన్ వేశారు. వీరిద్దరూ కావాలనే తప్పించుకు తిరుగుతున్నారంటూ నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో అనుమానితుడిని కార్యాలయ వేళల్లోనే విచారించండి: హైకోర్టు

కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ దాఖలు చేసిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో అనుమానితులను కేవలం కార్యాలయ వేళల్లో మాత్రమే విచారించాలని పోలీసులకు హైకోర్టు స్పష్టంచేసింది. ఈ కేసులో పోలీసులు తనను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొంటూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి వంశీకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. అనుమానితుడిగా ఉన్న పిటిషనర్‌ను కేవలం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య మాత్రమే విచారణకు పిలవాలని స్పష్టం చేసింది.

లంచం కిక్కుతో ఏసీబీకి చిక్కారు

(మొదటిపేజీ తరువాయి)

మండలం పుల్లూరులో సమీపంలో ఓ వెంచర్ మేనేజర్ నుంచి జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), పంచాయతీ కార్యదర్శి రూ.3 లక్షలు డిమాండ్‌చేసి పట్టుబడ్డారు. పుల్లూరు దగ్గర్లో 44వ నంబరు జాతీయ రహదారికి అనుకొని టోల్‌ప్లాజా సమీపంలో సర్వే నంబరు 235/ఏ లోని నాలుగు ఎకరాల్లో 'అన్నపూర్ణ గ్రీన్‌ల్యాండ్స్' పేరుతో ఏపీకి చెందిన కొందరు వెంచర్ చేశారు. ఈ వెంచర్ కోసం వేసిన రోడ్డు మీద నుంచి వెళ్లేందుకు కొందరు వ్యక్తులు అడ్డుపడుతున్నారంటూ డీపీవో శ్యామ్ సుందర్‌కు వెంచర్ మేనేజర్ మహ్మద్ అజాజ్ బాషా ఫిర్యాదు చేశాడు. దీనిపై శ్యామ్‌సుందర్, పుల్లూరు గ్రామ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డి కలిసి వెళ్లి వెంచర్‌ను పరిశీలించారు. అయితే ఆ వెంచర్‌లో పంచాయతీకి తనఖా పెట్టిన ప్లాట్లను అనుమతులు లేకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల సహకారంతో వెంచర్ యాజమాని ఓ బిల్డర్‌కు రిజిస్ట్రేషన్ చేశారని కొందరు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంచర్ యజమానులకు నోటీసులు వెళ్లాయి. దీన్ని ఆసరాగా చేసుకొని వెంచర్ మేనేజర్ బాషా నుంచి ప్రవీణ్ లంచం డిమాండ్ చేశారు. వెంచర్‌పై చర్యలు ఉండొద్దంటే డీపీవోకు, తనకు కలిపి మొత్తం రూ.3లక్షలు ఇవ్వాల్సిందేనన్నాడు. చివరికి.. రూ.2లక్షలకు బేరం కుదిరింది. దీనిపై బాషా, వెంచర్ యజమానులు.. ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. శుక్రవారం ప్రవీణ్‌కు నగదు ఇచ్చేందుకు ఆయన సూచనల మేరకు అలంపూర్ వెళ్లే మార్గంలో గల జోగుళాంబ రైల్వేహాల్ట్ సమీపంలోని ఓ వెంచర్ వద్దకు బాషా వెళ్లాడు. అతడి నుంచి నగదు తీసుకున్న వెంటనే శ్యామ్‌సుందర్‌కు ప్రవీణ్ ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. సమీపంలోనే మాటువేసిన ఏసీబీ అధికారులు ప్రవీణ్‌ను చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో నిఘా ఉంచిన మరికొందరు ఏసీబీ అధికారులు డీపీవో శ్యామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరోఘటనలో.. రెండు భవనాలకు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం లంచంగా రూ.లక్ష డిమాండ్ చేసిన విద్యుత్తు శాఖ ఏడీఈని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శేరిలింగంపల్లి సమీపంలోని గోపన్‌పల్లిలో రెండు అపార్ట్‌మెంట్లకు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని విద్యుత్తు లైసెన్స్ కాంట్రాక్టర్ కొన్ని రోజుల క్రితం గచ్చిబౌలి ఏడీఈ సతీశ్ కుమార్‌ను సంప్రదించాడు. ఇందుకు సతీశ్ రూ.లక్ష డిమాండ్ చేయగా రూ.75వేలకు ఒప్పందం కుదిరింది. రెండు రోజుల క్రితమే రూ.25వేలు ఇచ్చి.. మిగితా డబ్బును శుక్రవారం ఇచ్చేలా కాంట్రాక్టర్ మాట్లాడుకున్నాడు. దీనిపై అప్పటికే అతడు ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం 12.30కు గచ్చిబౌలి విద్యుత్తు కార్యాలయంలో ఏడీఈ సతీశ్‌కు కాంట్రాక్టర్ డబ్బులిస్తుండగా ఏసీబీ అధికారులొచ్చి పట్టుకున్నారు. ఇంకో ఘటనలో.. ఓ భూమిని సర్వే చేసేందుకు లంచం తీసుకుంటూ రెవెన్యూ కమ్యూనిటీ కాంట్రాక్ట్ సర్వేయర్ ఏసీబీ అధికారులకు చిక్కారు.. శుక్రవారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం సరంపేట తండాకు చెందిన ముడావత్ సాయిరామ్ అనే రైతుకు భూ సరిహద్దుల సమస్య ఉంది. తనకు చెందిన 8గుంటల భూమి మరొకరి కబ్జాలో ఉందని.. సర్వే చేయాలని సాయిరామ్ ఆరునెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అయితే భూమి సర్వే చేసేందుకు సర్వేయర్ రవినాయక్ రూ.15వేలు డిమాండ్ చేయగా, రూ.12వేలు ఇస్తానని సాయిరామ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనిపై సాయిరామ్ ఐదు రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సాయిరామ్ నుంచి రూ.12వేలు తీసుకున్న సర్వేయర్ రవిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.


ఏసీబీ అధికారులు పట్టుబడ్డ ఏడీఈ సతీశ్ కుమార్, రెవెన్యూ కమ్యూనిటీ కాంట్రాక్ట్ సర్వేయర్ రవినాయక్

అక్కంపల్లి రిజర్వాయర్‌లో చచ్చిన కోళ్లు

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. గురువారం సాయంత్రం చేపల వేటకు వెళ్లిన జాలర్లు.. రిజర్వాయర్ వెనుక జలాల్లో తేలియాడుతున్న కోళ్లను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి నీటిపారుదల డీఈ నాగయ్యతో కలిసి శుక్రవారం జాలర్ల సహాయంతో మృతి చెందిన కోళ్లను బయటకు తీయించారు. డ్రోన్ల సహాయంతో రిజర్వాయర్ మొత్తం గాలించారు. ఘటనపై నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విచారణకు ఆదేశించగా.. జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్, అదనపు ఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రిజర్వాయర్ చుట్టుపక్కల గల కోళ్లఫాంలను పరిశీలించారు. రమావత్ రాయమల్లు అనే కోళ్ల ఫాం నిర్వాహకుడు వీటిని అందులో పడవేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకోగా.. అతడు అంగీకరించాడు. మండలంలోని పడమటి తండాకు చెందిన రాయమల్లు పుట్టంగండి నుంచి అక్కంపల్లి రిజర్వాయర్‌కు వచ్చే కెనాల్ సమీపంలో కోళ్ల ఫాం నిర్వహిస్తున్నాడు. అయితే గురువారం తెల్లవారుజామున వాటిలో 100 వరకు కోళ్లు మృతి చెందగా, 40 కోళ్లను గొయ్యి తవ్వి పూడ్చి పెట్టాడు. మరో 60 కోళ్లను సమీపంలోని ఏఎమ్మార్పీ కాలువలో పడవేశాడు. అవి ప్రవాహంలో అక్కంపల్లి రిజర్వాయర్‌కు కొట్టుకువచ్చాయి. కాగా, రిజర్వాయర్ ఏఈ వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు రాయమల్లుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు దేవరకొండ ఏఎస్పీ మౌనిక తెలిపారు.

ఆందోళన చెందాల్సిన అవసరంలేదు..

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకుతున్న నేపథ్యంలో ఈ ఘటన వెలుగుచూడటంతో ఈ కోళ్లు కూడా బర్డ్‌ఫ్లూతోనే మృతి చెందినవిగా స్థానికులు అనుమానిస్తున్నారు. అయితే ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్డీవో రమణారెడ్డి, జలమండలి అధికారులు అన్నారు. కోదండాపూర్ వాటర్ ప్లాంట్‌లో శుద్ధి చేసిన తర్వాతే హైదరాబాద్‌కు తాగునీరు సరఫరా చేస్తారని తెలిపారు. ఐఎస్ ప్రమాణాలతో మూడంచెల క్లోరిన్ ప్రక్రియ ద్వారా నీటి సరఫరా జరుగుతోందని చెప్పారు. క్వాలిటీ అస్యూరెన్స్ అండ్ టెస్టింగ్ వింగ్ (క్యూఏటీ) అధికారులతోపాటు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం), థర్డ్ పార్టీ లూసిడ్ సంస్థ.. కోదండాపూర్ నీటి శుద్ధి కేంద్రాలను సందర్శించి నీటి నమూనాలను సేకరించారు. ప్రాథమికంగా ఎలాంటి అవశేషాలను గుర్తించలేదన్నారు. కాగా, వచ్చే వారం రోజులపాటు ప్రతి గంటకు ఇక్కడ నీటి ప్రమాణాలను పరీక్షిస్తామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. మూడెంచెల క్లోరినేషన్‌లో భాగంగా మొదటిదశలో నీటి శుద్ధి కేంద్రాల (డబ్ల్యూటీపీ) వద్ద, రెండో దశలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల (ఎంబీఆర్) వద్ద, చివరగా సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ ప్రక్రియను చేపడతామన్నారు. అలాగే ప్రజలకు సరఫరా అవుతున్న నీటిలో తప్పనిసరిగా 0.5 పీపీఎం క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఎన్‌టీఏ.. మళ్లీ అదే 'తప్పు'!

- జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షలో రికార్డు స్థాయిలో 12 ప్రశ్నలు తొలగింపు
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరుపై విమర్శలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: జాతీయ స్థాయి పోటీ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మరోసారి 'తప్పు'ల సుడిగుండంలో చిక్కుకుంది. గత నెల నిర్వహించిన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష జేఈఈ మెయిన్-2025 సెషన్-1 తుది ఆన్సర్ కీ నుంచి తప్పులు దొర్లిన కారణంగా రికార్డు స్థాయిలో 12 ప్రశ్నలను (మొత్తం ప్రశ్నలు 90) తొలగించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంత భారీగా తప్పులు చోటుచేసుకొన్న నేపథ్యంలో ఎన్‌టీఏపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రశ్నలను ఉపసంహరించుకున్నప్పటికీ, జేఈఈ పరీక్షలో 0.6 శాతం పరిమితిగా ఉన్న ఎర్రర్ రేట్ 1.6 శాతానికి పెరిగింది. దీంతో ఎన్‌టీఏ పారదర్శకతపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపసంహరించుకున్న ప్రశ్నల్లో సిలబస్ పరిధి దాటినవి, అనువాదాలు దోషాలు ఉన్నవి ఉన్నాయని చెబుతున్నారు. నీట్, నెట్, జేఈఈ వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షలు నిర్వహించే ఎన్‌టీఏ.. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసే విషయంలో మరింత బాధ్యతగా ఉండాలని శృతిషా అనే విద్యార్థిని అన్నారు. ఈ పరీక్షల కోసం తన లాంటి విద్యార్థులు ఏళ్లుగా కష్టపడి చదుకుంటుంటారని, వారికి ప్రతి ప్రశ్నా ముఖ్యమైనదేనని, ఇలాంటి తప్పులను సహించలేమని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల్లో తప్పులు దొర్లడం ఇదే తొలిసారి కాదు. అయితే ఈసారి ఫైనల్ ఆన్సర్ కీ నుంచి తొలగించిన ప్రశ్నల సంఖ్య గత సంవత్సరాలతో పోలిస్తే ఎక్కువగా ఉండడం ప్రధానంగా చర్చకు దారితీసింది. దీంతో ఎన్‌టీఏ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తింది. గత ఏడాది జేఈఈ మెయిన్ సెషన్-1లో ఆరు, సెషన్-2లో నాలుగు ప్రశ్నలను తొలగించారు. 2021లో జరిగిన రెండు సెషన్లలో ప్రశ్నల్లో ఎలాంటి తప్పులు దొర్లలేదు.

ఆన్సర్ కీలో తప్పులు

కాగా, భాషా అనువాద దోషాలు పరీక్షా ప్రక్రియపై విశ్వాసాన్ని మరింత తగ్గిస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. జేఈఈ మెయిన్-2025 సెషన్-1 ఆన్సర్ కీలో రెండు అనువాద లోపాలు ఉన్నాయని, ఇది గందరగోళానికి దారితీసిందని పేర్కొన్నారు. తప్పు సమాధానాలను సరైనవిగా గుర్తించడం వలన అదనపు వ్యత్యాసాలు ఏర్పడ్డాయని చెప్పారు. హిందీ, గుజరాతీ భాషల్లో పరీక్ష రాసే విద్యార్థులకు రెండు సమాధాన ఎంపికలు ఉండగా.. మిగతా విద్యార్థులకు ఒక ఆప్షన్ మాత్రమే ఉండడంతో న్యాయబద్ధతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 'చాలా తప్పులు ఉన్నాయి. ఎన్‌టీఏ బాధ్యత తీసుకోవడం లేదా దీనిపై స్పష్టత ఇవ్వడం చేయలేదు. ఏ పరిష్కారం కూడా చూపడం లేదు' అని ఢిల్లీలో జేఈఈ, నీట్ విద్యార్థులకు బోధించే జితేందర్ అహూజా అనే అధ్యాపకుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక ఏజెన్సీగా తప్పులు లేకుండా పరీక్ష నిర్వహించడం వారి బాధ్యత అని, గత అనుభవాల నుంచి ఏమీ నేర్చుకున్నట్లు కనిపించడం లేదని విమర్శించారు. సిలబస్‌లో లేని ప్రశ్నలు ఇవ్వడం ఎన్‌టీఏపై విశ్వాసాన్ని మరింత తగ్గించిందని అన్నారు. సిలబస్‌లోని ప్రశ్నల కారణంగా పరీక్షలో చాలా సమయం కోల్పోవాల్సి వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు. దీని పరీక్షలో తమ ప్రదర్శన, ర్యాంకుపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

చిత్రజ్యోతి

SINCE 1965

ప్రేమగాథల పరిచయం

కొత్త సినిమాల విడుదలతో పాటు ప్రేమికుల రోజు కలసి రావడంతో ఈ శుక్రవారం వినోదం రెండింతలైంది. కొత్త పోస్టర్స్‌తో ఇండస్ట్రీ కళకళలాడింది. రసవత్తరమైన ప్రేమగాథలను ప్రేక్షకులకు పరిచయం చేస్తూ తమ చిత్రాల నుంచి కొత్త పోస్టర్లను విడుదల చేశాయి చిత్రబృందాలు. అగ్రతారలు తమ సినిమా అప్డేట్స్‌తో అభిమానులను ఖుషీ చేశారు.



నీ వెంటే నేనుంటా

నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈనెల 28న విడుదలవుతోంది. ప్రేమికుల రోజు సందర్భంగా ఈ చిత్రంలోని రెండో పాట 'వేర్ ఎవర్ యు గో...'ని మహేశ్ బాబు రిలీజ్ చేశారు. కృష్ణకాంత్ సాహిత్యానికి జి.వి.ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని అందించారు. అర్మాన్ మాలిక్ ఆలపించారు.



మ్యాజిక్‌తో

ప్రముఖ నిర్మాణసంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై రూపుదిద్దుకుంటున్న చిత్రం 'మ్యాజిక్'. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. సారా అర్జున్, అన్మోల్ కజానీ, ఆకాశ్ శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సంగీత ప్రాధాన్యమున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ స్వరాలందిస్తున్నారు. శుక్రవారం చిత్రబృందం 'డోంట్ నో వై' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. ఐశ్వర్య సురేశ్‌తో కలసి అనిరుధ్ ఆలపించారు. తెలుగు వెర్షన్‌కు కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: గిరీష్ గంగాధరన్, ఎడిటర్: నవీన్ నూలీ



ప్రేమికుల పోరాటం



కథానాయకుడు నాని సమర్పకుడిగా రామ్ జగదీష్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కోర్ట్ -స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటిస్తున్నారు. ప్రియదర్శి ప్రధాన పాత్ర పోషించారు. ప్రశాంత్ త్రిపిర్నేని నిర్మాత. 'ప్రేమలో...' అంటూ సాగే పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, సమీరా భరద్వాజ్ ఆలపించారు. విజయ్ బుల్గానిన్ స్వరపరిచారు. ఈ చిత్రం మార్చి 14న విడుదలవనుంది.

మహారాణి లుక్‌తో

దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కాంత'. స్పిరిట్ మీడియా, వేఫేరర్ ఫిల్మ్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్,ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. 1950 ల నాటి మద్రాస్ నేపథ్యంలో తెరకెక్కుతోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రేమికుల దినోత్సవం కానుకగా భాగ్యశ్రీ బోర్సే ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. బంగారు ఆభరణాలు, గులాబీ రంగు చీరలో మెరుపులీనుతూ మహారాణిలా కనిపించారు.

ప్రేమలో రాశీ ఖన్నా

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నీరజా కోన దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా మేకర్స్ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. రాశీ ఖన్నా సిద్ధు బుగ్గపై ముద్దు పెడుతూ చిరునవ్వుతో కనిపిస్తుండగా, శ్రీనిధి శెట్టి అతని ముందు నిలబడి ఉండటం..ఒక పర్ఫెక్ట్ వాలెంటైన్స్ డే పోస్టర్‌ని ప్రజెంట్ చేస్తోంది.

అందమైన జంట కథ

యువ కథానాయకుడు సుహాస్ తన విభిన్నమైన కథల ఎంపికతో ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఈసారి మరో అందమైన ప్రేమ కథా చిత్రం ' ఓ భామ అయ్యో రామ'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మలయాళ నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) కథానాయికగా పరిచయం అవుతున్నారు. రామ్ గోధల దర్శకత్వంలో హరిష్ నల్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటికి చెందిన స్పిరిట్ మీడియా విడుదల చేయనుంది. కాగా, ప్రేమికుల రోజు సందర్భంగా పోస్టర్‌ని విడుదల చేశారు. ఇందులో సుహాస్, మాళవిక మనోజ్‌ల రొమాన్స్‌ను చూపిస్తూ, ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచారు.

షూట్ మొదలు

సందీప్‌రాజ్ దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'మోగ్లీ 2025'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. అటవీ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ప్రేమకథా చిత్రమిది. సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయికగా పరిచయమవుతున్నారు. షూట్ మొదలు అంటూ చిత్రీకరణ ప్రారంభించిన విషయాన్ని తెలుపుతూ హీరో, హీరోయిన్లు తుపాకి గురిపెడుతున్న పోస్టర్‌ను యూనిట్ పంచుకుంది.

హాస్టల్‌లో లవ్‌స్టోరీ

రాయలసీమ భరత్, ప్రీతి జంటగా దర్శకద్వయం భరత్, సంతోష్ తెరకెక్కిస్తున్న చిత్రం 'జగన్నాథ్'. పీలం పురుషోత్తం నిర్మాత. అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన కార్యక్రమంలో మూవీ టీజర్, పోస్టర్‌ను మంచు మనోజ్ రిలీజ్ చేశారు.

● వినయ్ గోను దర్శకత్వంలో దొమ్మరాజు అమరావతి, శ్రీకాంత్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'నా లవ్ స్టోరీ'. మోహిత్ పెద్దాడ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను 'ఆర్ఎక్స్ 100' దర్శకుడు అజయ్ భూపతి లాంచ్ చేశారు.


తెలుసు కదా


ఓ భామ అయ్యో రామ






నా లవ్ స్టోరీ

నాది ఆస్తుల గొడవ కాదు ఆత్మగౌరవ పోరాటం


-మంచు మనోజ్

తనది ఆస్తుల గొడవ కాదని, ఆత్మగౌరవం కోసం చేస్తున్న పోరాటమని సినీ నటుడు, మోహన్‌బాబు తనయుడు మంచు మనోజ్‌కుమార్ అన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం, ఎ. రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం వద్ద బౌన్సర్ల చేతిలో ధ్వంసమైన ఎఫ్5 రెస్టారెంట్‌ను చూసేందుకు శుక్రవారం ఉదయం మనోజ్ వచ్చారు. అయితే రెస్టారెంట్ మూసి ఉండడం చూసి మీడియాతో మాట్లాడారు. తనను అణగదొక్కాలనే ఉద్దేశంతో గురువారం రాయచోటిలో ఆడియో ఫంక్షన్‌కు వచ్చానని తెలిసి ఈ దాడి చేశారని తెలిపారు. తన అనుచరుడైన ఎఫ్5 రెస్టారెంట్ యజమాని అనిల్‌పై దాడి చేసిన బౌన్సర్లు రెస్టారెంట్‌నూ ధ్వంసం చేశారని సమాచారం అందిందన్నారు. మోహన్‌బాబు విశ్వవిద్యాలయం చుట్టుపక్కల ఎంతో మంది రుణాలు తీసుకుని హాస్టల్స్, హోటల్స్ పెట్టి బ్రతుకుతున్నారన్నారు. విశ్వవిద్యాలయంలో పనిచేసే హేమాద్రి నాయుడు, వినయ్ మహేశ్వరి, ఫొటోగ్రాఫర్ మౌళి వారిని కొట్టి బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వీరిని ప్రశ్నిస్తే బౌన్సర్ల చేత దాడులు చేయిస్తున్నారన్నారు. దీన్ని ప్రశ్నించినప్పటి నుంచే తనపై అభాండాలు మొదలయ్యాయన్నారు. అనంతరం మనోజ్‌కుమార్ మరో బాధితుడు, ప్రైవేటు హాస్టల్ యజమాని సురేశ్‌రెడ్డితో పాటు చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు వచ్చి సీఐ సుబ్బరామిరెడ్డితో మాట్లాడారు.

చంద్రగిరి, (ఆంధ్రజ్యోతి)




ప్రభాస్ సినిమాలో అనుపమ్



ప్రభాస్ హీరోగా హనురాఘవపూడి దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు అనుపమ్‌ఖేర్ నటించనున్నారు. ఈ విషయాన్ని అనుపమ్ ఖేర్ తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'ఇండియన్ సినిమా బాహుబలి ప్రభాస్‌తో నా 544వ చిత్రాన్ని ప్రకటించినందుకు ఆనందంగా ఉంది. ఈ చిత్రానికి అద్భుతమైన ప్రతిభావంతులైన హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు' అని ఆయన పేర్కొన్నారు.

కొత్త తేదీన దిల్ రూబా



'క' లాంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రూబా'. రుక్సర్ ధిల్లాన్ కథానాయిక. విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. ముందు ప్రకటించిన విధంగా ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న 'దిల్ రూబా' విడుదల కావాల్సి ఉండగా, బెటర్ అవుట్‌పుట్ కోసం సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు యూనిట్ శుక్రవారం ప్రకటించింది. మార్చి 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపింది.

వీరుడి గాథ మొదలు



యూనివర్సల్ క్రియేటివ్ స్టూడియోస్, శ్రీకర మూవీ మేకర్స్ బ్యానర్లపై శేష బాబు, సీహెచ్ కాసుల రామకృష్ణ నిర్మిస్తున్న చిత్రం 'అరి వీర భయంకర'. కిషన్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. అక్సాఖాన్, వైదిక, ఐశ్వర్య, కనిక మోంగ్యా, అర్చనా రాయ్, డెబోర, అమిత శ్రీ, శృతి రాజ్, సోమదత్త, నాగ మహేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది.

స్పోర్ట్స్

వరంగల్ ● శనివారం 15 ఫిబ్రవరి 2025

'చాంపియన్స్' విజేతకు రూ.19.40 కోట్లు

భారీగా పెరిగిన ప్రైజ్‌మనీ

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) ప్రైజ్‌మనీని ఐసీసీ ప్రకటించింది. దీనిలో భాగంగా విజేతకు రూ.19 కోట్ల 40 లక్షల మొత్తం దక్కనుంది. రన్నరప్‌నకు రూ.9 కోట్ల 70 లక్షలు అందుతాయి. ఇక సెమీస్‌లో ఓడిన జట్లకు రూ.4 కోట్ల 85 లక్షల చొప్పున ఇవ్వనున్నారు. మొత్తంగా సీటీ ప్రైజ్‌మనీ దాదాపు రూ.60 కోట్లుగా ఉంది. మరోవైపు 2017లో చివరిసారి జరిగిన సీటీతో పోలిస్తే తాజా ప్రైజ్‌మనీ 53శాతం పెరగడం విశేషం. అలాగే ప్రతీ గ్రూప్ మ్యాచ్ విజేతకు కూడా రూ.29 లక్షల 46 వేలు ఇవ్వనున్నారు. ఇది కాకుండా టోర్నీలో పాల్గొనే 8 జట్లకు ప్రాతినిధ్య ఫీజు కింద రూ. కోటీ 8 లక్షల చొప్పున ఇవ్వనున్నారు. ఈనెల 19 నుంచి మార్చి 9 వరకు పాక్, దుబాయ్‌ల్లో ఈ మెగా టోర్నీ జరుగనుంది.

లంకదే వన్డే సిరీస్

కొలంబో: కుశాల్ మెండిస్ (101) తొలుత సెంచరీతో చెలరేగగా..యువ స్పిన్నర్ వెల్లలగే (4/35) మెరవడంతో ఆస్ట్రేలియాతో శుక్రవారం జరిగిన రెండో వన్డేలో శ్రీలంక 174 పరుగులతో ఘన విజయం సాధించింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను లంక క్లీన్‌స్వీప్ చేసింది. మొదట శ్రీలంక 50 ఓవర్లలో 281/4 స్కోరు చేసింది. ఛేదనలో వెల్లలగేతోపాటు మరో స్పిన్నర్ హసరంగ (3/23) తిప్పేయడంతో ఆసీస్ 24.2 ఓవర్లలో 107 రన్స్‌కే కుప్పకూలింది.

ఆర్‌సీబీ అదిరే బోణీ

- రిచా, ఎలిస్, కనిక మెరుపులు
- గుజరాత్‌పై ఘనవిజయం
- గార్డ్‌నర్ ఆల్‌రౌండ్ షో వృథా

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ × ముంబై
రాత్రి 7.30 నుంచి



రిచా ఘోష్ (27 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 నాటౌట్)

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మూడో సీజన్‌కు అదిరే ఆరంభం. కీలక ఆటగాళ్లు గాయాలతో జట్టుకు దూరమైనా డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అద్వితీయ ఆటతీరుతో ఆకట్టుకుంది. గుజరాత్ జెయింట్స్‌పై 202 పరుగుల రికార్డు ఛేదనను సైతం మరో 9 బంతులుండగానే ముగించింది. చివర్లో రిచా ఘోష్ (27 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 నాటౌట్) బౌలర్లను చెడుగుడు ఆడేసుకుంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు చేసింది. గార్డ్‌నర్ (37 బంతుల్లో 3 ఫోర్లు, 8 సిక్సర్లతో 79 నాటౌట్), బెథ్ మూనీ (42 బంతుల్లో 8 ఫోర్లతో 56) అర్ధసెంచరీలు సాధించారు. పేసర్ రేణుకా సింగ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో బెంగళూరు 18.3 ఓవర్లలో 4 వికెట్లకు 202 పరుగులు చేసి గెలిచింది. ఎలిస్ పెర్రీ (34 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 57), కనికా అహూజా (13 బంతుల్లో 4 ఫోర్లతో 30 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. గార్డ్‌నర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రిచా ఘోష్ నిలిచింది.

రిచా సూపర్: భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన బెంగళూరుకు రెండో ఓవర్‌లోనే డబుల్ ఝలక్ తగిలింది. అయితే ఎలిస్ పెర్రీతో పాటు ఆఖర్లో రిచా ఘోష్ కళ్లు చెదిరే ఇన్నింగ్స్‌తో ఆదుకుంది. ఇన్నింగ్స్ తొలి రెండు బంతులను ఫోర్లుగా మలిచిన ఓపెనర్ మంధాన (9)తో పాటు మరో ఓపెనర్ వ్యాట్ హాడ్జ్ (4)లను గార్డ్‌నర్ పెవిలియన్‌కు చేర్చింది. ఈ దశలో 14/2 స్కోరుతో ఇబ్బందుల్లో పడిన జట్టును ఎలిస్ పెర్రీ, రాఘ్వి బిస్త్ (25) ఆదుకున్నారు. వీరి దూకుడుతో పవర్‌ప్లేలో జట్టు 51/2 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత కూడా అడపాదడపా బౌండరీలతో ఎలిస్ 27 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. కానీ స్కోరు 100కి చేరాక బిస్త్ వికెట్‌ను డాటిన్ పడగొట్టింది. దీంతో మూడో వికెట్‌కు 86 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక జోరు మీదున్న ఎలిస్‌ను 13వ ఓవర్‌లో పేసర్ సయాలి అవుట్ చేయడంతో ఆర్‌సీబీ తిరిగి కష్టాల్లో పడింది. అయితే 30 బంతుల్లో 60 రన్స్ కావాల్సిన వేళ 16వ ఓవర్‌లో రిచా విజృంభించింది. వరుసగా 4,6,4,4,4తో 23 రన్స్ రాబట్టడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. అటు సాధించాల్సిన రన్‌రేట్ కూడా భారీగా తగ్గింది. తర్వాతి ఓవర్‌లోనూ కనిక రెండు, రిచా ఓ ఫోర్‌తో 16 రన్స్ సమకూరాయి. ప్రియా మిశ్రా ఓవర్‌లోనూ చెలరేగిన రిచా 4,4,6తో 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేయగా.. సమీకరణం 12 బంతుల్లో 7కి మారడంతో ఆర్‌సీబీ సంబరాల్లో మునిగింది. ఓ భారీ సిక్సర్‌తో రిచా 19వ ఓవర్‌లోనే మ్యాచ్‌ను ముగించింది.

గార్డ్‌నర్, మూనీ హవా: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్ ఆరంభంలో ఓపెనర్ బెథ్ మూనీ, డెత్ ఓవర్లలో కెప్టెన్ అష్లే గార్డ్‌నర్ బెంగళూరుపై విరుచుకుపడ్డారు. ఓ దశలో 150 కూడా కష్టమే అనుకున్నా.. వీరిద్దరి ఆటతో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. పేసర్ రేణుకా సింగ్ మాత్రమే పరుగులను కట్టడి చేయగలిగింది. పవర్‌ప్లేలో కేవలం 39/1 స్కోరు సాధించిన జెయింట్స్‌ను మూనీ ఆదుకునే ప్రయత్నం చేసింది. పదో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో తను 37 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. అయితే కాసేపటికే తను పెవిలియన్‌కు చేరినా.. ఆ తర్వాత ఆర్‌సీబీ బౌలర్లకు గార్డ్‌నర్ చుక్కలు చూపించింది. 14వ ఓవర్‌లో వరుసగా మూడు సిక్సర్లతో 21 పరుగులు రాబట్టింది. అదే జోరులో 25 బంతుల్లోనే హాఫ్ సెంచరీ కూడా పూర్తి చేసుకుంది. అటు డాటిన్ (25) కూడా వేగంగా ఆడడంతో ఇద్దరి మధ్య నాలుగో వికెట్‌కు 31 బంతుల్లోనే 67 పరుగులు సమకూరడం విశేషం. 18వ ఓవర్‌లో సైతం గార్డ్‌నర్ మరో మూడు సిక్సర్లతో 20 రన్స్ రాబట్టింది. ఆఖరి ఓవర్‌లో హర్లీన్ (9 నాటౌట్) రెండు ఫోర్ల సహాయంతో గుజరాత్ డబ్ల్యూపీఎల్‌లో రెండోసారి 200 స్కోరును అందుకుంది.



కనికా అహూజా (13 బంతుల్లో 4 ఫోర్లతో 30 నాటౌట్)

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 201/5 (గార్డ్‌నర్ 79 నాటౌట్, మూనీ 56, డాటిన్ 25; రేణుకా సింగ్ 2/25).
బెంగళూరు: 18.3 ఓవర్లలో 202/4 (రిచా ఘోష్ 64 నాటౌట్, ఎలిస్ పెర్రీ 57, కనిక 30 నాటౌట్, బిస్త్ 25; గార్డ్‌నర్ 2/33).

1

లీగ్ చరిత్రలో అత్యధిక పరుగుల ఛేదన (202)ను పూర్తి చేసిన జట్టుగా ఆర్‌సీబీ.

డబ్ల్యూపీఎల్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (8) బాదిన ప్లేయర్‌గా సోఫీ డివైన్‌తో సంయుక్తంగా నిలిచిన గార్డ్‌నర్.

ఒకే ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (10) బాదిన రెండో జట్టుగా గుజరాత్. ఢిల్లీ (11) టాప్‌లో ఉంది.

2

డబ్ల్యూపీఎల్‌లో ఎక్కువ హాఫ్ సెంచరీలు (5) చేసిన రెండో బ్యాటర్‌గా హర్మన్, షఫాలీలతో సంయుక్తంగా నిలిచిన ఎలిస్ పెర్రీ. మెగ్ లానింగ్ (6) టాప్‌లో ఉంది.

ఆ క్రికెటర్ లగేజి 250 కిలోలు

లక్షలు చెల్లించిన బోర్డు

న్యూఢిల్లీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియాకు వెళ్లిన భారత బృందంలో ఓ స్టార్ క్రికెటర్ ఏకంగా 250 కిలోల లగేజీని తీసుకెళ్లడం చర్చనీయాంశమైంది. అతని లగేజీలో మొత్తం 27 బ్యాగులున్నాయట. అయితే ఇవన్నీ ఆటగాడికి సంబంధించినవే అనుకుంటే పొరపాటే. అతడి కుటుంబ సభ్యులు, వ్యక్తిగత సిబ్బంది లగేజిని కూడా తనదిగా చూపించి ఖర్చంతా బీసీసీఐపై వేశాడని సమాచారం. ఇందుకోసం బోర్డు లక్షల్లో ఖర్చు చేయాల్సి వచ్చింది. వాస్తవానికి బోర్డు నిబంధనల ప్రకారం ప్లేయర్ కుటుంబ సభ్యులు, అతని వ్యక్తిగత సహాయకుల లగేజీ వారి వెంటే ఉండాలి. కానీ ఆ క్రికెటర్ బోర్డుపై ఒత్తిడి తెచ్చి వాటన్నింటినీ తన సొంత లగేజీగా చూపించాడు. భారత్ నుంచి ఆసీస్‌కు, అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలోనే కాకుండా.. ఆసీస్‌లో వేదికలు మారినప్పుడు కూడా లగేజి ఖర్చును బోర్డు మీదే రుద్దాడు. అందుకే ఈ టూర్ పూర్తయ్యాక బీసీసీఐ నిబంధనలు కఠినతరం చేసింది. ఇప్పుడు ఏ ఆటగాడైనా 150 కిలోలకు మించి లగేజిని వెంట తీసుకెళ్లడానికి లేదు.

250 కిలోల లగేజీ ప్రయాణ ఖర్చులు బోర్డు నెత్తిన రుద్దిన ఆ స్టార్ ఆటగాడు ఎవరనేది మాత్రం వెల్లడికాలేదు. కానీ ఆ లగేజీలో 17 బ్యాట్లు ఉండడాన్ని బట్టి చూస్తే...అతను ఖచ్చితంగా ఓ బ్యాటర్ అని మాత్రం తెలుస్తోంది. అయితే భారత స్టార్లలో ఒకడైన రోహిత్ శర్మ భార్య రితిక బిడ్డకు జన్మనిచ్చినందున అతని కుటుంబ సభ్యులు ఆస్ట్రేలియా వెళ్లలేదు. ఇక మిగిలిన ఒకరిద్దరు స్టార్లలో ఆ లగేజీ స్టార్ ఎవరో?

క్వార్టర్స్‌లో అవుట్

ఆసియా మిక్స్‌డ్ బ్యాడ్మింటన్‌లో ముగిసిన భారత్ పోరు

కింగ్డావో (చైనా): ద్వితీయ శ్రేణి జట్టుతో బరిలోకి దిగిన భారత్‌కు ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో నిరాశే మిగిలింది. 2023 టోర్నీ కాంస్య పతక విజేత అయిన భారత్ క్వార్టర్‌ఫైనల్లో 0-3తో జపాన్ చేతిలో ఓటమిపాలై టోర్నీలో తన పోరాటాన్ని ముగించింది. మొదట మిక్స్‌డ్ డబుల్స్ పోరులో ధ్రువ్ కపిల/తనీషా జోడీ 13-21, 21-17, 13-21తో హిరోకి/సయిటో జంట చేతిలో ఓడగా, స్టార్ షట్లర్ సింధు గైర్హాజరీలో మహిళల సింగిల్స్‌లో పోటీపడ్డ మాళవిక 12-21, 19-21తో ప్రపంచ 8వ ర్యాంకర్ టొమొకా మియాజకి చేతిలో పరాజయం పాలైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో వెటరన్ స్టార్ హెచ్ఎస్ ప్రణయ్‌పై 21-14, 15-21, 21-12తో ప్రపంచ 16వ ర్యాంకర్ కెంటా నిషిమొటో గెలిచాడు. దీంతో వరుసగా మూడు ఓటములతో భారత్ పరాజయం ఖరారవడంతో నామమాత్రమైన మిగతా రెండు మ్యాచ్‌లను ఆడించలేదు.

ఐపీఎల్ మార్చి 22 నుంచి?

మే 25న ఫైనల్!

తొలి పోరులో కోల్‌కతా × బెంగళూరు ఢీ

న్యూఢిల్లీ: ఈ సీజన్ ఐపీఎల్ షెడ్యూల్‌ను పాలక మండలి ఖరారు చేసినట్టు తెలిసింది. కీలక మ్యాచ్‌లకు సంబంధించిన వివరాలను ఇప్పటికే ఆయా ఫ్రాంచైజీలకు బీసీసీఐ పంపినట్టు సమాచారం. త్వరలో పూర్తి వివరాలను వెల్లడించనుంది. ఖరారైన షెడ్యూల్ ప్రకారం..మార్చి 22న ఐపీఎల్ మొదలవనుంది. తొలి మ్యాచ్ డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా, బెంగళూరు మధ్య ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది. మరుసటిరోజు (మార్చి 23న) హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను రాజస్థాన్‌ను ఢీకొననుంది. ఫైనల్ పోరు మే 25న ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది. క్వాలిఫయర్-1, ఎలిమినేటర్‌కు హైదరాబాద్, క్వాలిఫయర్-2కు కోల్‌కతా ఆతిథ్యమివ్వనున్నాయి.



చాంపియన్ న్యూజిలాండ్

'ముక్కోణపు' ఫైనల్లో పాకిస్థాన్ ఓటమి

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీకి ముందు అత్యంత ఆత్మవిశ్వాసం లభించే విజయం న్యూజిలాండ్ అందుకుంది. ముక్కోణపు వన్డే సిరీస్ టైటిల్‌ను ఆ జట్టు దక్కించుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్లో ఆతిథ్య పాకిస్థాన్‌ను ఐదు వికెట్లతో కివీస్ ఓడించింది. తొలుత పాకిస్థాన్ 49.3 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రిజ్వాన్ (46), సల్మాన్ ఆఘా (45), తయ్యబ్ (38) రాణించారు. ఒరోర్క్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో న్యూజిలాండ్ 45.2 ఓవర్లలో 243/5 స్కోరు చేసి నెగ్గింది. మిచెల్ (57), లాథమ్ (56), కాన్వే (48) అదరగొట్టారు. నసీమ్ షా రెండు వికెట్లు తీశాడు.

బిజినెస్

17 ఏళ్ల తర్వాత లాభాల్లోకి బీఎస్ఎన్ఎల్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ రూ.262 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. బీఎస్ఎన్ఎల్ లాభాల్లోకి మళ్లడం దాదాపు 17 ఏళ్లలో ఇదే తొలిసారని, కంపెనీకిది కీలక మలుపు అని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. బీఎస్ఎన్ఎల్ పలు అంశాల్లో తన పనితీరును మెరుగుపరుచుకుందన్నారు. మొబిలిటీ, ఎఫ్‌టీటీహెచ్, లీజ్డ్ లైన్ సేవల్లో 14-18 శాతం వృద్ధి కనబరిచిందని, జూన్ నాటికి 8.4 కోట్లుగా ఉన్న కస్టమర్లను సైతం డిసెంబరు చివరినాటికి 9 కోట్లకు పెంచుకోగలిగిందన్నారు. చివరిసారిగా 2007లో లాభాలను నమోదు చేసుకున్న కంపెనీ.. ఆ తర్వాత వరుస నష్టాలు, ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ వచ్చింది.

జనవరి ద్రవ్యోల్బణం 2.31%

న్యూఢిల్లీ: దేశంలో ఆహార వస్తువులు.. ప్రత్యేకించి కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం జనవరిలో 2.31 శాతానికి దిగివచ్చింది. గత డిసెంబరులో ఇది 2.37 శాతం ఉంది. ఆహార వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం డిసెంబరులో 8.47 శాతంతో పోల్చితే 5.88 శాతానికి తగ్గింది. కూరగాయల విభాగంలో ద్రవ్యోల్బణం 28.65 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గింది.

చంద్రశేఖరన్‌కు నైట్‌హుడ్ అవార్డు

న్యూఢిల్లీ: టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌కు బ్రిటన్ గౌరవ నైట్‌హుడ్ అవార్డు అందచేసింది. భారత-బ్రిటన్ వ్యాపార సంబంధాల పటిష్ఠతకు కృషి చేసినందుకుగాను చంద్ర ఈ అవార్డును కింగ్ చార్లెస్ నుంచి అందుకున్నట్టు టాటా గ్రూప్ ఒక ఎక్స్ పోస్టులో తెలిపింది. చంద్ర దీనికి స్పందిస్తూ.. తమ గ్రూప్‌కి అందిస్తున్న ప్రోత్సాహానికి బ్రిటిష్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. యూకేలో తమ గ్రూప్ కార్యకలాపాలు మరింత పటిష్ఠం చేసేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సుంకాల యుద్ధం మరింత తీవ్రం

పరస్పర సుంకాలకు ట్రంప్ గ్రీన్‌సిగ్నల్ ▶▶ భారత్‌పైనా తీవ్ర ప్రభావం ▶▶ ఇప్పటికే 'బేర్'మంటున్న స్టాక్ మార్కెట్

మున్ముందు మరింత డౌన్‌ట్రెండ్ ఉండే చాన్స్

కన్నుకి కన్ను.. పన్నుకి పన్ను. ఇదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నూతన వాణిజ్య విధానం. 'ఏ దేశంతో ఎంత దోస్తానా ఉన్నా.. వాణిజ్యంలో మాత్రం అది కుదరదు. మా ఉత్పత్తులపై మీరు ఎంత సుంకం విధిస్తే, మీ ఉత్పత్తులపై మేమూ అంతే (రెసిప్రోకల్) సుంకాలు విధిస్తాం. ఇది కూడా కాదని వాణిజ్యేతర రక్షణ విధానాలతో మా ఎగుమతులను కట్టడి చేస్తే, మీ ఎగుమతులపై మేమూ అదే పని చేస్తాం' అని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నా బెస్ట్ ఫ్రెండ్ అని చెప్పే ట్రంప్.. ఈ పరస్పర సుంకాల విషయాన్ని ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న మోదీ సమక్షంలోనే ప్రకటించడం విశేషం. ఏప్రిల్ 2 నుంచి ఈ కొత్త సుంకాల అమలు ప్రక్రియ ప్రారంభమవుతుందని అమెరికా నూతన వాణిజ్య మంత్రిగా నియమితులైన హోవార్డ్ లుట్నిక్ ప్రకటించారు.

పరస్పర సుంకాలు అంటే?

ఒక దేశం ఇంకో దేశం నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులపై ఎంత సుంకం విధిస్తుందో, ఆ దేశం నుంచి ఎగుమతయ్యే వస్తువులపై అవతలి దేశమూ అంతే సుంకం విధించడాన్ని పరస్పర సుంకాలు అంటారు. ఉదాహరణకు అమెరికా నుంచి దిగుమతయ్యే ఆటోమొబైల్స్‌పై చైనా 25 శాతం దిగుమతి సుంకం విధిస్తే, అమెరికా కూడా చైనా నుంచి దిగుమతయ్యే ఆటోమొబైల్స్‌పై అదే స్థాయిలో 25 శాతం దిగుమతి సుంకం విధిస్తుంది. ఇలా చేయకపోబట్టే ఇతర దేశాలు తమ ఉత్పత్తులను చౌకగా అమెరికా మార్కెట్లో కుమ్మరిస్తూ, తమ మార్కెట్లలో మాత్రం అధిక సుంకాలు లేదా వాణిజ్యేతర ఆంక్షలతో అమెరికా ఎగుమతులను అడ్డుకుంటున్నాయని ట్రంప్ ఆరోపణ. దీనికి చెక్ పెట్టాలంటే ఈ సుంకాలు తప్పవని ట్రంప్ మొదటి నుంచి చెబుతూనే ఉన్నారు. అధికారం చేపట్టి నెలైనా తిరక్కుండానే అందుకు శ్రీకారం చుట్టారు.

దారికొస్తున్న దేశాలు

ఈ హెచ్చరికలు ఫలిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈయూతో సహా అనేక దేశాలు 'ట్రంప్ మహాశయా, నీతో పెట్టుకోం. చర్చల ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకుందాం' అని ఇప్పటికే సంకేతాలు పంపించాయి. పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా చైనా కూడా ఏదోలా ట్రంప్‌తో వాణిజ్య సంధికే ప్రయత్నిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ కూడా ఇదే పనిలో ఉన్నారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అమెరికా నుంచి దిగుమతయ్యే హార్లే డేవిడ్‌సన్ బైక్స్‌పై మన దేశం ఇప్పటికే సుంకాలను భారీగా తగ్గించింది. వాణిజ్య లోటు తగ్గించేందుకు మరిన్ని అమెరికా వస్తువులపై దిగుమతి సుంకాలు తగ్గించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు సమాచారం. దీంతోపాటు పెద్దఎత్తున అమెరికా ఆయుధాలు, చమురు, ఎల్ఎన్‌జీ దిగుమతులకూ సై అనబోతోంది.



మనకూ నష్టమే..

ట్రంప్ సుంకాల ప్రభావం మన దేశంపైనా పడనుంది. కాకపోతే అది చైనా, జపాన్, ఈయూ దేశాలపై ఉన్నంత తీవ్రంగా ఉండకపోవచ్చని నిపుణుల అంచనా. గత ఏడాది భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 19,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.16.49 లక్షల కోట్లు) చేరింది. ఇందులో దాదాపు 5,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.4.34 లక్షల కోట్లు) మన దేశానికి మిగులు ఉంది. అమెరికా మొత్తం ఎగుమతి, దిగుమతుల్లో మన వాటా అంతంత మాత్రమే. అయితే మన దేశానికి చెందిన కొన్ని రంగాలు ట్రంప్ సుంకాలతో దెబ్బతింటాయని భావిస్తున్నారు. అవేమిటంటే.

ఫార్మా

భారత ఫార్మాకు అమెరికా అతిపెద్ద మార్కెట్. గత ఏడాది మన ఫార్మా కంపెనీలు ఆ దేశానికి దాదాపు రూ.72,300 కోట్ల విలువైన ఔషధాలు ఎగుమతి చేశాయి. ఇందులో జెనరిక్ మందులదే అత్యధిక వాటా. ఇప్పుడు ఈ సుంకాలతో అమెరికాకు మన ఫార్మా ఎగుమతులు దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. శుక్రవారం నాట్కో, లారస్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వంటి దిగ్గజ ఫార్మా కంపెనీల షేర్లు భారీగా నష్టపోవడానికి ట్రంప్ సుంకాలే ప్రధాన కారణం.

టెక్స్‌టైల్స్

మన వస్త్ర పరిశ్రమ ఎగుమతులకూ అమెరికానే ప్రధాన కారణం. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, బంగ్లాదేశ్ పరిణామాలతో అనేక అమెరికా టెక్స్‌టైల్ కంపెనీలు మన దేశం నుంచి దిగుమతులు పెంచాయి. ట్రంప్ పరస్పర సుంకాలతో దీనికి బ్రేక్ పడే ప్రమాదం కనిపిస్తోంది.

ఐటీ ఎగుమతులు

మన ఐటీ ఎగుమతులకూ అమెరికానే అతిపెద్ద మార్కెట్. ట్రంప్ సుంకాల ప్రభావం నేరుగా మన ఐటీ ఎగుమతులపై ఉండకపోయినా, ఆ ఉద్రిక్తతల ప్రభావం మాత్రం మన ఐటీ పరిశ్రమపై బాగానే ఉంటుంది. ట్రంప్ తొలిసారిగా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తెచ్చిన హెచ్-1బీ వీసా నిబంధనలు, ఆ దేశంలో మన ఐటీ నిపుణుల ఉద్యోగ అవకాశాలను బాగా దెబ్బతీశాయి. ఇప్పుడు ఈ దుందుడుకు నిర్ణయాల ప్రభావం ఐటీ కంపెనీలపైనా కొద్దో గొప్పో పడక తప్పదు.

స్టీల్ పరిశ్రమ

అమెరికా మొత్తం స్టీల్ దిగుమతుల్లో మన వాటా 5 శాతానికంటే తక్కువే. అయినా డొనాల్డ్ ట్రంప్ మన దేశాన్నీ చైనా, కెనడా, మెక్సికో, బ్రెజిల్‌లా ఒకే గాటన కట్టేసి 25 శాతం సుంకం విధించారు. దీంతో టాటా స్టీల్, సెయిల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ వంటి కంపెనీల లాభాలకు ఇప్పటికే గండిపడి స్టాక్ మార్కెట్లో ఆ కంపెనీల షేర్లు కుదేలవుతున్నాయి. ట్రంప్ సుంకాలతో చైనా తన మిగులు స్టీల్‌ను భారత మార్కెట్లోకి డంప్ చేసే ప్రమాదం మరింత పెరిగిందని పరిశ్రమ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

ఆరేళ్లలో రూ.100 కోట్ల పెట్టుబడులు

ఎన్‌సీఎల్ వేకాలో 50% వాటా కొనుగోలు

జర్మనీ సంస్థ వేకా వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జర్మనీకి చెందిన యూపీవీసీ ఉత్పత్తుల తయారీ సంస్థ వేకా.. భారత్‌లో ఎన్‌సీఎల్ లిమిటెడ్ భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌సీఎల్ వేకాలో వంద శాతం యాజమాన్య హక్కులను చేజిక్కించుకుంది. ఈ భాగస్వామ్య సంస్థలో వేకాకు 50 శాతం వాటాతో పాటు ఎన్‌సీఎల్, ఇతర వాటాదారులకు మరో 50 శాతం వాటాలున్నాయి. వ్యూహాత్మక టేకోవర్‌లో భాగంగా ఈ సంస్థలో ఎన్‌సీఎల్ సహా ఇతర వాటాదారుల నుంచి మిగిలిన 50 శాతం వాటాలను కొనుగోలు చేసినట్లు వేకా ఏజీ జర్మనీ సీఈఓ అండ్రెస్ హార్ట్‌లీఫ్ వెల్లడించారు. అయితే ఈ వాటాల కొనుగోలు కోసం ఎంత మొత్తం వెచ్చించారనేది మాత్రం ఆయన వెల్లడించలేదు. ఈ కొనుగోలుతో అంతర్జాతీయ, భారతీయ మార్కెట్లలో కంపెనీ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటుందన్నారు. ప్రస్తుతం కంపెనీ హైదరాబాద్ సమీపంలోని నర్సాపూర్ వద్ద ప్లాంట్‌ను నిర్వహిస్తోంది. ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 28,000 టన్నులు. కాగా వచ్చే ఆరేళ్ల కాలంలో విస్తరణ కోసం రూ.100 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ ఎండీ యుఎస్ మూర్తి చెప్పారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది రూ.16 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు మూర్తి తెలిపారు.

అష్ట నష్టాలు

8 రోజుల్లో రూ.25 లక్షల కోట్లు ఉఫ్

2,645 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్

ముంబై: భారత స్టాక్ మార్కెట్‌పై బేర్ పట్టు బిగించింది. ట్రంప్ సుంకాల పోటు, తరలిపోతున్న విదేశీ సంస్థాగత పెట్టుబడులతో పాటు నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాల కారణంగా ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా 8వ రోజూ నష్టాల్లో పయనించాయి. శుక్రవారం సెన్సెక్స్ 76,000, నిఫ్టీ 23,000 స్థాయిలను కోల్పోయాయి. సెన్సెక్స్ 199.76 పాయింట్లు క్షీణించి 75,939.21 వద్దకు జారుకుంది. నిఫ్టీ 102.15 పాయింట్ల నష్టంతో 22,929.25 వద్ద ముగిసింది. చిన్న, మధ్య స్థాయి కంపెనీల ప్రాతినిధ్య సూచీలైన బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఏకంగా 3.24 శాతం, మిడ్‌క్యాప్ 2.59 శాతం నష్టపోయాయి. కాగా, గడిచిన 8 ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,644.6 పాయింట్లు (3.36 శాతం), నిఫ్టీ 810 పాయింట్లు (3.41 శాతం) పతనమయ్యాయి. ఎనిమిది రోజుల్లో రూ.25.31 లక్షల కోట్ల మార్కెట్ సంపద హరించుకుపోయింది. దాంతో బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.400.19 లక్షల కోట్లకు (4.61 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

ఐపీఓకు యశోద హాస్పిటల్స్

రూ.4,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం

ముంబై: హైదరాబాద్‌కు చెందిన యశోద హాస్పిటల్స్ కూడా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు వచ్చే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఓ ద్వారా రూ.4,000 కోట్ల వరకు సమీకరించేందుకు ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, కంపెనీ విలువ తదితర అంశాలపై ఈ హాస్పిటల్ నెట్‌వర్క్.. బ్యాంకర్లతో ప్రాథమిక చర్చలు జరుపుతున్నట్లు ఎకనామిక్స్ టైమ్స్ కథనం పేర్కొంది. ఐపీఓలో భాగంగా తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ఇన్వెస్టర్లు కొంత వాటాను ఉపసంహరించుకునే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం యశోద హాస్పిటల్స్ మొత్తం 4,000 పడకల సామర్థ్యంతో కూడిన నాలుగు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు 4 హార్ట్ ఇన్‌స్టిట్యూట్లు, 4 క్యాన్సర్ కేర్ ఇన్‌స్టిట్యూట్లను నిర్వహిస్తోంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	111
వరంగల్	103	గుంటూరు	110
కరీంనగర్	103	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	80
కర్నూలు	103	నెల్లూరు	85
విశాఖపట్నం	103	అనంతపురం	85
గోదావరి	111		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	450
వరంగల్	442	గోదావరి	455
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		దజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,160 ▲	79,900 ▲	1,08,000 ▲
విజయవాడ	88,700 ▲	82,500 ▲	98,300 ▲
విశాఖపట్నం	86,150 ▼	78,970 ▼	98,120 ▲
రాజమండ్రి	87,160 ▲	79,900 ▲	99,900 ▲
ప్రొద్దుటూరు	88,700 ▲	82,140 ▲	97,900 ▲
ముంబై	85,998 ▲	78,774 ▲	97,953 ▲

తగ్గేదే లే!


వైట్ హౌస్‌లో ప్రధాని మోదీ కుర్చీలో నుంచి లేస్తుండగా ఆ కుర్చీని వెనక్కి జరుపుతున్న ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

మోదీకి ట్రంప్ 'అవర్ జర్నీ టుగెదర్' పేరిట.. తమ ఇద్దరి ఫొటోలతో కూడిన పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు. దానిపై "మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, యు ఆర్ గ్రేట్ (మీరు చాలా గొప్ప)' అని రాసి సంతకం పెట్టారు. ట్రంప్ మొదటి సారి అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మోదీ అక్కడ పర్యటించినప్పటి ఫొటోలు, ట్రంప్ భారత్‌కు వచ్చినప్పుడు ఇక్కడ మోదీతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఫొటోలూ అందులో ఉన్నాయి. కుశలప్రశ్నలు, పరస్పర పొగడ్తల అనంతరం.. ఇరువురు నేతలూ వాణిజ్యం, దౌత్యం, రక్షణ, ఇంధన భద్రత, హెచ్1బీ వీసాలు, వలస విధానం, కృత్రిమ మేధ, నవకల్పనలు, తదుపరి తరం టెక్నాలజీలు సహా పలు రంగాలకు సంబంధించిన కీలక అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. ఇరు దేశాల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న పలు అంతర్జాతీయ అంశాలు కూడా వారి భేటీలో ప్రస్తావనకు వచ్చాయి. అనంతరం వైట్‌హౌస్‌లోని ఈస్ట్ రూమ్‌లో నిర్వహించిన 44 నిమిషాల సంయుక్త పత్రికా సమావేశంలో ఇద్దరు నేతలూ మాట్లాడారు. భేటీలో తాము తీసుకున్న పలు నిర్ణయాల గురించి వెల్లడిస్తూ సంయుక్త ప్రకటన చేశారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య 500 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యంగా 'మిషన్ 500' ప్రకటించారు. 'యూఎస్-ఇండియా 123 పౌర అణు ఒప్పందం' అమలుకు కట్టుబడి ఉన్నామని ఇరువురు నేతలూ వెల్లడించారు. అమెరికా, ఇండియాల మధ్య అంతరిక్ష రంగంలో సహకారానికి సంబంధించి 2025 మార్గదర్శిగా నిలవబోతోందని.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తొలి భారతీయ వ్యోమగామిని పంపడానికి నాసా-ఇస్రో కలిసి పనిచేస్తాయని వెల్లడించారు. అంతరిక్ష పరిశోధనల్లో ఇరు దేశాలూ సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. డిఫెన్స్, ఏఐ, క్వాంటమ్, బయోటెక్నాలజీ, స్పేస్ తదితర రంగాలకు సంబంధించి కీలకమైన, అత్యంత అధునాతన పరిజ్ఞానాలపై కలిసి పని చేసేలా.. 'ట్రాన్స్‌ఫార్మింగ్ ద రిలేషన్‌షిప్ యుటిలైజింగ్ స్ట్రాటజిక్ టెక్నాలజీ (ట్రస్ట్)' అనే కార్యక్రమాన్ని ప్రకటించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రత సహకారాన్ని పెంపొందించుకోవాలనే నిర్ణయానికి వచ్చారు.

ట్రంప్ అలా.. మోదీ ఇలా..

భారత్ అధిక సుంకాలు విధిస్తే తామూ విధిస్తామంటూ సంయుక్త పత్రికా సమావేశంలో ట్రంప్ కుండబద్దలు కొడితే.. అదే వేదికపై, ట్రంప్ సాక్షిగా.. అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను తిరిగి తీసుకోవడానికి భారత్ సిద్ధంగా ఉన్నదని మోదీ ప్రకటించారు. అమెరికాతో భారత్‌కు 50 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉందని.. దాన్ని పూడ్చడానికి భారత్ అమెరికా నుంచి మరింతగా చమురు, గ్యాస్, మిలటరీ హార్డ్‌వేర్‌ను కొనుగోలు చేస్తుందని ట్రంప్ తెలిపారు. ఈమేరకు ప్రధాని మోదీ, తాను ఒక ఒప్పందానికి వచ్చామని.. దీనివల్ల భారత్‌కు అమెరికా నంబర్ వన్ ఆయిల్, గ్యాస్ సరఫరాదారుగా నిలుస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. అమెరికాకు చెందిన కొన్ని ఉత్పత్తులపై సుంకాలను తగ్గించడంతోపాటు, అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను అనుమతిస్తూ న్యూఢిల్లీ ఇటీవల తీసుకున్న చర్యలను కొనియాడారు. ఇరు దేశాలూ రక్షణ భాగస్వామ్యాన్ని కూడా మరింత విస్తరించుకోవాలని నిర్ణయించినట్టు తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది నుంచి భారతదేశానికి రక్షణ ఉత్పత్తుల విక్రయాలను వందల కోట్ల డాలర్ల మేర పెంచుతామని.. అంతిమంగా ఎఫ్-35 స్టెల్త్ ఫైటర్లను కూడా విక్రయించేందుకు మార్గం సుగమం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే, మునుపెన్నడూ లేని విధంగా.. ప్రపంచవ్యాప్తంగా రాడికల్ ఇస్లామిక్ తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు భారత్, అమెరికా కలిసి పనిచేస్తాయని ట్రంప్ ప్రకటించారు. ప్రపంచంలోని అత్యంత దుష్టులలో ఒకడు.. 2008 నవంబరు 26న ముంబైపై జరిగిన దాడి సూత్రధారుల్లో కీలక వ్యక్తి అయిన తహవ్వుర్ రాణాను భారత్‌కు తక్షణమే అప్పగించనున్నట్టు ట్రంప్ వెల్లడించారు. "అతడు చట్టం ముందు నిలబడడానికి ఇండియాకు వెళ్తున్నాడు" అని పేర్కొన్నారు. అంతేనా.. భారత్ నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు త్వరలో మరికొంతమందిని కూడా అప్పగిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. ఇక.. పౌర-అణు ఇంధన రంగంలో కూడా ఇరు దేశాల మధ్య సానుకూల కదలిక వచ్చిందని.. అమెరికా అణు పరిజ్ఞానాన్ని భారత మార్కెట్లలోకి ఆహ్వానించేందుకు ఇండియా తన చట్టాలను సంస్కరిస్తోందని ప్రెసిడెంట్ ట్రంప్ పేర్కొన్నారు. భారత్-చైనా సంబంధాలపై విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు.. ఇరు దేశాల మధ్య సరిహద్దు సంఘర్షణలను తాను గమనిస్తున్నట్టు చెప్పారు. అయితే, ఆ ఘర్షణను ఆపడానికి తాను ఏమైనా సాయం చేయగలిగితే ఆనందంగా చేస్తానన్నారు. చైనా, భారత్, అమెరికా, రష్యా కలిసికట్టుగా ముందుకెళ్లాలన్నది తన కోరిక అని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారత్-మధ్యప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ గురించి ప్రశ్నించగా.. చరిత్రలోనే అత్యంత గొప్ప వాణిజ్య మార్గాల్లో ఒకదాన్ని నిర్మించడానికి కలిసి పనిచేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.


వైట్‌హౌస్‌లోని ఈస్ట్ రూమ్‌లో ఇరుదేశాల విలేకరుల సమావేశంలో ట్రంప్ భుజం తడుతున్న ప్రధాని మోదీ

ట్రంప్ నుంచి నేర్చుకున్నది అదే..

ట్రంప్‌ను మరోసారి అమెరికా అధ్యక్షుడిగా శ్వేతసౌధంలో చూడడం ఆనందంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు జాతీయ (అమెరికా) ప్రయోజనాలే ముఖ్యమని, ఆయన్నుంచి తాను నేర్చుకున్నది అదేనని కొనియాడారు. ట్రంప్‌లాగానే తాను కూడా భారత దేశ ప్రయోజనాలనే అన్నింటికన్నా ముఖ్యంగా భావిస్తానని పేర్కొన్నారు. రక్షణ రంగానికి సంబంధించి రెండు దేశాలూ వచ్చే దశాబ్దకాలంపాటు పరస్పర సహకారంతో పనిచేస్తాయని.. ఇరు దేశాల మధ్య సహకార సంబంధాలు మరింత మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ తొలివిడత పాలన సమయంతో పోలిస్తే ఇప్పుడు రెట్టింపు వేగంతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని.. అంటే 500 బిలియన్ డాలర్లకు చేర్చాలన్న ఉమ్మడి లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు వెల్లడించారు. ఈమేరకు ఇరుదేశాలకూ ప్రయోజనకరంగా ఉండే ఒప్పందాన్ని రూపొందించేందుకు ఇరు దేశాల యంత్రాంగాలూ కృషి చేస్తాయని తెలిపారు. అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను వెనక్కి తీసుకోవడానికి అంగీకరిస్తున్నట్టు చెప్పారు. అయితే.. అలా అక్రమంగా ఉంటున్నవారంతా సాధారణ కుటుంబాలకు చెందినవారేనని, వారందరికీ ఎన్నో కలలు ఉంటాయని.. కొందరి మాటలు విని తప్పుదోవన అమెరికాకు వచ్చి ఉంటారని మోదీ వివరించారు. అలా మానవ అక్రమ రవాణాకు పాల్పడే వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని.. అందుకు ఇరు దేశాలూ కలిసి పనిచేయాలని అభిప్రాయపడ్డారు (అమెరికా ఇప్పటికే అలా 104 మంది అక్రమ వలసదారులను భారత్‌కు పంపిన సంగతి తెలిసిందే. అలా పంపిస్తున్నవారికి సంకెళ్లు వేసి పంపించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. త్వరలో మరికొందరు భారతీయులను రెండు విమానాల్లో పంపేందుకు అమెరికా సిద్ధమైంది. ఈ నేపథ్యంలో.. వారికి సంకెళ్లు వేసి పంపే విషయమై ట్రంప్-మోదీ మధ్య ఎలాంటి చర్చా జరిగినట్టు సమాచారం లేదు. సంయుక్త పత్రికా సమావేశంలో కూడా దీనిపై ఎవరూ ప్రశ్నించకపోవడం గమనార్హం). ఒక దేశంలో అక్రమంగా ప్రవేశించే వ్యక్తికి అక్కడ నివసించే హక్కు ఉండదని.. ఇది ప్రపంచంలో ఎవరికైనా వర్తిస్తుందని మోదీ స్పష్టం చేశారు. అలాగే.. తహవ్వుర్ రాణాను భారత్‌కు అప్పగించాలనే నిర్ణయం తీసుకున్నందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భారత కోర్టులు అతడికి తగిన శిక్ష విధిస్తాయని పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపే పరిష్కారమార్గాల దిశగా ట్రంప్ చేస్తున్న కృషికి తన మద్దతు ఉందని మోదీ పేర్కొన్నారు. "ఎందుకో.. ఈ యుద్ధం విషయంలో భారత్ తటస్థ వైఖరి అవలంబిస్తోందని ప్రపంచం అనుకుంటోంది. కానీ, వాస్తవానికి భారతదేశం ఈ యుద్ధం విషయంలో 'శాంతి' వైపు ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై తాను ఇరు దేశాల నేతలనూ కలిసి మాట్లాడినట్టు చెప్పారు. గతంలో తాను పుతిన్‌ను కలిసినప్పుడు.. ఇది యుద్ధాల యుగం కాదని, సమస్యలకు పరిష్కారాలను యుద్ధరంగంలో కనుగొనలేమని.. చర్చల ద్వారానే శాంతి సాధ్యమని చెప్పినట్టు వెల్లడించారు. ఢిల్లీలో జరగనున్న క్వాడ్ నేతల సమావేశంలో ట్రంప్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి ఎదురుచూస్తున్నట్టు ప్రధాని మోదీ తెలిపారు. 2020లో ట్రంప్ భారత పర్యటనను భారతీయులు ఇప్పటికీ గుర్తుచేసుకుంటారని పేర్కొన్నారు. "మీరు మళ్లీ వస్తారని వారంతా ఎదురుచూస్తున్నారు. 140 కోట్ల మంది భారతీయుల తరఫున నేను మిమ్మల్ని ఇండియాకు ఆహ్వానిస్తున్నా" అన్నారు. కాగా, ట్రంప్‌తో సమావేశానికి ముందు ప్రధాని మోదీ అమెరికా జాతీయ భద్రత సలహాదారు మైక్ వాల్ట్స్, ఆ దేశ జాతీయ నిఘా సంస్థ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్, టెక్ బిలియనీర్, స్పేస్ ఎక్స్ చీఫ్ ఈలన్ మస్క్, రిపబ్లికన్ లీడర్ వివేక్ రామస్వామితో విడివిడిగా భేటీ అయ్యారు. ఇక, ట్రంప్‌తో జరిగిన అద్భుతమైన సమావేశం.. ఇరు దేశాల మధ్య స్నేహానికి గణనీయమైన ఊరవడినిస్తుందని పేర్కొంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ట్రంప్‌తో భేటీ అనంతరం అమెరికా నుంచి భారత్‌కు ఆయన తిరిగొచ్చారు.

అమెరికాలో మరో రెండు కాన్సులేట్లు

భారతదేశం త్వరలోనే అమెరికాలోని బోస్టన్, లాస్‌ఏంజెలెస్ నగరాల్లో రెండు దౌత్యకార్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఇరు దేశాల ప్రజల మధ్య బంధాలను ఈ కాన్సులేట్లు బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయ సమాజం రెండు దేశాలనూ కలిపే అత్యంత కీలకమైన బంధమని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే.. భారత్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ప్రారంభించాల్సిందిగా అమెరికన్ యూనివర్సిటీలను కోరినట్టు మోదీ తెలిపారు. కాగా, అమెరికాలో ఏర్పాటు చేయబోయే రెండు కాన్సులేట్ల గురించి గత ఏడాది సెప్టెంబరులో న్యూయార్క్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మోదీ ప్రకటించడం గమనార్హం.


ట్రంప్‌తో చర్చల సమయంలో ఆయన వెంట భారత విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్

మీ ఇంగ్లిష్ యాస అర్థం కావడం లేదు

భారతీయ విలేకర్ల ప్రశ్నలు దాటేసిన ట్రంప్

- అనువాదకులతో సాఫీగా సాగిన మోదీ ప్రసంగం


అవర్ జర్నీ టుగెదర్ పుస్తకంలో 'హౌడీ మోదీ' ఫొటోలను చూస్తున్న ట్రంప్, ప్రధాని మోదీ

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: ప్రధాని మోదీతో నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో భారతీయ విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ట్రంప్.. భాష అర్థం కావడం లేదంటూ సమాధానాలు దాటవేశారు. అమెరికా గడ్డ మీద భారత్‌కు వ్యతిరేకంగా గళమెత్తుతున్న వర్గాలను దేశంలో కొనసాగనిస్తారా? అని విలేకరి ప్రశ్నించారు. ఉగ్రవాది తహవ్వుర్ రాణాను భారత్ పంపించాలన్న ట్రంప్ నిర్ణయాన్ని భారతీయులు స్వాగతిస్తారని కూడా విలేకరి చెప్పారు. కాస్త గట్టిగా మాట్లాడాలని ట్రంప్ సదరు విలేకరిని కోరారు. విలేకరి మరోసారి అదే ప్రశ్నను అడుగుతుండగా ట్రంప్ మధ్యలో కలుగజేసుకున్నారు. ఆయన చెప్పేది ఒక్క ముక్క అర్థం కావడం లేదన్నారు. విలేకరి యాస అర్థం చేసుకోవడం కాస్త కష్టంగా ఉందని చెప్పారు. ఖలిస్థానీ ఉగ్రవాదుల అణచివేతలో అమెరికా భారత్‌కు ఎలా సహకరించబోతోందో చెప్పాలని మరో విలేకరి అడిగారు. భారతదేశంలో వందకు పైగా కేసులను ఎదుర్కొంటున్న ఉగ్రవాది పన్నూన్‌ను దృష్టిలో పెట్టుకొని విలేకరి ఈ ప్రశ్న అడిగారు. బైడెన్ ప్రభుత్వంలో భారత నిఘా సంస్థలపై పలు ఆరోపణలు చేశారని, ఇప్పుడు తులసీ గబ్బార్డ్ నేతృత్వంలోని అమెరికా నిఘా విభాగం దీన్ని ఎలా చూస్తుందని అదే విలేకరి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకూ ట్రంప్ సమాధానం దాటేశారు. రాణాను అప్పగించడంపై ట్రంప్ స్పందిస్తూ, అత్యంత హింసాత్మక వ్యక్తిని తక్షణమే భారత్‌కు అప్పగిస్తున్నామని తెలిపారు. ఇంకా చాలా మంది ఉగ్రవాదులను దేశం నుంచి పంపించనున్నామని, ఈ మేరకు భారత్ నుంచి పలు విజ్ఞప్తులు వచ్చాయని వివరించారు. ట్రంప్ సమాధానాలు దాటవేసిన వ్యవహారంపై సోషల్ మీడియా సరదాగా స్పందించింది. ఉత్తర భారతీయ జర్నలిస్టు ఇంగ్లిష్ అర్థం కాక ట్రంప్ దుబాసీని పెట్టుకుంటే దక్షిణ భారతదేశంలో మూడో తరగతి పిల్లాడికి కూడా అర్థమయ్యే ట్రంప్ ఇంగ్లిష్ అర్థం కాక ప్రధాని మోదీ మరో దుబాసీని పెట్టుకున్నారని ఒక నెటిజన్ వ్యాఖ్యానించారు. విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీకి భాషా సమస్య ఎదురవలేదు. హిందీలో, ఇంగ్లిష్‌లో అనువాదం చేయడానికి ఆయన ఇద్దరు ట్రాన్స్‌లేటర్లను పక్కనే పెట్టుకోవడంతో ఇబ్బంది లేకుండా మాట్లాడారు.

అదానీ అంశం వ్యక్తిగతం

- ట్రంప్‌తో చర్చించే విషయం కాదది: మోదీ
- మోదీ వ్యాఖ్యల్ని తప్పుబట్టిన రాహుల్
- అమెరికాలోనూ అదానీని రక్షిస్తున్నారని ఫైర్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 : వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదైన అవినీతి కేసు గురించి భారత్ ప్రధాని నరేంద్రమోదీని అక్కడ మీడియా ప్రశ్నించింది. అదానీ కేసు విషయం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చర్చించారా అని ప్రశ్నించగా, రెండు దేశాల అధినేతలు కలుసుకున్నప్పుడు వ్యక్తిగత అంశాలు చర్చకు రావని మోదీ సమాధానమిచ్చారు. "భారతదేశం ప్రజాస్వామ్యదేశం. విశ్వాన్నంతా కుటుంబంగా భావించే వసుదైక కుటుంబం అనే భావనే మా సంస్కృతికి, తాత్వికతకు, ఆలోచనలకు మూలం. ప్రతి భారతీయుడూ నా కుటుంబసభ్యుడే. ఇక వ్యక్తిగత విషయాలకు వస్తే, రెండు దేశాలకు చెందిన ఇద్దరు నాయకులు వ్యక్తిగత అంశాలపై చర్చించేందుకు కలుసుకోరు" అని మోదీ వివరించారు. మోదీ సమాధానం హిందీలో ఉండటంతో వ్యక్తిగత్ అనే మాటను వైట్‌హౌస్ అనువాదకుడు వ్యక్తిగతం అంటూ అనువదించారు. అయితే, హిందీలో ఈ మాటకు ప్రైవేటు, అంతర్గతం అనే అర్థాలు కూడా ఉన్నాయి. అంతకుముందు..ఇదే ప్రశ్న ట్రంప్‌ను అడగ్గా, ఆయన స్పందించలేదు. కాగా, మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. దేశంలోనే కాకుండా, అమెరికాలోనూ అదానీని మోదీ రక్షిస్తున్నారని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. "ఇక్కడ అడిగితే మోదీ మౌనంగా ఉంటారు. అక్కడ అడిగితే వ్యక్తిగత విషయం అంటూ దాటవేస్తున్నారు" అని 'ఎక్స్'లో హిందీలో రాహుల్ ట్వీట్ చేశారు. అదానీ అనే మాట వినగానే మోదీ ముఖం మాడిపోయిందని, పొంతన లేని విషయాలేవో మాట్లాడారని కాంగ్రెస్‌కు చెందిన మరో నేత జైరామ్ రమేశ్ విమర్శించారు. మరోవైపు, భాషతో సంబంధం లేకుండా చెప్పాలనుకున్న విషయాన్ని పార్లమెంటులో బలంగా ముందుపెట్టాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు రాహుల్ సూచించారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన కాంగ్రెస్ ఎంపీలతో సమావేశమయ్యారు. పార్లమెంటులో హిందీ లేక ఇంగ్లిష్‌లో మాట్లాడాలనే పట్టింపు అక్కర్లేదని, బాగా తెలిసిన భాషలోనే చర్చల్లో పాల్గొనవచ్చునని రాహుల్ సూచించారు. వచ్చే నెల 10 నుంచి మొదలయ్యే బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో ప్రతి సభ్యుడూ పాల్గొనాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

ఉగ్రవాదంపై సంయుక్త ప్రకటన ఏకపక్షం

- అమెరికా-భారత్ ప్రకటనపై పాక్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: సీమాంతర ఉగ్రవాదంపై అమెరికా-భారత్ సంయుక్త ప్రకటన ఏకపక్షం అని పాకిస్థాన్ ఆరోపించింది. ద్వైపాక్షిక సంబంధాలు మూడో పక్షానికి హాని చేయకూడదని చైనా వ్యాఖ్యానించింది. ట్రంప్‌తో మోదీ భేటీ నేపథ్యంలో సంయుక్త ప్రకటన విడుదల చేశారు. గతంలో ఒప్పందం మేరకు తమ భూభాగం సీమాంతర ఉగ్రదాడులకు వేదిక కాకుండా చూసుకోవాలని ఆ ప్రకటనలో పాక్‌కు సూచించారు. దీనిపై పాక్ విదేశీ వ్యవహారాల ప్రతినిధి షఫ్‌ఖత్ ఆలీ ఖాన్ వెంటనే స్పందించారు. ఇది ఏకపక్షమని, తప్పుదారి పట్టించారని, దౌత్య నిబంధనలను విరుద్ధమంటూ విమర్శించారు. తమ త్యాగాలను గుర్తించకుండా ఇలాంటి ప్రకటనలు చేయడం ఆశ్చర్యానికి గురిచేసిందని ఆక్రోశం వెళ్లగక్కారు.

త్వరలోనే ఐఎస్ఎస్‌కు 'నిసార్'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: నాసా, ఇస్రో ఉమ్మడిగా రూపొందించిన భూపరిశీలన ఉపగ్రహం నిసార్‌ను త్వరలోనే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కి పంపుతామని మోదీ వెల్లడించారు. 'నిసార్ ఉపగ్రహం త్వరలో భారతీయ వాహక నౌక ద్వారా అంతరిక్షానికి చేరుతుంది' అని చెప్పారు. వాస్తవానికి దీనిని గత ఏడాదే ప్రయోగించాల్సి ఉండగా.. 12 మీటర్ల రిఫ్లెక్టర్ యాంటెనాలో లోపాల కారణంగా వాయిదా పడింది.

పరస్పర పన్నుతో నష్టమే!

అమెరికా-భారత్ వాణిజ్యంలో ఇప్పటి వరకూ భారత్‌దే పైచేయి

- ఎగుమతులు ఎక్కువ, దిగుమతులు తక్కువ
- అమెరికా కంటే మన సుంకాలు అధికం
- పరస్పర పన్నుతో పరిస్థితి మారే అవకాశం
- ఆటోమొబైల్స్, ఇంధనం, రక్షణ రంగాలపై తీవ్ర ప్రభావం!

(సెంట్రల్‌డెస్క్)


ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 50,000 కోట్ల డాలర్లకు పెంచాలని అమెరికా, భారత్ నిర్ణయించిన నేపథ్యంలో ఆ భారీ నిర్ణయం భారత్‌పై ఎటువంటి ప్రభావం చూపనుంది అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ నిర్ణయం అనుకూలమా? ప్రతికూలమా? అనే అంశంపై పలు విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే, అసలు రెండు దేశాల మధ్య వాణిజ్యం ఏ స్థాయిలో ఉందో ముందు తెలుసుకోవటం అవసరం. 2023లో సరుకులు, సేవలకు సంబంధించి అమెరికా-భారత్ ద్వైపాక్షిక వాణిజ్యం 19,008 కోట్ల డాలర్లుగా నమోదైంది. దీంట్లో సరుకుల వాటా 12,389 కోట్ల డాలర్లు కాగా, సేవల వాటా 6,619 కోట్ల డాలర్లు. ఆ ఏడాది అమెరికాకు భారత్ నుంచి ఎగుమతి అయిన సరుకుల విలువ 8,377 కోట్ల డాలర్లు, దిగుమతుల విలువ 4,012 కోట్ల డాలర్లు. సేవల విషయానికొస్తే.. ఎగుమతుల విలువ 3,633 కోట్ల డాలర్లు. దిగుమతులు 2,986 కోట్ల డాలర్లు. సరుకులైనా, సేవలైనా భారత్ నుంచి అమెరికాకు ఎగుమతులే ఎక్కువగా ఉన్నాయి. దిగుమతులు తక్కువ. ఇది భారత్‌కు అనుకూలమైన పరిస్థితి. గత ఏడాది కూడా ఇదే పరిస్థితి పునరావృతమైంది. ఇరుదేశాల వాణిజ్యం 13,000 కోట్ల డాలర్లకు పెరగగా.. 4500 కోట్ల డాలర్ల మేర భారత్‌కే అనుకూలంగా వాణిజ్యలోటు (ట్రేడ్ గ్యాప్) ఉంది. అయితే, ప్రస్తుతం ఈ పరిస్థితి మారే సూచనలు కనిపిస్తున్నాయి. కారణం, ట్రంప్ ప్రకటించిన పరస్పర పన్నులే (రెసిప్రోకల్ ట్యాక్స్).

మనం విధించే పన్నే అధికం

ప్రస్తుతం అమెరికా ఉత్పత్తులపై (దిగుమతుల మీద) భారత్ సగటున 9.5 శాతం పన్ను విధిస్తుంటే.. భారత్ ఉత్పత్తుల మీద అమెరికా సగటున 3 శాతమే విధిస్తోంది. అంటే, దాదాపు ఆరున్నర శాతం పన్ను భారత్ అధికంగా విధిస్తోంది. పరస్పర పన్ను విధానం అమలులోకి వస్తే.. ఇకపై ఈ రెండూ సమానం అవుతాయి. ఇది రెండు రకాలు.. భారత ఉత్పత్తుల మీద అమెరికా పన్ను భారం పెరగవచ్చు లేదా అమెరికా ఉత్పత్తుల మీద భారత్ సుంకాలు తగ్గవచ్చు. దీని ప్రభావం భారత్‌కు చెందిన ఆటోమొబైల్, టెక్స్‌టైల్ పరిశ్రమల మీద తీవ్రంగా ఉంటుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉదాహరణకు, అమెరికా ఆటోమొబైల్స్ మీద వాటి ఇంజిన్ సామర్థ్యం, విడిభాగాలా లేక పూర్తి వాహనమా అన్న ప్రాతిపదికల ఆధారంగా భారత్ 205 శాతం నుంచి 50 శాతం వరకూ పన్ను విధిస్తోంది. అమెరికాలో తయారయ్యే హార్లీ డేవిడ్‌సన్ బైకుల మీద భారత్ భారీస్థాయిలో పన్ను వేస్తోన్న అంశాన్ని ట్రంప్ గతంలో కూడా ఓసారి లేవనెత్తారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విదేశాల నుంచి దిగుమతి అయ్యే ప్రీమియం బైకుల మీద సుంకాలను కొంత తగ్గించారు. పరస్పర పన్ను విధానం అమలైతే అమెరికా వాహనరంగం దిగుమతుల మీద పన్నును భారత్ మరింత తగ్గించాల్సి ఉంటుంది. రక్షణ, ఇంధన రంగాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. మొత్తమ్మీద 30కిపైగా ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను తగ్గించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మోదీతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కూడా దీనికి అద్దం పడుతున్నాయి. 'రానున్న రోజుల్లో అమెరికా చమురు, సహజవాయువులను భారత్ మరింత అధికంగా దిగుమతి చేసుకునే విధంగా మేం ఒప్పందం కుదుర్చుకున్నాం. దీనివల్ల అమెరికా వాణిజ్యలోటు గణనీయంగా తగ్గుతుంది' అని పేర్కొన్నారు.

అమెరికా సుంకాలు పెంచే అవకాశం

ప్రస్తుతం ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం, ట్రంప్ చెబుతున్న పరస్పర పన్నుల నేపథ్యంలో అమెరికా కూడా భారత ఉత్పత్తులపై సుంకాలను పెంచే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా భారత్ నుంచి తమ దేశానికి ఎగుమతి అయ్యే టెక్స్‌టైల్స్, ఔషధాలు, ముత్యాలు, ఆభరణాలు, స్టీలు, అల్యూమినియం ఉత్పత్తుల మీద అమెరికా సుంకాలు పెంచే అవకాశం ఉంది.





మోదీ... మీరు గొప్ప వారు!

ప్రధానికి 'అవర్ జర్నీ టుగెదర్' పుస్తకం ఇచ్చిన ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలకు కూర్చునే ముందు.. స్వహస్తాలతో సంతకం చేసిన తన పుస్తకం 'అవర్ జర్నీ టుగెదర్' పుస్తకాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా 'మిస్టర్ ప్రైమ్‌మినిస్టర్! యువార్ గ్రేట్' అని దానిపై రాశారు. ఇది 320 పేజీల పుస్తకం. గతంలో అధ్యక్ష పదవిలో ఉన్నప్పటి జ్ఞాపకాలను ట్రంప్ అందులో పొందుపరిచారు. ఆన్‌లైన్‌లో ఈ పుస్తకం ఖరీదు రూ.6,000-6,873 వరకు ఉంది. 2019 సెప్టెంబరు 22న హూస్టన్‌లో ఇద్దరు నేతలు పాల్గొన్న 'హౌడీ మోదీ', 2020 ఫిబ్రవరి 24, 25 తేదీల్లో అహ్మదాబాద్‌లో నిర్వహించిన 'నమస్తే ట్రంప్' కార్యక్రమాల తాలూకు ఫొటోలను కూడా ఇందులో ముద్రించారు. అలాగే మెక్సికోతో సరిహద్దులో గోడ నిర్మాణం, ఫెడరల్ జడ్జీల ధ్రువీకరణ, అంతరిక్ష బలగం ఏర్పాటు, ఉత్తర కొరియా, చైనా, రష్యా అధినేతలు కిమ్ జోంగ్-ఉన్, జీ జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్‌లతో అత్యున్నత స్థాయి సమావేశాల గురించీ అందులో వివరించారు. కాగా.. శుక్రవారం వైట్ హౌస్‌లో మోదీని ఆలింగనం చేసుకున్న ట్రంప్.. ఆయన్ను ఇక్కడ మళ్లీ కలుస్తున్నందుకు ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు. అనంతరం జరిగిన ఉమ్మడి విలేకరుల సమావేశంలో.. 2020లో భారత్‌లో జరిపిన తన చరిత్రాత్మక పర్యటన సందర్భంగా తాజ్‌మహల్‌ను సందర్శించినప్పుడు తీసుకున్న చిరస్మరణీయ ఫొటోను కూడా ట్రంప్ ప్రధానికి అందించారు. తనకు, తన భార్య మెలానియాకు అప్పట్లో మోదీ ఇచ్చిన ఆతిథ్యాన్ని గుర్తుచేసుకున్నారు. తాను కూడా ఇప్పుడు ఆతిథ్యం ఇస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మోదీని ప్రత్యేక వ్యక్తిగా అభివర్ణించారు. తమ సుదీర్ఘ మైత్రిని, గతంలో జరిపిన భేటీలను కూడా ప్రస్తావించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో, ఎలాన్ మస్క్‌లను మోదీకి ట్రంప్ పరిచయం చేశారు.


సుఖోయ్ 57 స్టెల్త్ విమానం

ఎఫ్-35 డీల్ జరిగే పనేనా?

మన రష్యన్ క్షిపణి వ్యవస్థ ఓ అడ్డంకి.. సొంత తయారీకే భారత్ మొగ్గు?

ట్రంప్‌ది ప్రతిపాదన మాత్రమేనన్న భారత విదేశాంగ కార్యదర్శి



ఒక అత్యాధునిక ఆయుధాన్ని ఒక దేశం మరో దేశానికి అమ్మాలంటే? అది ఒక ప్రకటనతో అయ్యేది కాదు. మొదటి దేశం తన ఆయుధాన్ని అమ్మడానికి సిద్ధంగా ఉండాలి. రెండో దేశం దానిని కొనడానికి సిద్ధంగా ఉండాలి. అంతేకాదు... అంతర్జాతీయ పరిస్థితులు, టెక్నాలజీలో వచ్చే మార్పులు ఇవన్నీ అందుకు అనుకూలించాలి. ఎఫ్-35 యుద్ధ విమానాల్ని భారత్‌కు అమ్ముతామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ అది వాస్తవ రూపం దాల్చే విషయంలో ఎన్నో అనుమానాలు, అవాంతరాలు ఉన్నాయి. వాటన్నింటినీ పరిశీలిస్తే ఎఫ్-35 కొనుగోలు ఒప్పందం జరగడానికంటే జరగకపోవడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తుంది.

అమెరికా అమ్ముతుందా?

శుక్రవారం ట్రంప్ చేసిన ప్రకటనలో భారత్‌కు ఎఫ్-35 విమానాల్ని అమ్ముతామని సూటిగా చెప్పలేదు. "అంతిమంగా ఎఫ్-35లను భారత్‌కు అమ్మడానికి మార్గం సుగమం చేస్తాం" అని మాత్రమే అన్నారు. ఇందులో చాలా అంతరార్థం ఉంది. ఎందుకంటే ఎఫ్-35 అయిదో తరం యుద్ధ విమానం. ఇందులోని స్టెల్త్ టెక్నాలజీ చాలా అత్యాధునికమైనది. రాడార్లకు దొరకకుండా ప్రయాణించగల ఈ విమానాల పరిజ్ఞానం శత్రు దేశాల చేతికి ఎట్టి పరిస్థితుల్లోనూ చేరకుండా అమెరికా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలూ తీసుకుంటుంది. దానిని ఎవరికి అమ్మాలనే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. ఎఫ్-35 యుద్ధ విమానాల తయారీలో అమెరికాదే ప్రధాన పాత్ర అయినప్పటికీ అందులో అనేక నాటో దేశాల భాగస్వామ్యం ఉంది. నాటో దేశమైన తుర్కియే కూడా ఒకప్పుడు ఎఫ్-35 ప్రాజెక్టులో భాగంగా ఉండేది. అయితే రష్యాకు చెందిన ఎస్-400 విమాన విధ్వంసక క్షిపణి వ్యవస్థను కొనడానికి తుర్కియే సిద్ధమవ్వడంతో తుర్కియేకు, అమెరికాకు మధ్య విభేదాలు తలెత్తాయి. ఎస్-400లను కొంటే ఎఫ్-35 ప్రాజెక్టు నుంచి మిమ్మల్ని సాగనంపుతామని అమెరికా హెచ్చరించింది, అయినా తుర్కియే అది లెక్క చేయకుండా రష్యా క్షిపణి వ్యవస్థ కొనుగోలుకే మొగ్గుచూపింది. దీంతో టర్కీని అమెరికా బహిష్కరించింది. ఎఫ్-35లు రాడార్లకు దొరకని స్టెల్త్ విమానాలే అయినప్పటికీ రాడార్లను కొన్ని విపరీతమైన ఫ్రీక్వెన్సీల్లో ఆపరేట్ చేసినప్పుడు వాటిని కనిపెట్టే అవకాశం ఉంది. ఒకే దేశం వద్ద ఎఫ్-35 విమానం, ఎస్-400 రాడార్లు ఉన్నప్పుడు ఏయే ఫ్రీక్వెన్సీల్లో దానిని కనిపెట్టవచ్చనే ప్రయోగాలు ఇబ్బడిముబ్బడిగా చేసే అవకాశాలు ఉంటాయి. తద్వారా ఎఫ్-35కు సంబంధించిన బలహీనతలేమిటనే సమాచారం బయటపడి, అది అంతిమంగా రష్యా చేతికి చేరే ప్రమాదం ఉంటుంది. (గతంలో యుగోస్లావియాలో ఒక రాడార్ ఆపరేటర్ ఇలాగే అనూహ్యమైన ఫ్రీక్వెన్సీల్లో రాడార్‌ను ఆపరేట్ చేసి ఎఫ్-117 అనే అమెరికన్ స్టెల్త్ విమానాన్ని కూల్చివేయగలిగాడు) అందువల్లనే టర్కీ విషయంలో అమెరికా అంత కఠినంగా వ్యవహరించింది. ఇప్పుడు భారత్ విషయంలో కూడా అమెరికా ఇదే ప్రశ్నను ఎదుర్కోబోతోంది. రష్యా నుంచి అయిదు ఎస్-400 క్షిపణి వ్యవస్థల్ని కొనడానికి భారత్ 2018లోనే ఒప్పందం కుదుర్చుకుంది. వీటిని కొనవద్దని అప్పట్లోనే అమెరికా చాలా ఒత్తిడి తెచ్చినా భారత్ పట్టించుకోకుండా రష్యాతో ఒప్పందం చేసుకుంది. మూడు రష్యన్ ఎస్-400 వ్యవస్థలు ఇప్పటికే భారత్‌కు అందాయి. మరో రెండు వ్యవస్థలు 2026లోగా డెలివరీ కానున్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్‌కు ఎఫ్-35 విమానాల్ని అమెరికా ఎలా అమ్మగలదు? అనేది చాలా పెద్ద ప్రశ్న. భారత్ ఎస్-400 ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని, తన వద్ద ఇప్పటికే ఉన్న మూడు వ్యవస్థల్ని వేరే దేశానికి అమ్మేయాలని అమెరికా షరతు విధించే అవకాశాలు లేకపోలేదు. ఒకవేళ అమెరికా ఇలా షరతు విధిస్తే భారత్ అందుకు అంగీకరిస్తుందా? రష్యాతో దీర్ఘకాలంగా ఎంతో బలమైన రక్షణ సంబంధాలు ఉన్న భారత్... "మీ క్షిపణి వ్యవస్థలు మాకు వద్దు. మీతో ఒప్పందం రద్దు చేసుకుంటున్నాం" అని రష్యాకు తెగేసి చెప్పి అమెరికన్ విమానాల్ని కొంటుందా? అంటే అలా జరిగే అవకాశాలు చాలా తక్కువే.

భారత్ కొంటుందా?

ఒకవేళ అమెరికా ఎఫ్-35 యుద్ధ విమానాల్ని భారత్‌కు బేషరతుగా అమ్మడానికి సిద్ధపడినా భారత్ వాటిని కొనడానికి సిద్ధంగా ఉంటుందా? అనేది కూడా మరో పెద్ద ప్రశ్న. భారత్ ఇంతవరకూ ఎప్పుడూ ఎఫ్-35లను తమకు అమ్మాలని అమెరికాను కోరలేదు. అమెరికా కూడా వాటిని భారత్‌కు ఆఫర్ చేయలేదు. అయితే ఎఫ్-35 అభివృద్ధి ప్రాజెక్టులో భారత్ కూడా భాగస్వామి అయితే బాగుంటుందన్న ఆకాంక్షను మాత్రం అమెరికా ఒకటి, రెండుసార్లు వ్యక్తం చేసింది. 126 మధ్యశ్రేణి యుద్ధ విమానాల కొనుగోలుకు 2001లో భారత వాయుసేన ప్రతిపాదించింది. భారత్ పిలుపునకు స్పందించి అమెరికా తమ ఎఫ్-16, ఎఫ్-18 విమానాల్ని భారత్‌కు అమ్మజూపింది తప్ప ఎఫ్-35ను ఆఫర్ చేయలేదు. (అప్పటికే ఎఫ్-35 విమానం అనేక ప్రయోగాలు పూర్తి చేసుకుని తయారీలో తుది దశకు చేరుకుంటోంది) 2012లో అంతిమంగా రాఫెల్ విమానాన్ని భారత్ ఎంచుకుంది. అయితే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మోదీ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లి రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందాన్ని 126 నుంచి కేవలం 36కు కుదించారు. ఆ తర్వాత 2018లో భారత వాయుసేన మరో 114 విదేశీ విమానాల కొనుగోలుకు ఆఫర్లు కోరింది. అమెరికా మళ్లీ దీనికి స్పందించి పాత ఎఫ్-16 (ఎఫ్-21 అని పేరు మార్చారు), ఎఫ్-18లతోపాటు ఎఫ్-15ఈఎక్స్ అనే మరో విమానాన్ని బరిలోకి దించింది తప్ప ఎఫ్-35ను మాత్రం భారత్‌కు అమ్మజూపలేదు. భారత వాయుసేన తన చరిత్రలో ఇంతవరకూ ఒక్క అమెరికన్ యుద్ధ విమానాన్ని కూడా కొనలేదు. హెలికాప్టర్లు, రవాణా విమానాలు మాత్రమే కొనుగోలు చేసింది. ఎందుకంటే... అమెరికా తన ఆయుధాలను నాటోయేతర దేశాలకు అమ్మేటప్పుడు చాలా ఆంక్షలు విధిస్తుంటుంది. అంతేకాకుండా తన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర దేశాలతో పంచుకోవడానికి ఎంతమాత్రం ఇష్టపడదు. అందువల్లనే భారత్ అమెరికా ఆయుధాల కొనుగోలు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంటుంది. ఒకవేళ అమెరికా భారత్‌కు ఎఫ్-35లను అమ్మజూపినా... అనేక సాంకేతికపరమైన ఆంక్షలు పెడుతుంది. వాటి వినియోగం విషయంలో కూడా షరతులు పెట్టే అవకాశం ఉంది. అందువల్ల అమెరికా ఇస్తామన్నా ఎఫ్-35ల కొనుగోలుకు భారత్ సిద్ధపడుతుందా అనేది అనుమానమే! అదీ రష్యాతో ఎస్-400 ఒప్పందాన్ని తెగతెంపులు చేసుకుని వీటిని కొనుగోలు చేస్తుందా అంటే మరీ అనుమానమే!! కానీ ట్రంప్ నేరుగా ఆఫర్ చేయడంతో ఈ విషయంలో కొంతమేర కదలిక ఏర్పడి ఒక స్థాయి వరకూ చర్చలు జరిగే అవకాశం మాత్రం ఉంది. ఆ చర్చలు ఫలప్రదమయ్యే స్థాయికి వెళితే మాత్రం అది నిజంగా అద్భుతమే.

ఇది ప్రస్తుతానికి ప్రతిపాదన దశే!

ఎఫ్-35 యుద్ధ విమానాలను భారత్‌కు విక్రయిస్తామన్న ట్రంప్ ప్రకటనపై భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పందించారు. విదేశీ సైనిక ఉత్పత్తుల కొనుగోళ్లకు విస్తృత ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని చెప్పారు. అందులో భాగంగా తయారీదారుల నుంచి ప్రతిపాదనలు కోరడం, వాటిని మదింపు చేయడం వంటివి ఉంటాయని శుక్రవారం విలేకరులతో తెలిపారు. "ఎఫ్-35 లాంటి అధునాతన విమానాలను భారత్ కొనుగోలు చేసే ప్రక్రియ నాకు తెలిసి ఇంకా ఏమీ మొదలు కాలేదు. ఇది ప్రస్తుతం ప్రతిపాదనల దశ మాత్రమే" అని మిస్రీ పేర్కొన్నారు.

ఎఫ్-35 విశిష్టతలివీ...

అమెరికాకు చెందిన మూడు సాయుధ దళాలు ప్రధానంగా యుద్ధ విమానాలను ఉపయోగిస్తుంటాయి. ఒకటి వైమానిక దళం... ఇది నేలపై రన్‌వే నుంచి గాలిలోకి లేచే యుద్ధ విమానాల్ని ఉపయోగిస్తుంది. రెండోది మెరీన్స్.. ఈ దళం చిన్న చిన్న యుద్ధ నౌకల నుంచి హెలికాప్టర్ల మాదిరిగా పైకి ఎగిరే వెర్టికల్ టేకాఫ్ విమానాల్ని ఉపయోగిస్తుంది. మూడోది... నౌకాదళం... ఇది కాటాపల్ట్ (పంగలకర్ర వంటి పరికరం) సాయంతో విమాన వాహక యుద్ధ నౌకల నుంచి టేకాఫ్ అయ్యే విమానం. అయితే ఈ మూడు దళాలూ మూడు భిన్న రకాలైన యుద్ధ విమానాలను ఉపయోగిస్తుండేవి. మొత్తం మూడు దళాలకూ ఉపయోగపడేలా (కొన్ని చిన్న మార్పులతో) ఒకే విమానాన్ని రూపొందించాలన్న ప్రయత్నంలో తయారైనదే ఈ ఎఫ్-35! "మూడు దళాలకూ ఒకే విమానం" అనే కాన్సెప్ట్‌ను అనుసరించి మొదట్లో దీనికి "జాయింట్ స్ట్రయిక్ ఫైటర్" అని పేరు పెట్టారు. దీని తయారీ కాంట్రాక్టు కోసం అమెరికాకు చెందిన బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు పోటీ పడగా చివరికి లాక్‌హీడ్ సంస్థ కాంట్రాక్టును దక్కించుకుంది. సింగిల్ ఇంజిన్‌తో నడిచే ఈ విమానం రాడార్లకు చిక్కని స్టెల్త్ టెక్నాలజీతో రూపొందింది. ఇందులో ఎయిర్‌ఫోర్స్ వెర్షన్‌కు ఎఫ్-35ఎ, మెరీన్ వెర్షన్‌కు ఎఫ్-35బి, నేవీ వెర్షన్‌కు ఎఫ్-35సి అని పేరు పెట్టారు. వీటిలో వాయుసేన వెర్షన్‌ను మాత్రమే భారత్ కొనే అవకాశం ఉంది. ఎందుకంటే నేవీ కోసం ఫ్రెంచి రాఫెల్ (ఎం) విమానాల కొనుగోలుకు భారత్ ఇప్పటికే దాదాపు ఒప్పందం కుదుర్చుకుంది. ఎఫ్-35 విమానం వివిధ సెన్సర్ల ద్వారా అందే సమాచారాన్ని కలిపి విశ్లేషించి పైలట్‌కు కచ్చితమైన సమాచారం, సూచనలు ఇవ్వడం.. అలాగే ఇతర విమానాలు, నేల మీద ఉండే రాడార్ల నుంచి సమాచారాన్ని సేకరించడం, వాటికి సమాచారం ఇవ్వడం (డేటా లింక్స్) ద్వారా గొప్ప నెట్‌వర్కింగ్ చేయగలదు. ఇతర ఆయుధ వ్యవస్థలన్నింటినీ శక్తిమంతంగా మార్చగలదు. తనతో నెట్‌వర్క్ అయిన ప్రతి ఆయుధమూ స్వీయ శక్తిసామర్థ్యాలకు మించి శత్రువుపై దాడి చేసేలా ఇది తోడ్పడగలదు.

భారత్ కొంటే మంచిదే!

అమెరికా ఎఫ్-35లను భారత్‌కు అమ్ముతుందా, వారు అమ్మినా భారత్ కొంటుందా అనే ప్రశ్నలు ఎలా ఉన్నా వీటి కొనుగోలు భారత్‌కు మేలు చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే ఎఫ్-35 అనేది అయిదో తరం స్టెల్త్ విమానం. భారత్ అయిదో తరం విమాన టెక్నాలజీలో బాగా వెనుకబడి ఉందని, ఇది దేశ భద్రతకు అంత మంచిది కాదని పలువురు రక్షణ నిపుణులు ఇటీవల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల భారత వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ కూడా ఈ తరహాలో కొన్ని వ్యాఖ్యలు చేశారు. అయిదో తరం స్టెల్త్ విమానాల తయారీలో చైనా ముందుకు దూసుకువెళుతోంది. జే 20 అనే స్టెల్త్ విమానాలు ఇప్పటికే చైనా వాయుసేనలో పెద్దసంఖ్యలో సేవలు అందిస్తున్నాయి. జే 31 అనే మరో స్టెల్త్ విమానాన్ని కూడా చైనా అభివృద్ధి చేసింది. ఈ జే 31 విమానాల్ని తాము చైనా నుంచి కొనబోతున్నట్లు పాకిస్థాన్ ఇటీవల ప్రకటించింది. 2028 నుంచి ఈ విమానాలు పాక్‌కు అందనున్నాయి. అయితే భారత్ వద్ద ఒక్క అయిదో తరం స్టెల్త్ విమానం కూడా లేదు. మన వద్ద ఉన్న విమానాలన్నీ మూడో తరం, నాలుగో తరం, లేదా 4.5 జనరేషన్ విమానాలే. ఏవీ స్టెల్త్ విమానాలు కావు. భారత్ వద్ద ఉన్న అత్యాధునిక రాఫెల్ (ఫ్రెంచి) విమానంలో కూడా స్టెల్త్ పరిజ్ఞానం లేదు. స్టెల్త్‌కు ప్రత్యామ్నాయంగా అందులో "యాక్టివ్ కాన్సిలేషన్" అనే పరిజ్ఞానం ఉన్నట్లు చెబుతున్నా దాని పనితీరుపై రక్షణ నిపుణులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆమ్కా (ఏఎంసీఏ) పేరుతో అయిదో తరం స్టెల్త్ విమానం తయారీని భారత్ ప్రారంభించింది. అయితే దీని తయారీకి చాలా కాలం పట్టనుంది. మొదటి విమానం 2036 నాటికి వాయుసేనకు చేరవచ్చని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) అధికారులు చెబుతున్నారు. అయితే గతానుభవాల్ని బట్టి చూస్తే ఆ గడువు 2040 వరకూ పాకిపాకి పోవచ్చు. అంటే మరో 15 సంవత్సరాలపాటు చైనా నుంచి, పాకిస్థాన్ నుంచి స్టెల్త్ విమానాల ముప్పును ఎదుర్కొంటూ భారత్ అతి జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో అమెరికా నుంచి ఎఫ్-35లను భారత్ త్వరగా కొనుగోలు చేయగలిగితే ఆ ముప్పును దీటుగా ఎదుర్కొనే అవకాశం ఏర్పడుతుంది. మన వాయుసేనకు స్టెల్త్ విమానాలను నడపడంలో, నిర్వహించడంలో తగిన అనుభవం వస్తుంది. అలాగే స్టెల్త్ విమానాల అభివృద్ధి విషయంలో మన రక్షణ పరిశోధన సంస్థలకు మరింత అవగాహన కూడా ఏర్పడుతుంది. అయితే తన సొంత స్టెల్త్ విమానం ఆమ్కా అందుబాటులోకి వచ్చేవరకు ఒక స్టాప్ గ్యాప్ ఏర్పాటుగా మాత్రమే భారత్ ఎఫ్-35ల కొనుగోలుకు మొగ్గు చూపవచ్చు. అంటే చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే ఈ విమానాల్ని కొనాల్సి ఉంటుంది. కానీ ఈ విమానాల కొనుగోలు ఖర్చు కంటే వీటిని నిర్వహించడానికి అయ్యే ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. తక్కువ సంఖ్యలో విమానాల్ని కొంటే తలసరి నిర్వహణ వ్యయం తడిసి మోపెడవుతుంది. అందువల్ల తాత్కాలిక అవసరాల కోసం భారత్ వీటిని కొనే అవకాశాలు చాలా తక్కువనే చెప్పాలి.


ఎస్-400 విమాన విధ్వంసక క్షిపణి

హఠాత్తుగా అమెరికా ఆఫర్ ఎందుకొచ్చింది?

ఎఫ్-35 విమానాల్ని భారత్‌కు అమ్మడానికి ఇంతకాలం ఆసక్తి చూపని అమెరికా ఇప్పుడు అకస్మాత్తుగా ఆ ప్రతిపాదన ఎందుకు చేసిందనేది ఆసక్తికరం. ప్రపంచంలో ఏటా అత్యధికంగా ఆయుధాల్ని కొనుగోలు చేసే దేశం భారత్. అయితే ఇటీవల విదేశీ కొనుగోళ్లు తగ్గించి స్వదేశీ విమానాల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. కానీ అయిదో తరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ విషయంలో మన దేశం వెనకబడింది. ఆ లోటును పూడ్చుకోవడం కోసం విదేశాల నుంచి వాటి కొనుగోలుపై ప్రభుత్వం దృష్టి పెట్టబోతోందనే వార్తలు ఇటీవల వస్తున్నాయి. తాజాగా బెంగళూరులో జరిగిన ఏరో ఇండియా ప్రదర్శనలో ఎఫ్-35తోపాటు రష్యాకు చెందిన సుఖోయ్ 57 స్టెల్త్ విమానం కూడా పాల్గొంది. గతంలో సుఖోయ్ 57 విమానం అభివృద్ధి ప్రాజెక్టులో భారత్ కూడా రష్యాతో కలిసి భాగస్వామిగా ఉండేది. అయితే ఆ విమానానికి సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌తో పూర్తిగా పంచుకోవడానికి రష్యా ఇష్టపడకపోవడంతో భారత్ ఆ ప్రాజెక్టు నుంచి వైదొలగింది. ప్రస్తుతం వైదొలగినా తర్వాతి దశలో భారత్ తిరిగి అందులో పాలుపంచుకునే అవకాశం ఉన్నట్టు నాడు రక్షణ మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్ అప్పట్లో చెప్పారు. ఇటీవల ఏరో ఇండియా ప్రదర్శన నేపథ్యంలో భారత్ సుఖోయ్ 57 విమానాలను కొనబోతోందనే వార్తలు బాగా జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ రష్యా వైపు వెళ్లకుండా తమ వైపు ఆకర్షించేందుకే ట్రంప్ ఈ ప్రకటన చేసి ఉండవచ్చనే అభిప్రాయం రక్షణ నిపుణుల్లో వ్యక్తమవుతోంది.

- రక్షణ ప్రత్యేక ప్రతినిధి, ఆంధ్రజ్యోతి

ముంబై ఉగ్ర దాడి కేసు ముందుకు!

- కీలక నిందితుడి అప్పగింతకు అమెరికా ఓకే
- ప్రస్తుతం లాస్‌ఏంజెలెస్ జైల్లో ఉన్న తహవూర్ రాణా
- 26/11 ఉగ్ర దాడి వెనక పాక్ నేతల పాత్రను వెలుగులోకి తెచ్చే అవకాశం!



న్యూఢిల్లీ/వాషింగ్టన్ డీసీ, ఫిబ్రవరి 14: ముంబై 26/11 ఉగ్ర దాడుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక సూత్రధారిగా దర్యాప్తు సంస్థలు పేర్కొంటున్న తహవూర్ హుస్సేన్ రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా అంగీకరించింది. రాణాను విచారిస్తే ముంబై దాడుల వెనక పాకిస్థాన్ నాటి ప్రభుత్వ పెద్దల హస్తంపైనా దర్యాప్తు అధికారులు ఆధారాలు సంపాదించే అవకాశం ఉంటుందని సమాచారం. దాడుల వెనక పాక్ పాత్రను కూడా బయటపెడతారని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. 2008 నవంబరు 26న 10 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సముద్ర మార్గంలో ముంబై చేరుకొని.. తాజ్‌మహల్, ఒబెరాయ్ హోటళ్లు, రైల్వే స్టేషన్, యూదుల సెంటర్‌పై విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో 166 మంది మరణించగా.. వారిలో అమెరికన్లు, బ్రిటిషర్లు, ఇజ్రాయెలీలు కూడా ఉన్నారు. దాదాపు 60 గంటల పాటు జరిగిన భీకర దాడులతో యావత్ దేశమే వణికిపోయింది. ఒక దశలో భారత్.. పాకిస్థాన్‌పై యుద్ధానికి కూడా సన్నద్ధమైంది. ముంబైలో ఉగ్రవాదులు దాడులకు ఎంచుకున్న ప్రాంతాల్లో చాలా ముందుగానే డేవిడ్ కోల్మన్ హెడ్లీ రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. అతడికి పాకిస్థాన్‌కు చెందిన కెనడా దేశస్థుడు తహవూర్ రాణా సహకరించినట్లు గుర్తించారు. రాణ ట్రావెల్ ఏజెన్సీ నిర్వహిస్తున్న సమయంలో అతనికి హెడ్లీ పరిచయమయ్యాడు. ముంబైలో ఉగ్రవాదుల దాడులకు అవసరమైన బ్లూప్రింట్ తయారీలో రాణా హస్తం ఉంది. రాణా, హెడ్లీపై ఉగ్ర దాడులు, కుట్ర కేసులు నమోదు చేశారు. రాణాకు పాక్‌కు చెందిన ఐఎస్ఐతోనూ సంబంధాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. 2008 నవంబరు 11న భారత్‌కు వచ్చిన రాణా.. 21వ తేదీ వరకు దేశంలోనే ఉన్నాడు. మధ్యలో రెండు రోజులు ముంబైలోని ఓ హోటల్‌లో బస చేసినట్లు దర్యాప్తు అధికారులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. రాణా, హెడ్లీ ఈ మెయిల్ ద్వారా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారని.. వాటిలో 26/11 దాడుల సమాచారం కూడా ఉందని వెల్లడించారు. 26/11 ముంబై ఉగ్రదాడులు జరిగిన ఏడాది తర్వాత.. 2009 అక్టోబరులో షికాగో ఎఫ్‌బీఐ అధికారులు రాణాను అదుపులోకి తీసుకున్నారు. అతను ప్రస్తుతం లాస్ ఏంజెలెస్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. రాణాకు పాక్ ఉగ్ర సంస్థలు లష్కరే తాయిబా, హర్కతుల్ జిహాదీ ఇస్లామీతో సంబంధాలు ఉన్నాయని, ముంబై దాడుల్లో అతని భాగస్వామ్యం ఉందని భారత్ ఆరోపించింది. రాణాను అప్పగించాలంటూ చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తోంది.

హెచ్-1బీ పునరుద్ధరణలో మరింత జాప్యం

- డ్రాప్‌బాక్స్ అర్హత 12 నెలలకు కుదింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: అమెరికా వీసాలను రెన్యువల్ చేసుకోవాలనుకొనే భారతీయ దరఖాస్తుదారులకు సరికొత్త చిక్కులు ఎదురుకానున్నాయి. వీసా ఇంటర్వ్యూ మినహాయింపుల(డ్రాప్‌బాక్స్) అర్హతను అమెరికా విదేశాంగ శాఖ 48నెలల నుంచి ఒక్కసారిగా 12నెలలకు కుదించింది. తాజా నిబంధన ప్రకారం గత 12 నెలల్లో గడువు తీరిన వీసాలను మాత్రమే ఇంటర్వ్యూ లేకుండా రెన్యువల్ చేసుకొనే అవకాశం ఉంటుంది. తక్షణమే అమలులోకి రానున్న ఈ మార్పుతో హెచ్-1బీ, బీ1/ బీ2 తదితర నాన్‌ఇమిగ్రెంట్ వీసాదారులపై తీవ్ర ప్రభావం పడనుంది. దీనికి సంబంధించి ఇంకా అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ వీసా దరఖాస్తు కేంద్రాలు(వీఏసీ) ఇప్పటికే కొత్త నిబంధనలు అమలు చేయడం ప్రారంభించాయి. తాజా మార్పులతో భారత దరఖాస్తుదారులకు వీసా రెన్యువల్ మరింత ఆలస్యం కానుంది. ఇప్పటికే ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా వంటి ప్రధాన నగరాల్లో వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ల కోసం దరఖాస్తుదారులు 400 రోజులకుపైగా నిరీక్షిస్తున్నారు. ఇప్పుడు వీసా గడువు తీరి ఏడాది దాటిన వారంతా మళ్లీ వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్న నిబంధనతో అమెరికా కాన్సులేట్లలో ఇంటర్వ్యూలకు డిమాండ్ పెరగడంతో పాటు వాటికోసం అభ్యర్థులు వేచి చూడాల్సిన సమయం కూడా పెరగనుంది.

అక్రమ వలసదారులు ఇంటికే!

ట్రంప్ నిర్ణయానికి మోదీ మద్దతు

- 119 మందితో నేడు భారత్‌కు విమానం



అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను వారి స్వదేశాలకు పంపే విషయంలో ట్రంప్ తీసుకుంటున్న చర్యలకు ప్రధాని మోదీ మద్దతు పలికారు. చట్టవిరుద్ధంగా అమెరికాలో నివసిస్తున్న భారతీయులను స్వదేశానికి పంపిస్తే వెనక్కి తీసుకుంటామని ప్రకటించారు. దీంతో అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులంతా కాస్త ఆలస్యంగానైనా తిరిగి స్వదేశానికి తరలివచ్చే పరిస్థితి నెలకొంది. అమెరికాలో మొత్తం 1.4 కోట్ల మంది అక్రమ వలసదారులు ఉన్నట్టు అంచనా. ఇందులో సుమారు 7,25,000 మంది భారతీయులు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. గుజరాత్, పంజాబ్‌లోని కొందరు ఏజెంట్ల ద్వారా 2021-24 మధ్యలోనే దాదాపు 4,300 మంది భారతీయులు అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఇటీవల ప్రకటించింది. ఏదేమైనా అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 7,25,000 మంది భారతీయులంతా స్వదేశానికి తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. మరోపక్క, తమ దేశంలో 2.5 కోట్ల మంది అక్రమ వలసదారులు ఉన్నారని అంటున్న ట్రంప్ ప్రభుత్వం దాదాపు 14 లక్షల మందికి ఇప్పటికే డిపోర్టేషన్ నోటీసులు కూడా పంపింది. చాలా మందిని స్వదేశాలకు తరలించింది. ఇందులో భాగంగా ఇటీవల 104 మంది అక్రమ వలసదారులను భారత్‌కు తిరిగి పంపింది. 119 మంది అక్రమ వలసదారులతో శనివారం మరో విమానం అమృత్‌సర్‌కు చేరుకోనుండగా.. ఆదివారం మరికొంతమందితో ఇంకో విమానం కూడా రాబోతుంది. అమెరికా భారతీయ అక్రమ వలసదారులను వెనక్కి పంపడం కొత్తేమీ కాదు. 2024లో బైడెన్ ప్రభుత్వం 1529 మంది భారతీయులను తమ దేశం నుంచి వెనక్కి పంపింది.

మోదీ ప్రకటనతో ఏం అవుతుందంటే...

అక్రమ వలసదారుల అంశంలో ట్రంప్ చర్యలకు మోదీ మద్దతు పలకడంతో అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయుల గుర్తింపు, వారిని స్వదేశానికి పంపించే ప్రక్రియ వేగవంతం కానుంది. ఆయా వ్యక్తుల పౌరసత్వ నిర్ధారణకు భారత ప్రభుత్వం కూడా అమెరికాకు సహకరిస్తుంది. ఈ సహకారం వల్ల అమెరికా-భారత్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయి. అక్రమ వలసదారులను తిరిగి స్వదేశానికి రానివ్వడం వల్ల భారత ప్రభుత్వం కూడా ప్రతిపక్షాల నుంచి కొన్ని ఒత్తిడులు ఎదుర్కొనే అవకాశముంది.

భారత్‌లో మీ క్యాంపస్‌లు తెరవండి

- అమెరికా వర్సిటీలకు మోదీ ఆహ్వానం


అమెరికా పర్యటన ముగించుకొని భారత్ చేరుకున్న మోదీ

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: భారత్‌లో క్యాంపస్‌లను తెరవాలంటూ అమెరికాలోని విశ్వవిద్యాలయాలకు మోదీ ఆహ్వానం పలికారు. తద్వారా భారతీయ విద్యార్థులకు స్వదేశంలోనే నాణ్యమైన విద్యావకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. తమ విద్యాసంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి, విదేశీ విద్యను సులభతరం చేయడానికి, మనదేశంలో అమెరికా విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లను నెలకొల్పే అవకాశాలను పరిశీలించడానికి భారత్-అమెరికా దేశాలు అంగీకరించాయి. గురువారం వైట్‌హౌస్‌లో ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య జరిగిన సుదీర్ఘ చర్చల్లో భాగంగా విద్యార్థులు, పరిశోధకులు, ఉద్యోగుల రాకపోకల కారణంగా ఇరుదేశాలూ లబ్ధిపొందాయని గుర్తించారు. 'ఓపెన్ డోర్స్' నివేదిక ప్రకారం.. ఉన్నత విద్య కోసం అమెరికా వెళుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. 2023-24 విద్యాసంవత్సరంలో అమెరికాలో చదువుకుంటున్న భారతీయుల సంఖ్య 3,31,602. ఇది 2022-23 విద్యాసంవత్సరంతో పోల్చితే 23శాతం ఎక్కువ. ఆ సంవత్సరంలో ఈసంఖ్య 2,68,923 మాత్రమే! ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలకు ప్రాముఖ్యత ఉందనే విషయాన్ని నొక్కి చెబుతూ.. 3లక్షలకు పైగా భారతీయ విద్యార్థుల కారణంగా.. ప్రతి ఏడాది అమెరికా ఆర్థిక వ్యవస్థకు 8 బిలియన్ డాలర్ల మేర లబ్ధి కలుగుతోందని, ఫలితంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీస్థాయిలో ఉద్యోగాల కల్పనకు అవకాశం కలుగుతోందని ఇరుదేశాధినేతలు పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌పై నిర్ణయం మోదీదే!

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: "బంగ్లాదేశ్‌పై నిర్ణయాన్ని మోదీకే వదిలేస్తున్నా..." ఇది ప్రధాని మోదీ అమెరికా పర్యటన ముగింపు సందర్భంగా... శుక్రవారం ఏర్పాటు చేసిన సంయుక్త విలేకరుల సమావేశంలో బంగ్లాదేశ్ విషయమై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందన. మరోవైపు బంగ్లాదేశ్‌లో గత ఏడాది షేక్ హసీనా పాలనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలను అదుపు చేసే క్రమంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందంటూ ఐక్యరాజ్య సమితి(యూఎన్) ఇటీవల ఒక నివేదిక విడుదల చేసింది. దీంతో ఆ దేశ రాజకీయం వేడెక్కింది. బంగ్లాదేశ్ ప్రతిపక్ష పార్టీ బీఎన్‌పీ.. హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించాలని భారత్‌ను కోరింది. హసీనా సామూహిక హత్యలకు పాల్పడ్డారని, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామిక వ్యవస్థలను నాశనం చేశారని యూఎన్ నివేదిక ఆరోపించిందని ఆ పార్టీ కీలక నేత చెప్పారు.

మస్క్ పిల్లలకు 'పంచతంత్ర'!

బహుమతిగా ఇచ్చిన ప్రధాని మోదీ



వాషింగ్టన్, ఫిబ్రవరి 14: ఎలాన్ మస్క్ సంతానానికి ప్రధాని మోదీ అమూల్యమైన బహుమతులను అందజేశారు. విష్ణుశర్మ నీతికథలు 'పంచతంత్ర' అందులో ప్రముఖమైనది. అలాగే రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన 'క్రిసెంట్ మూన్', ది గ్రేట్ ఆర్కే నారాయణన్ కలెక్షన్స్'లను కూడా అందించారు. గురువారం వాషింగ్టన్ డీసీలోని బ్లెయిర్‌హౌస్‌లో మస్క్ తన భాగస్వామి షివోన్ జిలిస్, ముగ్గురు పిల్లలతో తనను కలిసినప్పుడు.. తానిచ్చిన పుస్తకాలను ఆ పిల్లలు చదువుతున్నప్పటి ఫొటోలను మోదీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. మస్క్‌తో అంతరిక్షం, మొబిలిటీ, టెక్నాలజీ, ఆవిష్కరణలపై తాను చర్చించానన్నారు. 'కనిష్ఠ ప్రభుత్వం.. గరిష్ఠ పాలన' సూత్రాల ఆధారంగా దేశ పాలనకు కొత్త రూపు ఇచ్చేందుకు చేస్తున్న కృషిని వివరించినట్లు తెలిపారు. ఎలాన్ మస్క్ కూడా ప్రధాని మోదీకి అరుదైన బహుమతి ఇచ్చారు. తన స్పేస్‌ఎక్స్ రాకెట్ హీట్‌షీల్డ్ టైల్‌ను కానుకగా ఇచ్చారు. షడ్భుజాకారంలో ఉండే ఈ సెరామిక్ టైల్స్.. అంతరిక్షంలోకి వెళ్లిన రాకెట్ తిరిగి భూమి మీదకు వచ్చే క్రమంలో కీలకంగా మారతాయి. రాకెట్ తిరిగి భూవాతవరణంలోకి వచ్చే సయమంలో విపరీతమైన ఘర్షణ ఏర్పడుతుంది. ఆ సమయంలో దాని నుంచే పుట్టే వేడి నుంచి ఈ సిరామిక్ టైల్స్ దానిని రక్షిస్తాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.